Dwaraka



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
సంపుటిp11 | సంచిక 73a
శనివారం | 6 జనవరి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



అనుగ్రహం: శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్య మాసం, బహుళ పక్ష తిథి : పంచమి రా.11.02, మఖ ఉ.8.04, వర్జ్యం మ.3.46 నుంచి 5.19 వరకు, రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుంచి 7.36 వరకు, సూర్యోదయం : ఉ. 6.51 గం; సూర్యాస్తమయం: సా. 5.52 గం.

సగం మందికి టిక్కెట్ హుళక్కే!

పనితీరు బాగుంటేనే మరో చాన్స్



- ప్రభుత్వ పాలన భేష్ • సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజల్లో సానుకూలత
- కొంత మంది ఎమ్మెల్యేల వ్యవహార శైలి తీవ్ర వ్యతిరేకత • పార్టీకి భారంగా పరిణమించే ఛాన్స్
- తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు, జంప్ జిలానీలకు రానున్న ఎన్నికల్లో టికెట్లు కష్టమే
- ఇప్పటికే జాబితా రూపొందించిన గులాబీ దళపతి

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ సర్కార్ పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతున్నప్పటికీ, కొంతమంది ఎమ్మెల్యేల పనితీరు పార్టీ విజయావకాశాలపై ప్రబావం చూపే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ భారంగా పరిణమించిన ఎమ్మెల్యేలతో కూడిన బ్లాక్‌లిస్టు ఒకటి పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించారన్న ప్రచారం జోరందుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ చేయించిన సర్వేలోను కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపట్ల ప్రజల్లో తీవ్ర వ్యక్తమయినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలతోపాటు, ఇతర పార్టీల నుంచి కారెక్కిన పలువురు శాసనసభ్యులకు రానున్నా ఎన్నికల్లో టికెట్లు దక్కే అవకాశాల్లేవని అధికారపార్టీ వర్గాలే చెబుతు న్నాయి. ప్రజాసంబంధాలు నెరపకుండా పలువురు ఎమ్మెల్యేలు తమ సొంత ప్రయోజనాల కోసం వ్యాపార కార్యకలపాల్లో మునిగితేలుతూ, పార్టీకి భారంగా మారుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరి కొంతమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వ ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించి అభాసుపాలుకాగా, ఇంక కొందరిపై భూకబ్జా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలి సారిగా ఎన్నికైన కొంతమంది ఎమ్మెల్యేలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ అధికారులకు టార్గెట్లు విధిస్తుండడం సర్వత్రా చర్చానీయాశంగా మారింది.

పథకాలు భేష్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల ద్వారా సాగు, తాగునీరందించే ప్రయత్నాలు జరుగుతుండగా, ఇక కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నమైన కోటి ఎకరాలకు నీరందించే స్వప్నం నెరవేరనుంది. ఇప్పటికే పెం





డింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన టీఆర్ఎస్ సర్కార్, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మల్లన్న సాగర్ నిర్మాణం ద్వారా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేసే ప్రయత్నాన్ని మిగతా 6లో

రోగాలతో బాధ పడుతున్నా
కనీస శిక్ష విధించండి

కోర్టును అభ్యర్థించిన లాలూ ప్రసాద్ యాదవ్

- లాలూకి శిక్ష ఖరారు తీర్పు నేటికి వాయిదా • నేడు మధ్యాహ్నం 2 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెల్లడి • లాలూకు శిక్ష తగ్గించాలని పిటిషన్ • మీడియాకు తెలిపిన చిత్తరంజన్ సిన్హా
- జైలులో చలిగా ఉందన్న లాలూ • తబలా వాయించమని సలహా



రాంచీ : దాణా కుంభకోణం కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ సహా దోషులకు శిక్ష ఖరారు మరోసారి వాయిదా పడింది. లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆయనకు తక్కువ శిక్ష విధించాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది చిత్తరంజన్ సిన్హా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయన ఝార్ఖండ్ రాంచీలోని సీబీఐ కోర్టు నుంచి బయటకు వచ్చిన తరువాత మీడియాతో మాట్లాడారు. ఈ కుంభకోణం కేసులో దోషులకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జడ్జి శిక్ష ఖరారు చేస్తారని ఆయన స్పష్టం చేశారు. దాణా కుంభకోణం కేసులో ఝార్ఖండ్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు దోషులకు శిక్ష ఖరారు చేయనున్న విషయం తెలిసిందే. కాగా, ఆర్జేడీ అధినేత, దోషి లాలూ ప్రసాద్ యాదవ్ వయసు, ఆరోగ్య పరిస్థితులను మిగతా 6లో

గట్టెక్కని ట్రిపుల్ తలాక్

- గందరగోళం నడుమ పార్లమెంట్ నిరవధిక వాయిదా • రాజ్యసభ గడపదాటని ట్రిపుల్ తలాక్ బిల్లు • చివరి రోజూ వాదులాట
- లోక్‌సభలో 12 బిల్లులకు ఆమోదం • శీతాకాల భేటీలో వాడివేడి చర్చలు • 29 నుంచి బడ్జెట్ సమావేశాలు



న్యూఢిల్లీ : రాజకీయంగా విపరీతమైన వేడిని పుట్టించిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గందరగోళం నడుమ ఉభయసభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లు మిగతా 6లో

గవర్నర్‌తో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

- గవర్నర్ తీరు తీవ్ర అభ్యంతరకరం • ఇసుకాసురులు రెచ్చిపోతున్నా మాట్లాడరేం • టీఆర్ఎస్ సర్కారు హత్యలకు అడ్డేలేదా? • నేతల వాగ్వాదంతో గవర్నర్ కినుక

12లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్

- ఈ సంవత్సరం నుంచే మొదలు పెడుతున్నాం • వెల్లడించిన కేసీఆర్ • రైతులకు అండగా ప్రభుత్వం
- రైతుల్లో ధైర్యాన్ని నింపాలి • బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది • ప్రభుత్వ చర్యలతో మార్పు కనిపిస్తోంది
- రైతు సమన్వయ సమితుల ద్వారా కొనుగోలు, విక్రయాలు • మంత్రి పోచారం అధ్యక్షతన మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు • ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి నిధుల కొరత లేదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెడతామని ప్రకటించారు. రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతో పాటు, మద్దతు అందించడం కోసం కొంత నిధిని కూడా బడ్జెట్లో కేటాయిస్తామని చెప్పారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికయ్యే ఖర్చును ముందే అంచనా వేసి, బడ్జెట్లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య మిగతా 6లో

అంతే ఇంతే!



తబలాలు తెచ్చాను లాలూకు ఇవ్వాలా సార్...

బడి పిల్లలకు రూ. 15 వేలు

ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం

- చిత్తూరు జిల్లాకు చంద్ర గ్రహణం పట్టుకొంది • నాలుగేళ్లుగా పింఛన్లు ఇవ్వలేని విషయం బాబుకు ఇప్పుడు తెలుస్తోందా? • సిగ్గుపడాల్సింది ప్రజలు కాదు చంద్రబాబు • ఇచ్చిన హామీలు విస్మరించినందుకు ఓటు వేయాలా ? • ప్రజాసంకల్ప యాత్రలో చంద్రబాబుపై వై.ఎస్.జగన్ ధ్వజం

చిత్తూరు, మేజర్‌న్యూస్‌: పిల్లలను బడికి పంపితే ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం 53వ రోజు పాదయాత్రను ఆయన పుంగనూరు నియోజకవర్గం కురవల్లి శివారు నుంచి ప్రారంభించారు. గండ్లఎల్లి, కంభంవారిపల్లి మీదుగా కందూరి క్రాస్ చేరకున్న వైఎస్ జగన్ ఇక్కడ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి డాక్టర్, ఇంజనీర్ కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత ఇచ్చే వెయ్యి రూపాయల పింఛన్‌ను రెండువేలకు పెంచుతామని హామి ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పింఛన్ వయసును 45 ఏళ్లకు తగ్గిస్తామన్నారు. ఇక జగన్‌కు



ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలుకుతున్నారు. కందూరు క్రాస్ నుంచి సదాం, భట్టువారిపల్లి, గొడ్డవారిపల్లి వరకు ఆయన మిగతా 6లో

ఎడ్యుకేషనల్ హబ్‌గా అమరావతి

విజయవాడ, సూర్య బ్యూరో : కైకలూరు నియోజకవర్గంలోని ఆటపాక, పులపర్రు గ్రామంలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 12 కేంద్ర విశ్వవిద్యాలయలను మంజూరు చేసింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమరావతిని ఎడ్యుకేషనల్ హాబ్‌గా మారుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వెంటనే కేంద్ర విశ్వవిద్యాలయలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటయిస్తుందన్నారు. ఒకే కుటుంబం లో అర్హులైన వారికి రెండవ పెన్షన్ ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లోటులో ఉన్నప్పటికి సంక్షేమ పథకాలను బాగా అమలుచేస్తూ చంద్రన్న భీమా, సంక్రాంతి కానుకలను ప్రజలకు అందిస్తుంది. కొల్లేటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. కొల్లేరు లోని రాయితీ భూములను సొసైటీలకు పంచేవిధంగా చర్యలు. కైకలూరు లో రూ.8 కోట్లతో అధునాతన వసతులతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం. రూ1.28 కోట్లతో కైకలూరులో పాత ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి. రూ.814 కోట్లతో గుడివాడలో వంద పడకల ఆసుపత్రి అభివృద్ధి. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్, రేషన్, గ్యాస్, ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆటపాక, పులపర్రులో మంత్రి ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కైకలూరు మండలం ఆటపాక గ్రామంలో రూ.47 లక్షల వ్యయంతో 13 ఎకరాల్లో మంచి నీటి వసతి నిర్మాణం, ఆటపాక గ్రామంలో రూ.3.62 కోట్లతో అండర్ డ్రైనేజ్ ఏర్పాటు, ఆటపాక గవర్నమెంట్ హైస్కూల్ లో ఫర్నిచర్, మరుగుదొడ్ల నిర్మాణంకు రూ.36 లక్షలు మంజూరు జాన్ పేట బాలికల హైస్కూల్ కు రూ.25 లక్షలు మంజూరు పిట్టలదొడ్డి గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం. రాబోవు రెండు సంవత్సరాలలో పులపర్రులోని అన్ని రోడ్లను 100శాతం సీసీ రోడ్లు గా మారుస్తాం. మండవల్లి మండలం పులపర్రు గ్రామంలోని కాకతీయనగర్ లో మంచినీటి,రోడ్ల సమస్యను త్వరలో పరిష్కారిస్తాం.



శహభాష్ కేటీఆర్!

- అనధికార బ్యానర్లు, ఫ్లెక్లీలపై కొరఢా
- మంత్రి పర్యటనలో భారీగా అనధికార ఫ్లెక్సీలు
- నగర సుందరీకరణే లక్ష్యంగా అడుగులు
- తమ పార్టీకి చెందిన కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లకు ఫైన్
- మంత్రి ఆదేశంతో జరిమానా విధించిన అధికారులు
- వెంటనే జరిమానా చెల్లించిన కార్పొరేటర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటిశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు నగర ప్రజల నుంచి మరో మారు ప్రశంసలు అందుకున్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే మరో పక్క బ్యానర్లు, ఫ్లెక్సీలతో నగర సుందరీకరణను దెబ్బతీస్తున్నారని, అలాంటి వారిపై భారీగా జరిమానా విధించాలని అదేశించారు. అయితే తమ పార్టీకి చెందిన కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లకు భారీ ఎత్తున జరిమానా విధించాలంటూ ఆదేశించడాన్ని నగర ప్రజలు శభాష్...కేటీఆర్ అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారంనాడు మలక్‌పేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అనధికారిక బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటుపై కొరఢా జులిపించారు. మంత్రి రాక సందర్భంగా టీఆర్ఎస్‌పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మంత్రికి స్వాగతం పలుకుతూ అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర సుందరీకరణలో భాగంగా అనధికారిక ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించి, చర్యలు తీసుకోవాలంటూ గతంలోనే మంత్రి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే!. అయితే తన పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లకు సంబంధించిన వారికి రూ.50వేలు, రూ.25వేల చొప్పున జరిమానా విధించాలంటూ గ్రేటర్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశించిన వెంటనే అధికారులు మూసారాంబాగ్ కార్పొరేటర్ సునరితారెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్, అస్లాంకు రూ.50వే లు, రూ.25వేల చొప్పున జరిమానా విధించారు. మంత్రి ఆదేశించడంతో పార్టీకి చెందిన నేతలు ఖంగుతినగా, ప్రజలు మాత్రం మంత్రిని అభినందించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అనధికారికంగా ఫ్లెక్స్ బ్యానర్లు, పార్టీల జెండాలను ప్రదర్శించడాన్ని నిషేదించడం జరిగింది. అయితే ముసారాంబాగ్ శ్రీపురం కాలనీలో నేడు జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కె.టి.రామారావుకు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్స్ బ్యానర్లు రహదారులపై ప్రదర్శించారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుపై నిషేదం ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ప్రదర్శించడం పై నగర మేయర్ బొంతు రామ్మోహన్ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కె.టి.రామారావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఫ్లెక్సీ నిషేదం అమలులో ఆదర్శంగా ఉండాల్సిన కార్పొరేటరే స్వయంగా నిబంధనలను అతిక్రమించి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంపై మంత్రి కె.టి.ఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ సునరితారెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లాంలకు జరిమానా విధించాల్సిందిగా మంత్రి ఆదేశించారు. దీంతో ససునరితారెడ్డికి రూ. 50వేలు, మాజీ కార్పొరేటర్ అస్లాంకు రూ. 25వేలను జరిమానాగా విధిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీచేశారు. మంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్స్ బ్యానర్లు, పార్టీ జెండాల తోరనాలను మేయర్ రామ్మోహన్, డిప్యూటి మేయర్ బాబా ఫసియుద్దీన్‌లు స్వయంగా దగ్గర ఉండి జీహెచ్ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారు. నగర సుందరీకరణలో భాగంగా నగరంలో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేదించడం జరిగిందని, ఈ విషయంలో ఎవరూ అతీతం కాదని మేయర్ రామ్మోహన్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసినందుకుగాను విధించిన 50వేల రూపాయల జరిమానాను చెక్కు రూపంలో కార్పొరేటర్ సునరితారెడ్డి, 25వేల రూపాయల జరిమానాను మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లాం జీహెచ్ఎంసీ అధికారులకు అందజేశారు. కాగా నిబంధనలు పాటించడంలో సామాన్యుడితో పాటు కార్పొరేటర్ కూడా సమానమే అని మంత్రి కె.టి.ఆర్, మేయర్ బొంతు రామ్మోహన్ మరోసారి నిరూపించారని ఈ కార్యక్రమానికి హాజరైన స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



బీసీ సర్టిఫికెట్ ఇస్తేనే నిజమైన సంక్రాంతి
కాపు ఉద్యమ నేత ముద్రగడ



కోవూరు, సూర్యప్రతినిధి: కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల వారికి బీసీ సర్టిఫికెట్ ఇస్తేనే నిజమైన సంక్రాంతి అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు చంద్రన్న కానుకలు ఇస్తున్నారని ఈ సంక్రాంతి నుంచి బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా కాపులకు కానుక ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాపు రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపాల్సిన అవసరం లేదన్న వంకతో మభ్య పెట్టడంతోపాటు కాపు జాతిని అణగదొక్కాలని కొందరు చూస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని చెప్పినా అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి రిజర్వేషన్ బిల్లును కేంద్రాన్ని ఒప్పించి అమలు చేయాలని కోరారు.

దేశంలోనే నంబర్‌వన్ సీఎం కేసీఆర్ : ఎంపీ మల్లారెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : దేశంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్, నెంబర్ వన్ స్థానంలో ఉన్నారని మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డి అన్నారు. నగరశివారు ఎల్బీనగర్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లో మంచినీటి రిజర్వాయర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రమని, మన ముఖ్యమంత్రి నెంబర్ వన్ అని అన్నారు. ఇంతలోనే మంత్రి కేటీఆర్ కలుగజేసుకొని, దేశంలోనే ఎంపీ మల్లారెడ్డి కూడా నెంబర్ వన్ అని చలోక్తి విసరగా, సభలో ఒక్కసారిగా నవ్వులు పూశాయి. అనంతరం ఎంపి మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కృషి వల్ల నగరంలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. మార్చి తర్వాత ప్రతీ రోజు ఇంటింటికీ మంచి నీళ్లు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని మల్లారెడ్డి అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రంలో ఇలాగే దూకుడు కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

భగీరథ 'ట్రయల్' షురూ!

- జనవరి 26లోగా గ్రామానికి నీరు
- జూన్, జులైలో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు
- ఇప్పటి వరకు 91 శాతం పనులు పూర్తి
- వేగంగా మోటార్లు, పంపులు బిగింపు
- 26 సెగ్మెంట్లలో 13 ట్రయల్ రన్
- 50 డబ్లూపీటీలలో 27లో నీటి శుద్ధి
- ప్రజల ఆరోగ్యానికి భద్రత
- క్షేత్రస్థాయిలో ఇఎన్‌సీ నుంచి ఏఇ వరకు పనుల పరిశీలన

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రంలోని ప్రత ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన 'భగీరథ' ప్రాజెక్టు ట్రయల్ రన్ కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి మానస పుత్రికల్లో ఒకటైన భగీరథ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో రూ.43,791కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా ఈనెల 26లోగా ప్రతి గ్రామానికి నీటిని సరఫరా చేయాలని, జూన్, జులై నాటికి ఇంటింటికి నల్లా ద్వారా రక్షితమంచినీటిని సరఫరా చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును మొత్తం 26 ప్రధాన సెగ్మెంట్‌లుగా విభజించగా ప్రధాన పనుల్లో 90 శాతం పూర్తయ్యాయి. 26 సెగ్మెంట్లలో ఇప్పటి వరకు 13 సెగ్మెంట్లలో నీటి సరఫరా ట్రయల్‌రన్ కొనసాగిస్తున్నారు. 50నీటిశుద్ధి ప్లాంట్లలో ఇప్పటి వరకు 27ప్లాంట్లలో నీటిని శుద్ధి ట్రయల్‌రన్ కొనసాగుతున్నాయని గ్రామీణ తాగునీటి ఇంజనీర్-ఇన్-చీఫ్ బిజ్జుల సురేందర్‌రెడ్డి తెలిపారు. జనవరి 1 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5వేల గ్రామాలకు ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి కల సాకారం చేసేందుకు ఇఎన్‌సీ నుంచి ఏఇ వరకు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తున్నారు. జూన్, జులైలోగా ప్రతి ఇంటికి తాగునీటిని అందజేసేందుకు భారీ మోటార్లు, పంపులను భిగిస్తున్నారు. ప్రాజెక్టుపనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా ఎలక్ట్రోమెకానిక్ పనులను పటిష్టంగా చేపట్టారు. దాదాపు 43,791కోట్ల అంచనా వ్యయంతో 19 ఇన్‌టేక్‌వెల్స్ ద్వారా 1,69,705 కిలోమీటర్ల పైపులైన్‌లో తాగునీటిని అందించేందుకు చేపట్టిన పనులు వచ్చే ఏడాది జూన్‌వరకు పూర్తి చేయనున్నారు. అయితే 2018 జూన్, జులై నాటికి ప్రతి గ్రామానికి భగీరథ నీటిని కానుకగా అందిస్తానని సీఎం ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు రాష్ట్రంలో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. ఇంత పెద్ద భారీ ప్రాజెక్టును నిర్ణీత గడువుకన్నా ముందుగానే పూర్తి చేసి చరిత్రపుటల్లోకి ఎక్కేందుకు భగీరథ ఇంజనీర్లు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. సీఎం లక్ష్యం నెరవేర్చేందుకు గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్-ఇన్-చీఫ్ బిజ్జుల సురేందర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు జగన్మోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏజెన్సీతో పాటు ఇంజనీర్లను పరుగులు పెట్టిస్తున్నారు. ఇక, ప్రభుత్వమే వాటర్ ట్యాంకులు, పైపులైన్లు నిర్మించే గ్రామాలకు రెండో దశలో వచ్చే ఏడాది జూన్‌నాటికి నీటిని అందించనున్నారు. ఈ మేరకు భగీరథ పనులను వేగవంతం చేస్తోంది. తొలి విడతలో భగీరథ నీటిని అందించనున్న గ్రామాలలో భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. భగీరథ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 5 వేలకుపైగా గ్రామాల్లో 5 లక్షలకు పైగా కుటుంబాలకు భగీరథ నీరు చేరింది. ఇప్పుడు, గ్రామాల వరకు నీటిని చేర్చే రెండు దశల (మెయిన్, సెకండరీ) పైప్‌లైన్ వ్యవస్థల పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయి. 988 విద్యుత్ మోటార్ల అమరిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎలక్ట్రో మెకానికల్ పనులను యుద్ధప్రాతిపదికగా కొనసాగుతున్నాయి.

పాలేరు సెగ్మెంట్‌లో గ్రామాలకు నీటి సరఫరా : పాలేరు జలాశయం వద్ద నిర్మించిన ఇన్‌టేక్ వెల్ నుంచి కూడా 4 రోజుల క్రితమే ట్రయల్‌రన్ నిర్వహించారు. అన్ని చోట్ల ప్రధాన పనులు పూర్తి అయిన గ్రామాలలో శుద్ధమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్రయల్‌రన్ పనులను ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి, సీఈ విజయ్‌పాల్‌రెడ్డి, ఎస్ఇ శ్రీనివాస్, ఈఈ శ్యాంసుందర్, ఈఈ విజయ్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సెగ్మెంట్ నుంచి పాలేరు, మధిర, ఖమ్మం మున్సిపాలిటీకి తాగునీటిని అందించనున్నారు. పాలేరు జలాశయంలో ఖమ్మం జిల్లాకు నీటిని సరఫరా చేసేందుకు 6మోటార్లు, అలాగే వరంగల్ జిల్లాకు సరఫరా చేసేందుకు మరో ఆరు మోటర్లు భిగించారు. ఇక్కడి నుంచి జీళ్లచేర్వు వద్ద నిర్మించిన నీటిశుద్ధిప్లాంట్‌లో నీటిని శుద్ధిచేసి అక్కడే ఉన్న గుట్టపై మూడు ఓహెచ్‌బీఆర్‌ల ద్వారా ఖమ్మం, మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాలకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేయబోతున్నారు. అలాగే పాలేరు జలాశయం నుంచి మాధారిపురంలో నిర్మించిన నీటిశుద్ధిప్లాంట్‌కు తరలించి అక్కడ శుద్ధిచేసిన నీటిని వైరా సెగ్మెంట్‌లోని సత్తుపల్లి, వైరా, మధిరా నియోజకవర్గాలలోని గ్రామాలకు నీటిని సరఫరా చేయనున్నారు.

జనగామ సెగ్మెంట్‌లో ఇప్పటికే పనులు పూర్తికావడంతో 692 గ్రామాలకు బల్క్‌గా నీటిని చేరుస్తున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ గ్రామమైన తిరుమలగిరిలో శుద్ధమైన తాగునీటిని అందిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూటికంటి శ్రీలత మాట్లాడుతూ గ్రామంలోని 220ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.



వచ్చేనెల సంగారెడ్డిలో మైనారిటీ కాంగ్రెస్ బహిరంగసభ : మాజీ విప్ జగ్గారెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : సంగారెడ్డి పట్టణంలో వచ్చే నెలలో మైనార్టీ బహిరంగ సభ నిర్వహించేందుకు టీ-పీసీసీ నాయకత్వం సన్నాహాల్ని చేస్తోంది. గతంలో స్థానికంగా నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగసభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఊపు వచ్చిన విషయం తెలిసిందే. రాహుల్‌గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయి ఈసభకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు హాజరుకావడం, అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ప్రజాగర్జన విజయవంతం అనంతరం కాంగ్రెస్ నేతలు సైతం దూకుడు పెంచి, పార్టీ పటిష్టతే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ప్రజాగర్జన తరహాలోనే సంగారెడ్డిలో మరోమారు మైనార్టీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మాజీ విప్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈసభ ద్వారా ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించి వైనాన్ని ఎండగడుతామని చెప్పారు. వచ్చేనెలలో జరగనున్న మైనార్టీ సభకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి గులాంనబీ ఆజాద్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

ట్రిపుల్ తలాక్ బిల్లుపై టీఆర్ఎస్ వైఖరికి ఎంఐఎం సమాధానం చెప్పాలి : మండలి విపక్షనేత షబ్బీర్ ఆలీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ట్రిపుల్ తలాక్ బిల్లులోని సవరణలపై సభలో టీఆరెస్ వ్యవహరించిన తీరుపట్ల ఎంఐఎం వైఖరేంటో చెప్పాలని మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. త్రిపుల్ తలాక్ బిల్లుపై సభనుంచి వాకౌట్ చేసిన టీఆరెస్, ఈ బిల్లుకు మద్దతునిస్తుందా? లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. శుక్రవారం గవర్నర్ కలిసిన అనంతరం షబ్బీర్‌అలీ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్యూలర్ ముసుగు వేసుకుని ముస్లింలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో అంటకాగుతోన్న ఎంఐఎం పార్టీ, ముస్లిం సమాజానికి ఏం సమాధానం చెబుతుందన్నారు. టీఆరెస్ తో దోస్తీ కొనసాగిస్తుందో, లేదో స్పష్టం చేయాలన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో అనేక లోపాలున్నాయని షబ్బీర్‌అలీ అన్నారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలు కూడా కొన్ని ఈబిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టీడీపీ, బీజేడీ, ఏఐడీఎంకేలు కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న వాదనకు మద్ధతినిచ్చిన విషయాన్ని పేర్కొంటూ, టీఆర్ఎస్ మాత్రం వాకౌట్ చేసిందని చెప్పారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో సవరణల్ని టీఆర్ఎస్ కోరుకుంటుందో, లేదో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ తో పొత్తు ఉంటుందని గత అసెంబ్లీ సాక్షిగా ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ చెప్పారన్నారు.



రంగారెడ్డి, వికారాబాద్ సూర్య క్యాలెండర్లను ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరిస్తున్న సూర్య చైర్మన్ నూకారపు సూర్యప్రకాశరావు, డైరెక్టర్ కూనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా న్యాక్‌ను తీర్చిదిద్దాలి : మంత్రి తుమ్మల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఏజెన్సీగా న్యాక్‌ను తీర్చి దిద్దాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రైవేటు సంస్థలను పిలిచి సమన్యాయం బాధ్యతలకే పరిమితం కాకుండా నేరుగా నిరుద్యోగ యువతి, యువకులకూ శిక్షణ తీసుకున్న వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి తుమ్మల న్యాక్, ప్రభుత్వ ఉన్నతాధికారలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్‌లో శిక్షణ తీసుకున్న వారంటే ఆ రంగంలో అత్యుత్తమంగా రాణిస్తారని, ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు భావించాలని అన్నారు. జిల్లాల్లో ఉన్న న్యాక్ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. 1997 నాటినుంచి జాతీయ నిర్మాణ సంస్థ(న్యాక్) నుండి 3.76లక్షల మందికి శిక్షణ ఇచ్చిందని, నిర్మాణ పరిశ్రమకు రాష్ట్రంలో 40,174మంది నైపుణ్య శిక్షణ పొందినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం న్యాక్ పనితీరు అద్భుతంగా ఉందని, 2017-18 సంవత్సరానికి ఈ సంస్థ 7959 మందిని ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చిందని చెప్పారు. న్యాక్ ఔట్‌సోర్సింగ్ ఆధారంగా జిహెచ్ఎంసీలో సైట్ ఇంజనీర్లుగా పనిచేయడానికి 350 సివిల్ ఇంజనీర్స్ యొక్క పారదర్శక పద్దతిలో ఎంపిక, శిక్షణ, నియామకం జరిగినట్లు మంత్రి తెలిపారు. శిక్షణల నాణ్యతను మెరుగుపరచడానికి న్యాక్ అనేక నిపుణుల సంస్థలు, శిక్షణా అభివృద్ధికి ప్రఖ్యాత ప్రైవేటు రంగ సంస్థలతో మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎమ్ఓయు) కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కో-చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎపి సింగ్, ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, న్యాక్ డైరెక్టర్ కె.భిక్షపతి, చీఫ్ ఇంజనీర్ లింగయ్య, నాగేందర్, సుగుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు

- ఏ కష్టం వచ్చిన వారికి అండగా ఉంటా
- ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడాలి
- పుట్టపర్తిని ఆదర్శ నియోజకవర్గం చేస్తా
- రఘునాథరెడ్డి



పుట్టపర్తి, సూర్య బ్యూరో : ఓడి చెరువు మండలం కొండకమర్లలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జడ్పిచైర్మన్ పూల నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దాతలు అల్లభక్ష్, ఎంపీపీ ఇస్మాయిల్, రామప్ప నాయుడు,వేమనారాయణ,మాజీ జడ్పిటిసి చెన్నకేశవులు,వైస్ ఎంపిపి ఇందిరమ్మ నరసింహారెడ్డి, ఎంపిటీసీ రాజారెడ్డి, మండల కన్వీనర్ శంకర్ నాయుడు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ,చంద్రబాబు లే నాకు ఆదర్శ దేవుళ్లని, బడుగు,బలహీన వర్గాలకు రాజకీయాల్లో ఎన్టీఆర్ చేయూతనిస్తే, సమాజంలో ఆచరణలో చేసి చూపించిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఎన్టీఆర్ ప్రతిఒక్కరికి ఆదర్శనీయుడు అని, పుట్టపర్తి నియోజకవర్గంలో ఎన్టీఆర్ విగ్రహాలు లేని మండలాల్లో మార్చి 31 లోపుగా ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తానన్నారు. తనకు తల్లిదండ్రులు జన్మనిస్తే, టీడీపీ పునర్జన్మనిచ్చిందని, ఎన్టీఆర్, చంద్రబాబు లే రాజకీయ భిక్ష ప్రసాదించారని, పార్టీ కార్యకర్తలే నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానన్నారు. టీడీపీలో పదవులు అనుభవించిన వ్యక్తులు ఎవరైనా పార్టీని విస్మరిస్తే వారికి పుట్టగతులుండవని, పార్టీ ఏ కార్యక్రమం అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వర్తించినప్పుడే తగిన గుర్తింపు, ఎదుగుదలకు అదే దోహదం చేస్తుందన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, ఏ సమయంలో నైనా పిలిస్తే పలుకుతానని, నేడు అధికారంలో ఉన్నామంటే కార్యకర్తల కష్టార్జితమేనన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా తాను ఉంటానని, ఎవరు ఆధైర్యపడవద్దని, అదుకుంటానన్నారు. ప్రజల్లో ఆదరణ చుఎరగొన్నప్పుడే ఏ నాయకుడైనా రాజకీయాల్లో రాణిస్తారని, ఇది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడాలన్నారు. అదే లక్ష్యంతో అందరం కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఓడి చెరువు మండలం కొండకమర్ల ప్రభుత్వ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జడ్పిచైర్మన్ పూల నాగరాజు, వెలుగు పిడి రామారావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అల్లబకాష్,జడ్పిటిసి పిట్టా ఓబులరెడ్డి, ఎంపిపి ఇస్మాయిల్, మండల వైస్ ఎంపిపి ఇందిర నరసింహ్మారెడ్డి, మండల కన్వీనర్ శంకర్ నాయుడు, ఎంపిటీసీ రాజారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద్రప్రదేశ్ లో భాగంగా ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని పసుపు కుంకుమ కింద ప్రభుత్వ చీఫ్ విప్ ఆర్థిక సాయం అందించారు. పేదలకు చంద్రన్న సంక్రాంతి కానుక కింద పండుగ కు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీ అవినాష్ రెడ్డి ఫిర్యాదు

కడప, మేజర్‌న్యూస్ : తనకు జరిగిన అవమానంపై లోక్ సభ స్పీకర్ సుమిత్ర మహాజన్‌కు లేఖ ద్వారా కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే తన చేతిలోని మైక్ లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఒక రౌడీ షీటర్ వేదికపై ఉండటమే కాకుండా తన మైక్ లాక్కుని దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వ సభలో వందల సంఖ్యలో టీడీపీ నేతలు వేదికపై ఎలా ఉన్నారని ప్రశ్నించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనతో పాటు ఒక పార్లమెంట్ సభ్యుడినే అవమానించారన్నారు. ఈ ఘటనకు సంబంధించి దినపత్రికలలో ప్రచురితమైన పేపర్ క్లిప్పింగ్‌లు జత చేసి స్పీకర్‌కు పంపారు. తన గౌరవానికి భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని అవినాష్ రెడ్డి కోరారు.

సూర్య
హైదరాబాద్
శనివారం
6 జనవరి 2018
3

కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు ఆరువారాలపాటు నిలిపివేత

ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు స్వల్ప ఊరట లభించింది. పౌరసత్వం రద్దుపై కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఆరు వారాల పాటు హైకోర్టు నిలిపివేసింది. ఈ అంశంపై మళ్లీ వాదనలు వింటామని కోర్టు స్పష్టం చేసింది. చెన్నమనేని రమేశ్ భారత పౌరసత్వాన్ని గతేడాది డిసెంబర్ నెలలో కేంద్రం రద్దు చేసిన విషయం తెలిసిందే. పౌరసత్వం రద్దుపై గత ఆగస్టు 31న హోంశాఖ తీర్పునిచ్చినా డిసెంబర్ నెలలో రమేశ్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. రివ్యూ పిటిషన్‌ను విచారించిన హోంశాఖ కొట్టి వేసింది. సంవత్సరం పాటు వరుసగా దేశంలో ఉండాలనే నిబంధనను రమేశ్ పాటించలేదని తమ విచారణలో తేలిందని, అందుకని ఆయన పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్లు హోంశాఖ తన తీర్పులో వెల్లడించింది. అయితే కేంద్ర హోంశాఖ ఇచ్చిన తీర్పు లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉన్నదని రమేశ్ పేర్కొంటూ, హైకోర్టునాశ్రయించారు. ఏడాదిపాటు దేశంలో ఉండాలనే నిబంధన 2009 ఫిబ్రవరి 25 నుంచి అమల్లోకి వచ్చిందని, కానీ తనకు 2009 ఫిబ్రవరి 3నే పౌరసత్వం లభించిందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి తనకు పౌరసత్వం ఇచ్చిన తరువాత విధించిన నిబంధన తనకు వర్తించదన్నారు. రివ్యూపిటిషన్‌లో తాను సమగ్ర సమాచారం ఇచ్చినా కేంద్రం మరోసారి పొరపాటు అవగాహనకు వచ్చిందని రమేష్ విన్నవించారు. హోంశాఖ నియమించిన విచారణ కమిటీ గతంలో ఇచ్చిన నివేదిక ఆధారంగానే కేంద్రం తుది నిర్ణయం తీసుకున్నదని, అసలు ఆ నివేదిక తప్పుల తడక అని న్యాయ నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారని రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసత్వ చట్టంలో ఉన్న విషయాలను సమగ్రంగా చూడాలే కానీ సాంకేతికంగా చూడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. న్యాయం కోసం తాను మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తానని రమేశ్ గతేడాది డిసెంబర్ నెలలో ప్రకటించిన విషయం తెలిసిందేనని గుర్తు చేశారు. రమేష్ పౌరసత్వ రద్దుపై కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను హైకోర్టు ఆరువారాల పాటు నిలిపివేయడంతో టీఆర్ఎస్ వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

ఇంటింటికీ తాగునీరు పథకానికి రూ.1,600 కోట్లు



నెల్లూరు, సూర్య బ్యూరో : జిల్లాలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు గారు రూ.1,600 కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రకటించారు. అందులో సర్వేపల్లి నియోజక వర్గానికి 357 పనులకు సంబంధించి రూ.92 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఈ పనులన్నింటికి జనవరి 17వ తేదీన టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనుబోలు మండలం పిడూరుపాళెంలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు గ్రామసభలో ఆయన ఈ విషయం వెల్లడించారు. జిల్లాకు భారీ స్థాయిలో నిధులిచ్చిన మంత్రి లోకేష్ బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. మొదట ఆయన సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీ కారం చుట్టారు. మంత్రి సోమిరెడ్డి గారి చొరవతోనే గూడూరు డివిజన్ రైతులకు సాగునీరు అందుతోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గారు ఆనందం వ్యక్తం చేశారు. ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామసభకు హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. వారికి ఘనస్వాగతం పలికారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతోపాటు రేషన్ కార్డులు, స్కాలర్ షిప్‌లు, చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అధికారులను, ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు తీసుకురావడమే జన్మభూమి కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్న మంత్రి సోమిరెడ్డి వెల్లడించారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు సర్వేపల్లి నియోజకవర్గంలో కొలువయ్యాయని, ఒక్క వెంకటాచలం మండలంలోనే రహదారులు సరిగా లేని పలు గ్రామాలకు రూ.13.81 కోట్లు రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నవారు ప్రజల శ్రేయస్సు కోరుకోవాలి తప్ప ప్రజాపయోగ పనుల్లో స్వార్థ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు.

బీసీల అభ్యున్నతితోనే బంగారు తెలంగాణ

- ఈ ఏడాది సంక్షేమ నామ సంవత్సరమే
- అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తాం
- సీఎం బీసీల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తున్నారు
- తొలుత సంచార జాతులకు నిధులు విడుదల
- ఈ నెలలోనే రజక, నాయిూ, విశ్వకర్మలకు చేకూరనున్న లబ్ధి
- బీసీల సమావేశంలో మంత్రి ఈటెల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: 2018-19 సంక్షేమ నామ సంవత్సరమని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. విద్యా పరంగా ఇప్పటికే విప్లవాత్మకమైన మార్పులను సీఎం కేసీఆర్ తీసుకవచ్చారని, పేద పిల్లలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నామని, గతంలో పేదలకిచ్చే పథకాలకు బ్యాంకుల సహకారం లేకపోవడంతో పేపర్లకే పరిమితం అయ్యాయని, ఒక వేళ మంజూరీ అయినా దళారీల చేతుల్లోకి వెళ్లాయే తప్ప..! అసలైన లబ్దిదారులకు అందలేదన్నారు. అందుకోసమే సీఎం కేసీఆర్ బ్యాంకులతో నిమిత్తం లేకుండా నేరుగా డబ్బు అందేలా ప్రణాళికలు తయారు రూపొందిస్తున్నారని ఈటెల తెలిపారు. ఇప్పటికే గొల్లకురుమలు, మత్స్యకారులకు పెద్ద ఎత్తున ప్రభుత్వ సాయం అందుతోందని, అదే విధంగా బీసీలలోని అనేక కులాలకు ఏం చేస్తే బాగుపడతారు అనే అంశంపై ఇప్పటికే 50సార్లు మంత్రి జోగు రామన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించామని తెలిపారు. అలాగే స్పీకర్ మధుసూదనాచారి కూడా అన్ని కులాల్తో అసెంబ్లీ వేదికగా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకున్న విషయం తెలిసిందేనని మంత్రి ఈటెల తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి తోనే బంగారు తెలంగాణ సాధ్యమని సీఎం ఆలోచన అని, అందుకు అనుగుణంగానే ఆయన తగు నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. జోగు రామన్న నాయకత్వంలో అన్ని కుల సంఘాలు, అధికారులతో సమావేశం నిర్వహించి నివేదిక సిద్దం చేశారని, దీనిని సీఎం కేసీఆర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. సంచార జాతులకు లక్ష రూపాయల లోన్ ఇవ్వబోతున్నామని, నాయి బ్రాహ్మణులకు కొత్తగా షాప్స్ పెట్టుకోవడానికి, ఉన్న షాపులను ఆధునీకరించడానికి నిధులు ఇవ్వబోతున్నట్లు ఈటెల తెలిపారు. ఇప్పటివరకు చాకిరీ చేసే దగ్గర మనవాళ్లు, డబ్బులు ఇచ్చే దగ్గర బాబలు ఉంటున్నారని, ఇక మీదట పని చేసే వాడికి పూర్తి ఆదాయం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. తొలుత సంచార జాతులు, అనంతరం రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వకర్మలకు వృత్తుల వారీగా నిధులు కేటాయించేందుకు నివేదిక సిద్ధం అయిందని, సీఎం ఆమోదం తెలిపిన వెంటనే ఈ నెలలోనే గ్రౌండ్ చేయనున్నట్లు మంత్రి ఈటెల తెలిపారు.

ఒక్క పరిశ్రమనూ తేలేని దద్దమ్మ బాబు : రోజా



చిత్తూరు, మేజర్‌న్యూస్ : చిత్తూరు జిల్లాలో పుట్టి ఈ జిల్లాకు ఒక్క పరిశ్రమ తేలేని దద్దమ్మ చంద్రబాబు అని వైసీపీ ఎమ్మెల్యే రోజా ధ్వజమెత్తారు. సొంత జిల్లాను పట్టించుకోని ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఏం చేస్తాడని ప్రశ్నించారు. శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయం వైసీపీదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మోసపూరిత పాలన జరుగుతోందని, నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని, ప్రత్యేక హోదా తీసుకురాలేక కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో తప్పించుకునేందుకు ఏపీని బాబు తాకట్టు పెట్టాడన్నారు. రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. జయంతికి, వర్ధంతికి తేడా తెలీని పప్పుకి మంత్రి పదవి ఇచ్చారని ఎద్దేవా చేశారు. సోది సోమిరెడ్డి, కలెక్షన్ కింగ్ నారాయణలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు, దొడ్డిదారిలో మంత్రులైన వీరు పార్టీకి పెట్టిన పెట్టుబడులను ప్రజల నుంచి తిరిగి దోచుకుంటున్నారని ఆరోపించారు. నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు దారుణమని, వీరిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు అమ్ముడుపోతున్నారని అన్నారు. క్షుద్రపూజలు చేసి మళ్ళీ గెలవాలని చూస్తే ప్రజలు ఒప్పుకోరని చంద్రబాబును రోజా హెచ్చరించారు.

సూర్య
హైదరాబాద్
శనివారం 6
జనవరి 2018
4
సంపాదకీయం
editpage@suryaa.com

"కొత్త సంవత్సరం మొదలైంది. పాత సంవత్సరంలో ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు తేదీ కూడా శుక్రవారం వెల్లడైంది. ఈ నెల 29 నుంచి బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమర్పించే తుది పూర్తి బడ్జెట్ ఇదే కావచ్చు. ఈ కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఇది వరకే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి పరిశీలించవలసి ఉంటుంది. వివిధ దేశాలలో ఉన్నత ఆర్థిక వృద్ధి దశలలో కానవచ్చే ఉమ్మడి సూత్రం నియంత్రణ వ్యవస్థ స్థిరంగా ఉండడం. రిస్కులు తీసుకోవడానికి, ప్రతిఫలాలు అందుకోవడానికి ఇది ఆర్థిక ఏజెంట్లకు కావలసిన వెసులుబాటు కల్పించింది. మోడీ ప్రభుత్వం తుది పూర్తి బడ్జెట్ సమర్పించనున్న సందర్భంగా ఈ అంశాన్ని విస్మరించరాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గడచిపోయిన సంవత్సరం ఒక విధంగా ఆందోళన కలిగించింది. కలవరం రేపిన వాటిలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రెండు సంస్కరణలు కూడా ఉన్నాయి. ఆ సంస్కరణలలో ఒకటి వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కాగా రెండవది దివాలా నిబంధనావళి. తీవ్ర ప్రభావం చూపగల ఆ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ ఇంకా కుదురుకోవలసి ఉన్నది. కాగా, 2018 బడ్జెట్‌లో మరిన్ని అవరోధాలకు తావు ఇవ్వరాదు. ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేయడంపైనే దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. వస్తు సేవల పన్ను విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన అనంతరం పరోక్ష పన్నులలో చాలా వాటిని కేంద్రం నుంచి తప్పించడం వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రత్యక్ష పన్నుల జోలికి ప్రభుత్వం వెళుతుందేమోననే ఆందోళన వివిధ వర్గాలలో కనిపిస్తోంది."

కొత్త పన్నులు వద్దు

కొత్త సంవత్సరం మొదలైంది. పాత సంవత్సరంలో ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు తేదీ కూడా శుక్రవారం వెల్లడైంది. ఈ నెల 29 నుంచి బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమర్పించే తుది పూర్తి బడ్జెట్ ఇదే కావచ్చు. ఈ కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఇది వరకే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి పరిశీలించవలసి ఉంటుంది. వివిధ దేశాలలో ఉన్నత ఆర్థిక వృద్ధి దశలలో కానవచ్చే ఉమ్మడి సూత్రం నియంత్రణ వ్యవస్థ స్థిరంగా ఉండడం. రిస్కులు తీసుకోవడానికి, ప్రతిఫలాలు అందుకోవడానికి ఇది ఆర్థిక ఏజెంట్లకు కావలసిన వెసులుబాటు కల్పించింది. మోడీ ప్రభుత్వం తుది పూర్తి బడ్జెట్ సమర్పించనున్న సందర్భంగా ఈ అంశాన్ని విస్మరించరాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గడచిపోయిన సంవత్సరం ఒక విధంగా ఆందోళన కలిగించింది. కలవరం రేపిన వాటిలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రెండు సంస్కరణలు కూడా ఉన్నాయి. ఆ సంస్కరణలలో ఒకటి వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కాగా రెండవది దివాలా నిబంధనావళి. తీవ్ర ప్రభావం చూపగల ఆ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ ఇంకా కుదురుకోవలసి ఉన్నది. కాగా, 2018 బడ్జెట్‌లో మరిన్ని అవరోధాలకు తావు ఇవ్వరాదు. ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేయడంపైనే దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. వస్తు సేవల పన్ను విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన అనంతరం పరోక్ష పన్నులలో చాలా వాటిని కేంద్రం నుంచి తప్పించడం వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రత్యక్ష పన్నుల జోలికి ప్రభుత్వం వెళుతుందేమోననే ఆందోళన వివిధ వర్గాలలో కనిపిస్తోంది. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తరువాత రెవెన్యూ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. తన రెవెన్యూ పెంపు లక్ష్యంగా పన్నులు పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టకూడదు. అటువంటి విధానం ఆర్థిక వ్యవస్థకు అనవసరం కూడా. ఉదాహరణకు స్టాక్ పెట్టుబడులపై దీర్ఘ కాలిక క్యాపిటల్ గెయిన్స్ పన్నును ప్రవేశపెట్టడం వంటి ఆలోచనలు చేయరాదు. ప్రస్తుతం దేశంలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం ఇంకా కష్టంగానే ఉంటున్నది. అందువల్ల పెట్టుబడులకు ప్రోది చేయని విధానాలు అనుసరించడం అసంబద్ధమే అవుతుంది. ప్రధానంగా జిఎస్‌టి వసూళ్లలో లోటును భర్తీ చేయడానికి దీర్ఘ కాలిక క్యాపిటల్ గెయిన్స్ పన్నును ప్రవేశపెట్టనున్నారంటూ సాగిన వదంతులు సెన్సెక్స్‌ను నష్టపరిచాయి.

వ్యవస్థ సుస్థిరతను కాపాడవలసిన ఆవశ్యకత ద్రవ్య పరపతి విధానానికి కూడా వర్తిస్తుంది. ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయడానికి పన్నుల విధింపు, వ్యయ విధానాన్ని ఉపయోగించే ప్రభుత్వ వ్యూహం అందులో భాగమే. ఈ దశలో వ్యయం విషయంలో సంయమనం పాటించడమే ప్రధాన లక్ష్యం కావాలి. గడచిన కొన్ని సంవత్సరాలుగా ద్రవ్య లోటును క్రమంగా తగ్గిస్తుండడం బృహత్ ఆర్థిక సుస్థిరతకు దోహదం చేసిందనవచ్చు. ఈ ప్రయోజనాన్ని నిరర్థకం చేసుకోరాదు. ఇక తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్న చందాన వ్యవహరించే పాలకులకు తిప్పలు తప్పవని పాలకులు అర్థం చేసుకోవాలి. కొన్ని విషయాల్లో ఇలాగే వ్యవహరిస్తున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఇటీవల కొన్ని అనుకోని సమస్యలు తలెత్తాయి కూడా. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్నించి వెనక్కి వెళితే ఓడిపోయినట్లుగా భావించడం వల్లనే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల ఒత్తిడికి తలొగ్గిన నరేంద్రమోడీ ప్రభుత్వం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై పన్ను ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు గతంలో ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం తమ వత్తిడికి లొంగిందని కాంగ్రెస్, వామపక్షాలతో సహా అన్ని ప్రతిపక్షాలు చెప్పుకోవచ్చు కానీ ఉద్యోగులు, కార్మికుల పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈపిఎఫ్ విషయంలో దిగి వచ్చిందని చెప్పక తప్పదు. ఉద్యోగుల, కార్మికుల భవిష్య నిధిపై పన్ను ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 29న 2016-17 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ చేసిన ప్రసంగంలో ప్రస్తావించిన క్షణం నుంచే దేశవ్యాప్తంగా ఆయా వర్గాలవారిలో ఆందోళన చెలరేగింది. ఉద్యోగులు, కార్మికులకు వ్యతిరేకమైన ఈ నిర్ణయంపై ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా పని చేసే భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్)తో సహా అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పదవి విరమణ చేసిన తర్వాత కార్మికులకు, ఉద్యోగులకు ఆసరాగా ఉండే పిఎఫ్‌పై ఆదాయపు పన్ను విధించడం అన్యాయమనే అభిప్రాయమే వ్యక్తమైంది. 30 సంవత్సరాల పాటు ఉద్యోగులు, కార్మి కులు నిరంతరాయంగా చేసిన శ్రమఫలం ఈ మొత్తం. దీనిలో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. పదవి విరమణ చేసిన తర్వాత జీతభత్యాలు రావు కాబట్టి పిఎఫ్ నుంచి వచ్చే డబ్బు పైనే అందరూ ఆధారపడి జీవిస్తారు. వృద్ధాప్యంలో తమ పిల్లలు చూసినా చూడకపోయినా పిఎఫ్ డబ్బు ఆసరాగా ఉంటుందనే భావన ఉద్యోగులకు, కార్మికులకు మనసులో ఉంటుంది. అలాంటి కష్టార్జితంపై ఆదాయపు పన్ను చెల్లించాలంటే ఎంతో బాధ కలుగుతుంది. తాము దాచి పెట్టుకున్న మొత్తం ఆదాయంగా పరిగణించి దానిపై పన్ను వేయడమే కార్మికులకు, ఉద్యోగులకు అర్థం కాలేదు. ప్రతి ఉద్యోగి లేదా జీతం తీసుకునే ప్రతి వ్యక్తి తన ఆదాయంపై సుమారుగా 30 శాతం మేరకు ఆదాయపు పన్ను రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తుంటాడు. అదే విధంగా కస్టమ్స్, ఎక్సయిజ్, సేవా పన్ను తదితర పన్నుల రూపంలో మరో 30 శాతం వరకూ పరోక్ష పన్నులుచెల్లిస్తుంటాడు. తన జీవిత కాలంలో సంపాదించిన మొత్తానికి మళ్లీ ఆదాయపు పన్ను కట్టాలంటే అది ఒకే సొమ్ముకు రెండు సార్లు పన్ను చెల్లించినట్లు అవుతుంది. ఇది ఎట్టిపరిస్థితుల్లో ఉద్యోగులకు, కార్మికులకు సమ్మతం కాదు. నిర్దిష్ట అవసరాలు తీర్చడానికి వివిధ మార్గాల ద్వారాను, నిర్దిష్ట కార్యక్రమాల కోసం ఏళ్ల తరబడి పౌరులపై పన్ను విధించడం ద్వారాను వనరులను ప్రభుత్వం సమీకరించినప్పుడు కూడా ఆ సొమ్ము నిర్ణీత లక్ష్యాన్ని చేరిందనే సూచనలు ఏవీ కనిపించలేదని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు పేర్కొన్నాయి. ఉదాహరణకు 2006-07 నుంచి 2016-17 వరకు మాధ్యమిక, ఉన్నత విద్య సెస్ రూపంలో రూ. 834987 కోట్లు వసూలు చేయగా, ఆ సెస్ నిధులు వ్యయం చేయవలసి ఉన్న పథకాలను గుర్తించనే లేదు. తుదకు నిర్దేశిత నిధిని కూడా పబ్లిక్ అకౌంట్‌లో తెరవలేదు. ప్రస్తుత స్థాయిలో వనరులతో సైతం ఆర్థిక వ్యవస్థను మరింత అర్థవంతంగా నిర్వహించడం సాధ్యమేననేది వాస్తవం. ప్రభుత్వం అ అంశంపైనే దృష్టి కేంద్రీకరించాలి. ఆ విధంగా సమర్థమైన ప్రభుత్వంగా ప్రశంసలు అందుకోవాలి.

2018 టీ-కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా?

సూర్య సెంట్రల్ డస్క్

- ఈ సారైనా కాంగ్రెస్ తెలంగానం ఫలించేనా?
- పెను మార్పులతో ముందుకు సాగాలన్న నిర్ణయం
- బూత్ స్థాయి నుంచి ఓటర్ల చైతన్యానికి ఏర్పాట్లు
- దేశం సీనియర్లను పార్టీలోకి రప్పించే యత్నాలు
- ఈసారి ఎలాగైనా అధికారం అందుకోవటమే లక్ష్యం

తెలంగాణ రాజకీయ చదరంగంలో కాంగ్రెస్ పార్టీకి 2017 కలిసి వచ్చినట్టే కనిపిస్తోంది. తెలంగాణ ఇస్తే తెలంగాణ రాష్ట్ర సమితిని విలీనం చేస్తాడంటూ కేసీఆర్‌పై కోటి ఆశలు పెట్టుకుని రాష్ట్రం ప్రకటించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాకు కృతజ్ఞతలు చెప్పటానికి వెళ్లనప్పుడే కేసీఆర్ ఒంటరి పోరుకు దిగుతున్నట్టు కనిపించడంతో రాష్ట్రం విడిపోయినా మళ్లీ అధికారంలోకి రావాలనుకున్న కాంగ్రెస్ నేతల ఆశలన్నీ దింపుడు కళ్లాలయ్యాయి. అయితే టిడిపికి చెందిన కీలక నేతలు ఆ పార్టీని వీడిని కాంగ్రెస్ పార్టీలో చేరటం అందునా టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లోకి రావటంతో కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం నెలకొంది. ఇక 2019 ఎన్నికలలో విజయమే లక్ష్యంగా నేతలంతా కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నా అదెంతవరకు సాధ్యమో చూడాలి.

ఇక 2014లో తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది మొదలు బంగారు తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంలో కలిసి రావాలనే పేరుతో విపక్షాలను ఆకర్షించడం ఆరంభించింది. దీంతోటిడిపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు వరుసగా గులాబి అధిపతి చెతకు చేరారు. ఒకానొక దశలో విపక్షాల ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశం ఉందా అనే చర్చ కూడ సాగింది.అయితే అధికారంలో ఉన్న టిఆర్ఎస్‌ను ఢీకొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. 2019 ఎన్నికల్లో అధికారాన్ని కైవసం చేసుకొనే దిశగా పావులు కదుపుతోంది. గులాబి దళాన్ని ఢీకొంటూ, కారుస్పీడుకు బ్రేకులు వేయగల శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందనే వాతావరణాన్ని కల్పించటం ద్వారా తన లక్ష్యాన్ని సఫలికృతం చేసుకునేందుకు ముందుకు సాగుతోంది. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలలో కొందరు తెలంగాణ రాష్ట్ర సమితిలోనో, భారతీయ జనతాపార్టీలోనో చేరే అవకాశం ఉందని ప్రచారం సాగిన తిప్పికొడుతూ తమ పార్టీలోకే ఇతర పార్టీల నేతలను ఆకర్షించడం ప్రారంభించింది. టిడిపికి చెందిన కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. టిడిపి నుంచి రేవంత్ రెడ్డి సహ సుమారు 16 మంది కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరటంతో బలం పుంజుకున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఏడాది కలిసివచ్చినట్టేనని పార్టీ కార్యకర్తలు తెగ ఆనందపడుతున్నారు. ఈ ఏడాది చివర్లో ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున పార్టీలో చేరే అవకాశం ఉందని, అందునా కరీంనగర్ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి ఒకరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు పలువురునేతలతో సాగిస్తున్న మంతనాలు ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. గాంధీభవన్‌లో కాకుండా మాజీ ఎంపీ మల్లు రవి గృహంలో ఈ చర్చలకు వేదికవుతున్నట్లు భోగట్టా.

కేసీఆర్ ఆకర్షణ, శక్తి, యుక్తుల ముందు ఎవరూ నిలబడలేరని, 2019 ఎన్నికల్లో గెలువు తమదేనని మరో పక్క టీఆర్ఎస్ శ్రేణులు దీమాగా ఉన్న నేపథ్యంలో పక్కా ప్రణాళికతో వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ శ్రేణులు పనిచేస్తు ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. ఇందుకు గతం కంటే భిన్నంగా పైకి ఏమాత్రం హడావుడిలేకుండా ఈ సారి ప్రణాళిక బద్దంగా పని చేస్తున్నట్టు కనిపిస్తోంది. అనుకున్న ప్రణాళిక పక్కాగా అమలుచేస్తే విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇటీవల గుజరాత్ ఎన్నికల తదుపరి రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ కొత్త శక్తిని పుంజుకుందని, రాహుల్ మేనియా తెలంగాణలో కూడా ఉంటుందని ఆ పార్టీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఈక్రమంలోనే పార్టీని బలోపేతం చేసే దిశగా కార్యాచరణను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారంతా.

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఇంఛార్జీగా ఉన్న దిగ్విజయ్ సింగ్ స్థానంలో వచ్చిన కుంతియా. వచ్చి రాగానే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడమే లక్ష్యం నేతలకు నిర్దేశించారు. ఇందుకు అనుగుణంగా 2019 ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేసే పనిలో అధినాయకత్వం ఉంది. ముఖ్యంగా జిల్లా, మండల నాయకులకు ఖచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించి, అమలు చేయటంతో పాటు లీడర్‌షిప్ డవలప్‌మెంట్ మిషన్ పేరుతో క్రిందిస్థాయి కార్యకర్తలలోనూ నాయ కత్వ లక్షణాలు పెంచేందుకు ఓ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ఒక కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి 10 పోలింగ్ బూత్‌లకు ఏరియా కో-ఆర్డినేటర్లను నియ మిస్తున్నారు. వీరు గ్రామంలో బూత్ కమిటీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ నిర్ధేశిత కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటినిఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు పీసీ సీ ఒక యాప్‌ను రూపొందించింది. బూత్ స్థాయి కమిటీ ఏయే పనులు చేయాలో స్పష్టమైన మార్గదర్శకాలను ఇస్తున్నారు. ఇప్పటికే ఇదే తరహాలో పంజాబ్ రాష్ట్రంలో అనుసరించడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఈ ఫార్ములా తెలంగాణలో అమలు చేయటం ద్వారా సక్సస్ సాధించాలన్న వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ముందుగా 31 రిజర్వుడ్ అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.ఎంపిక చేసిన కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి ఈనియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయికి పంపారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్ళనున్నారు. మరోవైపు ఏ నాయకుడి బలమెంత, బలహీనతలేమిటనే విషయాలపై వలంటీర్లు పార్టీ నాయకత్వానికి సమాచారం ఇవ్వనున్నారు. వీటి ఫలితాల మేరకు 2018లో అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని నాయుకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ ఈ తరహా నిర్మాణాత్మకమైన కసరత్తు చేయులేదు. ఎక్కువగా పోల్ మేనేజ్‌మెంట్ పైనే దృష్టి సారించేవారు. చివరి నిమిషంలో ఏదో విధంగా ఓటర్లను తిప్పుకునే వారు. అయితే ఇప్పు ఈ సూత్రం ఫలించనందునే ప్రత్యేక తెలంగాణ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ దాని ఫలాలను అందుకోలేకపోయినట్లు నేతలు విశ్లేషించుకుంటున్నారు.

అయితే కొందరు చివరి నిమిషంలో మ్యానేజ్ చేసుకోవచ్చులే అన్న ధీమాలో ఉంటంవల్ల పార్టీ కార్యక్రమ విషయంలోనూ నిర్లిప్తంగా ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారపక్షాన్ని ఎన్నికల్లో ఎలా ఢీ కొట్టాలన్న విషయంపై కొందరు నాయకులు తగుతీరుగా గుర్తించడంలేదని, అధికారపార్టీ నేతలతో చెట్టపట్టాలేసు కుని తిరుగుతుండటం అనేక సంశయాలకు తావిస్తున్నట్టు కనిపిస్తోందన్నది సామాన్య కార్యకర్తల వాదనలలో నిజం లేకపోలేదు. మరోవైపు పట్టున్న నియోజకవర్గాలలో తమ బలాన్ని నిలువుకునేందుకు ఇప్పటి నుంచి ప్రయత్నాలు ప్రారంభించింది. కాంగ్రెస్లో బల మైన నేతలకు అధికార తెరాస గాలం వేసేందుకు యత్నిస్తుందన్న భావనతో ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటోంది. అలాగే బలహీనమైన నియోజకవర్గాలను విభజించి వాటిపై నేతలు ప్రత్యేక దృష్టి పెట్టేందుకు వీలుగాపార్టీ అధినాయకత్వం కూడా చొరవచూపుతోంది. ఇందులో భాగంగా సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్టంగా విభజించిన తీరు. తాజాగా ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై బూత్ స్థాయి వరకు ఓటర్ల ముంగిటకు తీసుకుపోవాలని నిర్ణయించిది టిపిసిసి. ఈ ప్రచారం రెండు దశలుగా విభజించి కొనసాగించనున్నారు. మొదటి దశలో ప్రస్తుత తెలంగాణా రాష్టసమితి ప్రభుత్వ వైఫల్యాలను, ఇచ్చిన హామీలు నెరవేర్చని వైనాన్ని ప్రజలకు వివరిస్తారు. ఆపై రెండో దశలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్న విషయాలను వివరించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈవివరాలను పొందు పరుస్తూ తెలంగాణ పీసీసీ భారీ ఎత్తున కరపత్రాలను ముద్రిస్తోంది. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలు, సూచనలతో రాష్ట్ర కాంగ్రెస్ నాయుకత్వం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి పనిచేస్తోంది. ప్రస్తుతం ఓటర్ల జాబితాను పరిశీలించి, అర్హులైన వారి పేర్ల లేకుంటే చేర్పించే పనిని చేపట్టి, పార్టీకి అనువుగా పరిస్థితిని మార్చుకోవాలని భావిస్తోంది.



బిజెపి ఆశలపై నీళ్ళు

తెలంగాణలో 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని బిజెపి ఇప్పటికే నిర్ణయం తీసుకొని, తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలపై బిజెపి జాతీయ నాయకత్వం గురి పెట్టింది. ఈ మేరకు కొందరు బిజెపి జాతీయ నేతలు కాంగ్రెస్ పార్టీ నేతలతో చర్చించారని ప్రచారం కూడ సాగింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణలో పర్యటించే సమయంలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేతలు బిజెపిలో చేరేలా ప్లాన్ చేశారనే ప్రచారం కూడ లేకపోలేదు. అయితే అదే సమయంలో రేవంతరెడ్డి ఎపిసోడ్ కాంగ్రెస్ పార్టీ నెత్తిన పాలు పోసి నట్టయ్యింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలను తమ పార్టీలో చేర్చుకోవాలని బిజెపి నాయకత్వం ప్రయత్నాలను ప్రారంభించిందనే ప్రచారం సాగినా, రెడ్డి సామాజిక వర్గాన్ని కూడగట్టడంలో అంచెలంచలుగా కాంగ్రెస్ విజయం సాధిస్తున్నట్టే కనిపిస్తోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా అనుకూలించాయనే చెప్పకతప్పదు. కేవలం ఓ వర్గాన్ని ఆలంబనగా చేసుకుని అధికార పగ్గాలను అందుకోవాలని భావిస్తున్న బిజెపికి ఇటు కాంగ్రెస్‌తోపాటు అటు టిఆర్ఎస్‌లు వలసలని ప్రోత్సహించడానికి దిగుతున్న పరిణామాలన్నీ ఇబ్బంది కల్గిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్టీ నేతల మధ్య సమన్వయం కోసం

తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అధిష్టానం నానా తంటాలు పడుతుంటే రాష్ట్ర నేతలలో మాత్రం వ్యక్తిగత వైరాలు, పదవీలాలసాలు పార్టీని నిట్టనిలువుగా చీల్చేస్తున్నాయి. పీసీసీ చీఫ్ పదవి కోసం కోమటిరెడ్డి సోద రులు పోటీ పడుతున్నారు. తమకు పీసీపీ చీఫ్ పదవిని కట్టబెడితే 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని వారు పలు మార్లు బహిరంగంగానే ప్రకటించారు. పార్టీ శిక్షణ శిబిరంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించిన తీరుతో కోమటిరెడ్డి సోదరులు సమావేశాన్ని బహిష్కరించి వచ్చారు. అయితే పీసీసీ చీఫ్‌ను మార్చాలని కొందరు నేతలు డిమాండ్ కూడ లేకపోలేదు. అయితే ఈ తరుణంలోనే పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కొనసాగిస్తామని కుంతియా ప్రకటించారు. ఈ పరిణామంతో కొందరు నేతలు బహిరంగంగానే తమ అసంతృప్తిని వెళ్ళగక్కారు. అయితే పార్టీ అవసరాల రీత్యా నేతల మధ్య సమన్వ యం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రయత్నిస్తున్నా ఫలితం అంతంత మాత్రమే. పైకి మాత్రం నేతలంతా తాము పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నామని చెపు తున్నా, పదవులు, టిక్కెట్లు విషయంతో పాటు ఎన్నికల సమయంలో పరిస్థితి ఏ రకంగా ఉంటుందనే విషయమై కార్యకర్తలలోనూ ఆందోళన ఉంది.

రాహుల్‌కి కానుకగా తెలంగాణ

తాజాగా పార్టీ అధ్యక్ష స్థానం అందుకున్న రాహుల్‌గాంధీకి తెలంగాణలో విజయం సాధించి కానుకగా ఇస్తామని ఓ నాయకుడు ధీమాగా చెప్పారు. అయితే అందుకు అనుగుణంగా కృషి జరిగేలా ఇప్పటికే యత్నాలు ప్రారంభమైనట్టు చెప్పారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ప్రతి బూత్‌లోనూ ఓటరు మ్యాపింగ్ సహాయంతో ఓటర్లను చైతన్యపరిచేందుకు పీసీసీ జిల్లా నాయుకులతోపాటు అంతా పనిచేస్తున్నారని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అధికార పార్టీకి చెక్ పెట్టడం వల్లనే మంచి ఫలితాలు వస్తాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీనికి తోడు రాహుల్ గాంధీ సూచనలతో గుజరాత్ తరహా ప్రచారానికి సోషల్ మీడియాను పెద్ద ఎత్తున వినియోగించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలన్న పట్టుదల నాయుకుల్లో కనిపిస్తోంది. మరి రాను న్న రోజులలో కాంగ్రెస్ నేతలు ఏ తరహా నిర్ణయాలు తీసుకుని విజయం సాధిస్తా రో? చూడాలి.

మొండి బకాయిలతో బ్యాంకులు అతలాకుతలం

- అప్పులిచ్చి తిరిగి రాబట్టుకోలేక అవస్థలు
- మాల్యా వంటి వాణిజ్యవేత్తలు కోట్లు ఎగ్గొట్టారు
- విద్యా రుణాలలోనూ సక్రమ చెల్లింపులు మృగ్యం
- లక్ష ధన్ యోజన ఖాతాలతో అదనపు పని భారం
- నిరర్థక ఆస్తులతో సతమతమవుతున్న బ్యాంకింగ్ రంగం

ప్రధాని మోడీ నిరుపేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, సంపన్నులు, కార్పోరేట్ సంస్థల, దేశాధినేతలతోనే కలిసి తిరగడానికి ఇష్టపడతారని, వారికే లబ్ది చేకూర్చేందుకు ఎక్కువ ఇష్టపడతు అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటారని విమర్శలు వెల్లువలా వినిపిస్తాయి. ఈ అపవాదుని ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యం ఎదుర్కొంటూనే ఉన్నారు ఇందుకు ఉదాహరణగా రైతుల హక్కులను, ప్రయోజనాలను కాపాడేందుకు గత యూపియే ప్రభుత్వం తీసుకువచ్చిన భూసేకరణ చట్టాన్ని సవరించేందుకు ఆయన చేసిన విఫలయత్నాలే ప్రధానంగా చూపిస్తారంతా. ఆ మధ్య కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్టాండ్ అప్ ఇండియా పథకాన్ని నోయిడాలో ప్రారంభిస్తూ పేదలే నిజాయితీపరులు.. సంపన్నులు ప్రభుత్వాన్ని, బ్యాంకులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుంటారు, ఇది సంపన్నుల గురించి ప్రధాని వ్యక్తం చేసిన అభిప్రాయం. అటువంటి వ్యక్తి సంపన్నుల కంటే పేదవారే నిజాయితీ పరులని చెప్పడం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. పేదవారు కష్టపడి పైసా పైసా కూడబెట్టి బ్యాంకులలో చిన్న చిన్న మొత్తాలు జమాచేస్తుంటే, సంపన్నులు బ్యాంకులకు వేలకోట్లు టోపీ పెట్టి వాటిని నిలువునా ముంచేస్తున్నారు. వాళ్ళు బ్యాంకులకు గుదిబండలుగా మారారు. పన్నులు ఎగవేయడానికి మార్గాలు వెతుకుతున్నారు. అటువంటి వాళ్ళుఅందరూ దేశంలో నిరుపేదల నిజాయితీని చూసయినా సిగ్గుపడాలి. అని అన్నారు. బ్యాంకులను ముంచేసి విదేశాలకు పారిపోయిన విజయ్‌మాల్యా వంటి వారిని ఉద్దేశ్యించే ఆయన ఆవిధంగా మాట్లాడుతున్నారని అర్థమవుతూనే ఉంది. అతను ఒక ఆర్థిక నేరస్తుడని బలంగా నమ్ముతున్నా కూడా నిర్భయంగా విజయ్‌మాల్యా పేరుని ప్రస్తావించలేకపోవడం, ఆ వేదిక ద్వారా ఆయనతో సహా అటువంటివారందరికీ గట్టి హెచ్చరిక పంపలేకపోవడం గమనిస్తే మోడీ చెవుతున్న ఆ మాటలు దేశంలో సామాన్య ప్రజలను ఆకట్టుకోవడానికి మాత్రమేనని అర్థమవుతోంది. అయినా సమాజంలో మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు అని నిర్ధారించలేము. సంపన్నులలో నిజాయితీ, దేశభక్తి కలిగి నిస్వార్థంగా సమాజసేవ చేస్తున్న వాళ్ళు ఉన్నారు అవినీతిపరులు కూడా ఉన్నారు. అలాగే సామాన్యులలో కూడా. అంతెందుకు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం పంట రుణ మాఫీ ప్రకటిస్తే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారితో చాలా మంది ఈ పథకాన్ని దుర్వి నియోగంకి లంగరెత్తారు. వేలాది మంది సామాన్య ప్రజలతోనే నకిలీ ఖాతాలు బోలెడన్ని తెరచారు. దీనికి తోడు పలు నకిలీ పత్రాలతో వేర్వేరు బ్యాంకుల నుంచి వేల కోట్లు రుణాలు తీసుకొన్నారని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించింది. అంటే సామాన్యులందరూ కూడా నిజాయితీపరులు కాదన్నది సుస్పష్టం. దీని వెనుక కొంత లాభం చూపి, తమ సొంత లాభాలను చూసుకున్న నేతలూ లేకపోలేదు. ఇక మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధన్ జన్ యోజన పథకంలో కోట్లాది మంది నిరు పేద ప్రజల పేరిట దేశ వ్యాప్తంగా వివిధ బ్యాంకులకు మొత్తం 1.25 లక్షల శాఖ లలో ఖాతాలు తెరిచారు. అయితే ఈ ఖాతాలతో బ్యాంకులకు అదనపు పనిభారం పెరిగిందే తప్ప పేదలకి ఒరిగిందేమీ లేదన్న వాదనలు రాజుకిట్టింది. దాని ద్వారా దేశంలోని నిరుపేద దళిత, గిరిజన వర్గాల ప్రజలకు స్వయం ఉపాధిమార్గం చూపాలనుకోవడం హర్షణీయమే. ఈ పథకం ద్వారా దేశంలో గల అన్ని బ్యాంకులు ఒక్కొక్కటి కనీసం ఇద్దరు దళిత, గిరిజన మహిళా వ్యాపారవేత్తలకు ఎటువంటి హామీ లేకుండా రూ.10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు రుణాలు మంజూరు చేయవలసి ఉంటుంది. అఒక్కో బ్యాంకు కనీసం ఇద్దరికి అంత సొమ్ము రుణంగా ఇవ్వాల్సి ఉంటుందని లెక్కించినా లక్షల కోట్ల రూపాయాలు ఎటువంటి హామీ లేకుండా ఇవ్వాలి.ఈ అప్పు తిరిగి బ్యాంకులకు వాపసు వస్తుందనే నమ్మకాలు తక్కువే. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే, నిరక్షరాస్యులయిన గిరిజన మహిళలను అడ్డుపెట్టుకొని ఇప్పటికే వారికష్టార్జింతోపాటు వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దోపిడికి పాల్పడుతున్న చాలా మంది. ఇటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నారు. మరి వీరిని కట్టడి చేసే మార్గాలు ఎక్కడో, ఏమిటో మాత్రం ప్రభుత్వం ముందు జవాబు లేని ప్రశ్నలే. అయితే ఈ పథకాన్ని అధికార పార్టీతొ పాటు విపక్షాల మేతలకు ఆర్థికంగా ఉపయోగపడే అవకాశాలున్నాయన్న ఆందోళన ఉంది. మరి దుర్వినియోగం కాకుండా చూపేందుకు ప్రభుత్వం ఏ మేర చర్యలు తీసుకుంటుందో చూడాలి. లేదంటే ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని దేశంలో ఏదో ఓవర్గం ప్రజలను ఆకట్టుకో వడా నికో లేక వారిని సంతృప్తిపరచడానికో ప్రయత్నించడం వలన దేశానికి, ప్రజలకి కూడా లాభం కంటే నష్టం కలిగే అవకాశాలే ఎక్కువ. ఈ పథకంలో సొమ్ము వాపసు కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలసి ఉంటుందన్నదానిపై ప్రభుత్వానికి కూడా స్పష్టత ఉన్నట్టు కనిపించడం లేదు. దీనికి తోడుగా ఇప్పటికే లక్షల కోట్ల రుణభారాలను మోస్తోన్న దేశీయ బ్యాంకింగ్ రంగానికి విద్యారుణం ఎగవేతల సమస్య పెరుగుతోంది. 2015 మార్చి నుంచి 2017 మార్చి మధ్యకాలంలో ఎడ్యుకేషన్ లోన్ డిఫాల్టర్ల సంఖ్య ఏకంగా 47 శాతం పెరిగినట్లు వెల్లడయ్యింది. 2015 మార్చిలో రూ.3,536 కోట్లుగా ఉన్న విద్యారుణం, 2017 మార్చి 31 నాటికి రూ.5,192 కోట్లకు చేరిందని పార్లమెంట్ వెల్లడించింది. యూకో బ్యాం క్, ఇండియా బ్యాంకులలో రుణభారం ఎక్కువగా ఉంది. విద్య కోసం రుణాలు తీసుకున్నా, ఆపై ఉద్యోగాలు చేస్తున్నా ఈ రుణాలు చెల్లించక పోవటం ఆందోళన గలిగించేదే.

ఇప్పటికే తిలా పాపంతలో పిడికెడు అన్నట్లుగా ఈ అవినీతి, పాపంలో భాగస్తులే అన్నది కాదనిలేని సత్యం. కోట్లది రూపాయలు బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకుని ఎగ్గొట్టిన విజయ్‌మాల్యా వంటివారు విదేశాలకు పారిపోతుంటే అడ్డుకోని ప్రభుత్వాలు, వారికి రాచమర్యాదలు చేసి మరీ సాగనంపాయి. ఈ కారణంగానే బ్యాంకులలో లక్షలాది ఖాతాలతో తీసుకున్న అప్పుడు గుదిబండలుగా మారిపోయాయి. బ్యాంకులకు ఈ దుస్థితికి రాజకీయ పార్టీలు ప్రధాన కారణమన్నది నిజం. ఇలాంటి వారి నుంచి వసూల్ల మాట మాత్రంగా ఎత్తని బ్యాంకులు చిరువ్యాపారుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వేధించడం జరుగుతుండటం గమనార్హం. నిజమే ప్రధాని చెప్పినట్లు కొందరు నిజాయితీగా సకాలంలో రుణాలు తిరిగి చెల్లింపులు చేస్తున్నా తగిన విధంగా బ్యాంకులు స్పందించడంలో, రుణాలురెన్యువల్ చేయటంలో విఫలం అవుతున్నారన్నది కూడా నిజం. ఈ క్రమంలోనే బ్యాంకులకు గుదిబండలుగా మారిన మొండిపద్దుల వ్యవహారానికి ముగింపు పలికేందుకు క్యూ2 తగిన ఫలితాలకు సంకేతాలను ఇస్తున్నాయంటున్నారు నిపుణులు. ఈ త్రైమాసికంలో ఎన్పీఎలకు కేటా యింపుల్లో తరుగుదల కనిపించింది. గతేడాది క్యూ2లో స్థూల ఎన్పీఎలో 105 శాతం వృద్ధి కనిపించగా ఈ ఏడాది క్యూ2లో 26.3 శాతానికి పడిపోయిందని కేర్ రేటింగ్స్ వెల్లడించింది. ప్రైవేట్ బ్యాంకుల స్లిపేజ్‌లో పీఎస్బీలతో పోలిస్తే తక్కువగా ఉండడం క్యూ2లో మరో కీలకాంశం. ప్రస్తుతం దేశీయ బ్యాంకుల నెత్తిన దాదాపు 8 లక్షల కోట్ల రూపాయల మొండిబకాయిలున్నాయి.

చరిత్రలో ఈరోజు


జనవరి 6

జననాలు
1812: బాలశాస్త్రి జంబేకర్, భారతీయ సంఘ సంస్కర్త.
1867: బయ్యా నరసింహేశ్వరశర్మ, స్వాతంత్ర్య సమరయోధుడు, వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో సభ్యుడు. మితవాది మరియు దాత
1910: బాలసుబ్రహ్మణ్యం, భారత కర్ణాటక సంగీత విద్వాంసుడు.
1932: బలిజేపల్లి రామకృష్ణశాస్త్రి, ప్రముఖ సంగీత విద్వాంసులు మరియు రేడియో కళాకారులు.
1936: జి. మునిరత్నం నాయుడు, సామాజిక కార్యకర్త,
1959: కపిల్ దేవ్, క్రికెట్ ఆటలో గొప్ప ఆల్‌రౌండర్.
1966: ఎ.ఆర్.రెహమాన్, సంగీత దర్శకులు.

సర్ బయ్యా నరసింహేశ్వర శర్మ

సర్ బయ్యా నరసింహేశ్వరశర్మ విశాఖపట్నం జిల్లా తుమ్మపాలలో 1867, జనవరి 6న జన్మించాడు. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో సభ్యుడు. మితవాది మరియు దాత. విశాఖపట్నంకు చెందిన నరసింహాశర్మ ఆంధ్ర మహాసభ తొలిఅధ్యక్షుడు. కలకత్తాలో రైల్వే ధరల సిఫారుసు సంఘానికి అధ్యక్షునిగా పనిచేశాడు. మాంటెగూ చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణలను తిరస్కరిస్తూ అమృత్‌సర్ కాంగ్రెసు సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఆ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ, శర్మ ఒక్కడే ప్రసంగించాడు. ఈప్రసం గానికి మెచ్చి బ్రిటీషు ప్రభుత్వం ఇంపీరియల్ లెజిస్లేటివ్ కాన్సిల్లో సభ్య త్వంఇచ్చి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ యొక్క రెవిన్యూ సభ్యునిగా నియమిం చింది. రాజధానిని మార్చేందుకు స్థలం నిర్ణయించే సంఘంలో అనధికార సభ్యునిగా కూడా నియమించింది.

గుత్తామునిరత్నం నాయుడు



గుత్తామునిరత్నం నాయుడు చిత్తూరు జిల్లాకు చెందిన సామాజిక కార్యకర్త. పద్మశ్రీ పురస్కార గ్రహీత. 1936, జనవరి 6 వ తేదీన జన్మించారు. 1981లో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్ నాయుడు, ప్రముఖ శాస్త్రవేత్త ఎన్‌జి రంగాతో కలిసి 'రాయలసీమ సేవా సమితి' సంస్థ ఏర్పాటు చేశారు. క్రమేణా ఆ సంస్థ రాయలసీమకే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. దీంతో ఆ సంస్థ పేరును రాష్ట్రీయ సేవా సమితిగా మార్చారు. ప్రస్తుతం ఆ సంస్థ శిశువిహార్, బాల విహార్, ఛైల్డ్ స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం, అంగన్‌వాడీ కేంద్రాలు, వయో వృద్ధులకు పునరావాస కేంద్రం, వితంతు పునరావాస కేంద్రం, కృఎషి విజ్ఞాన కేంద్రం, స్వధార్ హోం, మత్తు మందు బానిసల పునరావాస కేంద్రం తదితర సేవల ద్వారా ప్రజలకు చేరువైంది. ఆయన సేవలకు గుర్తుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు అవార్డులను ప్రదానం చేశాయి.

ఎ ఆర్ రెహ్మాన్



ఎ. ఆర్. రెహమాన్ (జననం 6 జనవరి 1967) ప్రముఖ భారతీయ సంగీత దర్శకుడు, స్వరకర్త, గాయకుడు, గీత రచయిత, నిర్మాత, సంగీతకారుడు, దాత. రెహమాన్ జన్మనామం ఎ. ఎస్. దిలీప్ కుమార్. తండ్రి నుంచి సంగీత వారసత్వం పుచ్చుకున్న రెహమాన్ చిన్నతనంలో తండ్రి మరణంతో కుటుంబాన్ని పోషించడానికి పలువురు సంగీత దర్శకుల దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. వాణిజ్య ప్రకటనలకు సంగీతం సమకూర్చాడు. తర్వాత మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన రోజా చిత్రానికి కూర్చిన సంగీతంతో మంచి పేరు వచ్చింది. మొదటి సినిమాతోనే ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ పురస్కారం దక్కింది. రెహమాన్ గీతాలు తూర్పుదేశాలకు చెందిన శాస్త్రీయ సంగీతాన్ని ప్రపంచ సంగీతం, ఎలక్ట్రానిక్ సంగీతం, సంప్రదాయ ఆర్కెస్ట్రా అరేంజ్మెంట్లనూ మేళవించే శైలికి పేరొందాయి. ఆయన పొందిన పురస్కారాల్లో రెండు ఆస్కార్ అవార్డులు, రెండు గ్రామీ పురస్కారాలు, ఒక బిఎఎఫ్‌టిఎ పురస్కారం, ఒక గోల్డెన్ గ్లోబ్ పురస్కారాలు, నాలుగు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, పదిహేను ఫిల్మ్ ఫేర్ పురస్కారాలు, పదమూడు ఫిల్మ్ ఫేర్ సౌత్ పురస్కారాలు ఉన్నాయి.



ఆర్‌కామ్‌కు ఊరట - దివాళా పిటిషన్ వెనక్కి

ముంబయి: అనిల్ అంబానీ నేతృత్వంలోని టెలికాం విభాగం రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు ఊరట లభించింది. ఆ కంపెనీపై దివాలా పిటిషన్ దాఖలు చేసిన చైనా డెవలప్‌మెంట్ బ్యాంక్ (సీడీబీ) తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. ఈ మేరకు సదరు బ్యాంక్ న్యాయవాది జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు తెలిపారు. అప్పులను తగ్గించుకునే ప్రణాళికను ఇటీవల ఆర్‌కామ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆర్‌కామ్ స్పెక్ట్రమ్, టవర్ల కొనుగోలుకు ముకేశ్ అంబానీ నేతృత్వంలోని జియో ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో సీడీబీ తన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడం గమనార్హం. పెద్ద మొత్తంలో రుణాన్ని తీసుకున్న ఆర్‌కామ్ తిరిగి చెల్లించలేదన్న కారణంతో చైనా బ్యాంక్ నవంబర్‌లో ఎన్‌సీఎల్‌టీలో దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ విషయంలో ఆర్‌కామ్ సదరు బ్యాంక్‌తో సంప్రదింపులు కూడా జరిపింది. కాగా, వారాంతంలో సూచీలు అదరగొట్టాయి. కొత్త రికార్డుల్లో స్థిరపడ్డాయి. అంతర్జాతీయ సానుకూల పరిణామాలతో పాటు దేశీయ సంస్థల్లో కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 34వేల మార్క్‌ను దాటగా.. నిఫ్టీ కూడా సరికొత్త జీవనకాల గరిష్ఠానికి చేరుకుంది. కొనుగోళ్ల అండతో ఈ ఉదయం 100 పాయింట్లకు పైగా లాభంతో సెన్సెక్స్ ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ఆరంభించింది. బ్యాంకింగ్, టెలికాం, ఐటీ రంగాల షేర్లు రాణించడంతో ఆద్యంతం అదే జోరును కొనసాగించింది.

హెచ్1బీ మార్పులపై అమెరికా నేతల వ్యతిరేకత

- అమెరికాను వదిలి కెనడావైపు హెచ్-1బీ వీసాదారుల పరుగులు!
- వీసా నిబంధనలను కఠినం చేసిన అమెరికా
- ట్రంప్ నిర్ణయం అమలైతే ఏడున్నర లక్షల మందిపై ప్రభావం
- గ్రీన్ కార్డు కోసం వేచి చూస్తున్న పది లక్షల మంది
- వారికి స్వర్గధామంలా కనిపిస్తున్న కెనడా
- ఇప్పటికే వీసా నిబంధనలను సరళీకృ్యాఎతం చేసిన ట్రుడావో



వాషింగ్టన్: హెచ్-1బీ వీసా మార్పులపై అమెరికాలోని కొందరు నేతలు, న్యాయవాద బృ్యాఎందాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదిస్తున్న వీసా మార్పులను వారు విమర్శిస్తున్నారు. హెచ్-1బీ వీసా పొడిగింపు తగ్గించడం వల్ల దాదావు 5లక్షల నుంచి 7.5లక్షల మంది భారతీయ అమెరికన్లు స్వదేశాలకు వెళ్లిపోవాల్సి వస్తుందని, దీని వల్ల అమెరికాకే నష్టమని, ఇక్కడి నుంచి ప్రతిభావంతులు, నిపుణులు వెళ్లిపోతారని వారు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగ కల్పనలో అమెరికన్లకే ప్రాధాన్యం ఇవ్వాలని వీసా నిబంధనల్లో మార్పులు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే.

హెచ్-1బీ వీసాల ద్వారా అక్కడి కంపెనీలు తక్కువ వేతనాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ వీసాలను తగ్గించాలని, కనీస వేతనం పెంచాలని, అమెరికన్లకే ఎక్కువ అవకాశం ఇవ్వాలని అంటున్నారు. అయితే హెచ్-1బీ వీసాలపై నిబంధనల వల్ల ఇక్కడి ఎన్నో కుటుంబాలు బాధపడతాయని, అమెరికా నుంచి ప్రతిభావంతులు, నిపుణులు వెళ్లిపోతారని, అమెరికాకు ముఖ్యమైన భాగస్వామ్య దేశం భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని డెమొక్రటిక్ నేత తులసి గబ్బార్ పేర్కొన్నారు. అలాగే ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తున్న చిన్న చిన్న వ్యాపారాలు కూడా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిపుణుల కొరత ఏర్పడితే 21వ దశాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పోటీపడగల సామర్థ్యం కోల్పోతామన్నారు. మరో నేత రాజా కృష్ణమూర్తి కూడా హెచ్-1బీ వీసా మార్పులను వ్యతిరేకించారు. ట్రంప్ యంత్రాంగం ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటుందని ఆశిస్తున్నానని అన్నారు. మరో నేత రో ఖన్నా, పలువురు న్యాయవాదులు వీసా నిబంధనల మార్పును వ్యతిరేకిస్తున్నారు.

కాగా, గ్రీన్ కార్డుల జారీని కఠినం చేయాలని, హెచ్ 1-బీ వీసాల గడువును పొడిగించరాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకున్న వేళ, ఆందోళనలో ఉన్న లక్షలాది మంది భారతీయ ఉద్యోగులకు ఇప్పుడు కెనడా ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ట్రంప్ ప్రతిపాదనలు అమలులోకి వస్తే, దాదావు ఐదు నుంచి ఏడున్నర లక్షల మంది తట్టా బుట్టా సర్దుకుని ఇండియాకు తిరుగు ప్రయాణం కట్టాల్సిందే. ఈ నేపథ్యంలో నైపుణ్యమున్న భారత నిపుణులను తమ దేశానికి ఆహ్వానించాలన్న ఉద్దేశంతో కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడావో కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ట్రుడావో ఆలోచనలపై బ్లూమ్ బర్గ్ ఇటీవల హైటెక్ వీసాలపై ట్రంప్ నిర్లక్ష్యం.. ట్రూడస్ స్వాగతం పేరిట ఓ రిపోర్టును కూడా విడుదల చేసింది. విదేశీయుల నిబంధనలను సరళీకృ్యాఎతం చేయడంతో పాటు, వీసా కోసం దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని కెనడా సర్కారు నిర్ణయం తీసుకుందని ప్రకటించింది. గత సంవత్సరం జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో 2 వేల మందికి వీసాలను జారీ చేసిందని, అమెరికాను వీడాలని భావించే వారికి ఇప్పుడు కెనడా స్వర్గధామంలా కనిపిస్తోందని పేర్కొంది.

ఇక యూఎస్ ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు భారత ఉద్యోగులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని ఈ నివేదిక అభిప్రాయపడింది. దాదావు పదేళ్లుగా ఎంతో మంది ఇండియన్స్ గ్రీన్ కార్డులను పొందేందుకు వేచి చూస్తున్నారని, వారందరిపైనా ట్రంప్ నిర్ణయాలు ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయని, సుమారు 10 లక్షల మంది గ్రీన్ కార్డు కోసం వేచి చూస్తున్నారని వెల్లడించింది. ఇదిలావుండగా, గ్రీన్ కార్డు పొందలేని కొందరు ఇప్పుడు యూఎస్ ఆఫర్ చేసే ఈబీ-5 వీసా కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. 5 లక్షల డాలర్లను పెట్టుబడిగా పెట్టడంతో పాటు 10 మంది అమెరికన్లకు ఉద్యోగాలు ఇస్తే, గ్రీన్ కార్డుతో సమానమైన అవకాశాలు లభించే ఈబీ-5 వీసాను పొందవచ్చన్న సంగతి తెలిసిందే.

'కాయకల్ప్'తో సస్యరక్షణ



హైదరాబాద్: సేంద్రీయ సస్యరక్షణ ఉత్పత్తిగా అందుబాటులో ఉన్న కాయకల్ప్‌ను వాడటం ద్వారా మరింత దిగుబడిని సాధించడంతో పాటు రసాయనాల వాడకాన్ని తగ్గించుకోవచ్చని ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ ఏరియా మేనేజర్ శేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాగర్ కర్నూలు జిల్లా కొండనాగుల గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమ,లో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గడచి ఆరు నెలలుగా కాయకల్ప్ వాడుతున్న రైతులు తమ అనుభవాలను వివరించారు. తమ దిగుబడి పెరిగిందని, ఎరువుల వాడకం తగ్గించగలిగామని వెల్లడించారు.

విస్తరణ ప్రణాళికల్లో స్టోర్‌కింగ్

STOREKING

హైదరాబాద్: గ్రామీణ భారతావనిలో విస్తరణే లక్ష్యంగా స్టోర్‌కింగ్ అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, స్థానిక యువతలో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 44 వేల స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. క్సియోమీ, అమేజాన్, పతంజలి, హెచ్‌యూఎల్, పీఅండ్‌జీ, ఇండో నిస్సాన్, హిమాలయా, లెనొవో, శామ్‌సంగ్, గూగుల్ తదితర కంపెనీలతో కుదుర్చుకున్న డీల్స్‌లో భాగంగా కస్టమర్లకు స్టోర్‌కింగ్ షాప్ కీపర్లు సహాయం చేసి, వారికి 48 గంటల్లోనే కోరుకున్న ఉత్పత్తులను దగ్గర చేస్తారని సంస్థ వ్యవస్థాపక సీఈఓ శ్రీధర్ గుండయ్య వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ యువతకు తాము ఉపాధి అవకాశాలను దగ్గర చేయనున్నట్టు ఆయన తెలిపారు.

జీ తెలుగు సూపర్ సీరియల్ చాంపియన్‌షిప్




హైదరాబాద్: సూపర్ సీరియల్ చాంపియన్‌షిప్' రెండో సీజన్‌ను జీ తెలుగు ప్రకటించింది. 6వ తేదీ నుంచి ఇది ప్రారంభమవుతుందని, వివిధ దారావాహికల్లో నటించిన నటీనటులు టైటిల్ పోరు కోసం తలపడనున్నారని చానల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. తొలి ఎపిసోడ్‌లో ముద్దమందారం, దటీజ్ మహాలక్ష్మి సీరియల్స్ పోటీ పడతాయని తెలిపింది. ఈ కార్యక్రమం తొలి సీజన్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని వెల్లడించింది.

అమెజాన్ ప్రైమ్ నుంచి 'బ్రీత్'

హైదరాబాద్: మానసిక భావోద్వేగపరమైన నాటకం 'బ్రీత్' ఫస్ట్‌లుక్‌ను అమెజాన్ విడుదల చేసింది. అసాధారణ పరిస్థితులను ఎదుర్కొనే సాధఃరణ పురుషుల జీవితాలను ఇది ప్రతిబింబిస్తుందని. క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేసే ఆఫీసర్ సంబంధం లేని రెండు హత్యలను జోడించడం, స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తిపై అనుమానం కలగడం వంటి అంశాలు అలరిస్తాయని అమెజాన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వీడియోను ప్రత్యేకంగా జనవరి 26న మూడు భాషల్లో విడుదల చేస్తామని, 8 ఎపిసోడ్‌లుగా 200కు పైగా దేశాల్లో ఒకేసారి విడుదలవుతుందని తెలిపింది.

ఆధార్‌తో ఎప్పటికైనా కీడే: స్నోడెన్




న్యూఢిల్లీ: మాజీ సీఐఏ ఉద్యోగి, విజిల్ బ్లోయర్ ఎడ్వర్డ్ స్నోడెన్.. భారతదేశం నిర్వహిస్తున్న ఆధార్ డేటా గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ ప్రభుత్వాలు సురక్షితంగా ఉంచుతామని సేకరించిన ప్రజల డేటాను సులభంగా హ్యాక్ చేయవచ్చని ఆయన అన్నారు. ఎన్ని చట్టాలు తెచ్చినా డేటా చోరీకి గురికావడం సర్వసాధారణ విషయమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఆధార్ డేటా మొత్తం హ్యాక్కి గురైందని, రూ. 500లు చెల్లిస్తే అన్ని రకాల వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని కథనాలు వచ్చాయి. అలాంటి ఓ కథనానికి స్పందనగా ఆయన ఈ ట్వీట్ చేశాడు. అయితే ఆధార్ డేటా చాలా సురక్షితంగా ఉందని, వీలైనంత మేరకు అన్ని రకాల సౌకర్యాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవడం వల్ల మంచి జరుగుతుందని, ఎవరూ హ్యాక్ చేయని విధంగా కట్టుదిట్టంగా ఆధార్ సర్వర్ ను రూపొందించామని ఒక పక్క యూఐడీఏఐ, మరో పక్క మోదీ ప్రభుత్వం ప్రచారం చేస్తుండటం గమనార్హం.

రిస్కులో భారతీయ బ్యాంకులు

న్యూఢిల్లీ: దాదావు 232 బ్యాంకులకు సంబంధించిన ఆండ్రాయిడ్ యాప్ల మీద ఓ మాల్వేర్ దాడి చేసిందని ప్రముఖ యాంటీ వైరస్ సంస్థ క్విక్ హీల్ సెక్యూరిటీ ల్యాబ్స్ వెల్లడించింది. వీటిలో భారతీయ బ్యాంకులకు సంబంధించిన యాప్లు కూడా ఉన్నాయని పేర్కొంది. 'ఆండ్రాయిడ్.బ్యాంకర్.ఏ9480' అనే ట్రోజన్ మాల్వేర్ ఆండ్రాయిడ్ సిస్టంలో ప్రవేశించి యూజర్నేమ్లు, పాస్వర్డులను తస్కరిస్తోందని క్విక్ హీల్ వెల్లడించింది. కేవలం బ్యాంకింగ్ డేటా గురించి మాత్రమే కాకుండా మెసేజ్లు, కాంటాక్టుల వివరాలను కూడా ఈ మాల్వేర్ వేరే సర్వర్లకు చేరవేస్తుందట. అలాగే క్రిప్టోకరెన్సీ యాప్లపై కూడా ఈ మాల్వేర్ దాడి చేస్తోందని క్విక్ హీల్ చెప్పింది. ఈ మాల్వేర్ బారిన పడిన బ్యాంకు యాప్ల జాబితాను కూడా క్విక్ హీల్ విడుదల చేసింది. ఈ జాబితాలో యాక్సిస్ మొబైల్, హెచ్డీఎఫ్సీ మొబైల్ బ్యాంకింగ్, ఎస్బీఐ ఎనీవేర్ పర్సనల్, ఐసీఐసీఐ ఉన్నాయి.

క్లయింట్లకు ఆధార్ లింకింగ్ సేవలు: బొనాంజా



ముంబై: ఆన్‌లైన్ పెట్టుబడి సేవలందిస్తున్న బొనాంజాఆన్‌లైన్ ఎంఎఫ్, ఆధార్ అనుసంధానం ద్వారా కస్టమర్లకు మరింత సమర్థవంతమైన సేవలను అందిచే దిశగా కొత్త సేవలను ప్రారంభించింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సౌలభ్యంగా ఉండేలా ఈ సేవలను ప్రారంభించినట్టు బొనాంజా గ్రూప్ డైరెక్టర్ సత్య ప్రకాశ్ గోయల్ వెల్లడించారు. ఇటీవలే తమ ఆన్‌లైన్ పోర్టల్‌ను అప్‌డేట్ చేశామని తెలిపిన ఆయన ఇప్పటికే 10 లక్షల మందికి పైగా కస్టమర్లు అప్ గ్రేడ్ చేసుకున్నారని తెలిపారు.

ఒకే ఇంట్లో ఇద్దరు అర్హులున్నా త్వరలో పెన్షన్లు

చిత్తూరు, సూర్య బ్యూరో : ఐదవ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణ వనం జెడ్పీ హై స్కూల్ లో నాల్గవ రోజు విద్యా వికాసం అంశం, జన్మభూమి - మా ఊరు గ్రామ సభలో మంత్రి ఎన్. అమరనాథ రెడ్డి, సత్యవేడు శాసనసభ్యులు శ్రీ తలారి ఆదిత్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా టిడిపి అధ్యక్షుడు నాని పాల్గొన్నారు. నారాయణ వనం గ్రామ సభలో మంత్రి ఎన్. అమరనాథ్ మాట్లాడుతూ నారాయణ వనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కొలువుతీరిన పవిత్ర స్థలంలో 5 వ విడత జన్మభూమి- మా ఊరు గ్రామ సభకు హాజరు కావడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గతంలో ప్రజల వద్దకు ప్రభుత్వం తరహాలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజల చెంతకే పంపి ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించెందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజలు జన్మ భూమి -మావూరు కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలను అధికారులకు నిర్భయంగా వివరించి వెంటనే పరిష్కరింప చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వ ఇల్లు, రేషన్ కార్డు, పెన్షన్ ను మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారు. టెక్నాలజీ సాయంతో ప్రతి లబ్దిదారుకు ప్రభుత్వ పథకాల లబ్దిని నేరుగా పారదర్శకంగా అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వందేనన్నారు. రాష్ట్రంలో 16 వేల కోట్లు లోటు బడ్జెట్ ఉన్నా వేల కోట్ల ఖర్చుతో ముఖ్యమంత్రి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో చేపట్టారన్నారు. అన్ని గ్రామాలలో సిసి రోడ్లను, ఎల్ఈడీ లైట్లను, 5000 ల జనాభా ఉన్న గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేయించడానికి పీఆర్ మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారని, నారా యణ వనం గ్రామంలో ఒక కోటి రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని, పనులు జరుగుతున్నాయన్నారు. రైతన్నలకు ఇన్పుట్ సబ్సిడీని, రైతు రుణ మాఫీ నిధులను పారదర్శకంగా అవినీతి రహితంగా రైతుల బ్యాంక్ అకౌంట్స్ లో వేశామని, చంద్రన్న బీమా పథకంతో నిరుపేదల భవితకు, వారి కుటుంబాలకు ఆర్థికభద్రతను కల్పిస్తున్నా మన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని, తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ , పీహెచ్‌సీలలో ఉచిత వైద్యపరీక్షలను ప్రభుత్వం చేయిస్తోంది. సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

విద్యతోనే పేదరికం దూరం

- జన్మభూమి కార్యక్రమానికి అపూర్వ స్పందన
- ఇది నా అదృష్టంగా భావిస్తున్నా
- ధర్మ సాగరం రాష్ట్రానికే ఆదర్శం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



(బొబ్బిలి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి): బొబ్బిలిలో శుక్రవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తోందని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని నాలెడ్జ్ హబ్‌గా తయారుచేయాలన్నది తన ధృఢ సంకల్పమని అన్నారు. పేదరిక నిర్మూలన విద్య వల్లే సాధ్యమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రపంచాన్ని శాసించే శక్తి భారత్‌కు తప్ప మరే దేశానికి లేదని ఆయన అన్నారు. పిల్లలను బాలకార్మికులుగా ఉపయోగించుకుంటే క్షమించరాని నేరమని, తల్లిదండ్రులకు ఎన్ని కష్టాలున్నా పిల్లలను స్కూల్‌కు పంపాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కాగా సీఎం బొబ్బిలి గ్రోత్ సెంటర్ దగ్గరకు చేరుకోగానే మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ, జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతి రాణి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ధర్మసాగరం గ్రామం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. శుక్రవారం ఆయన గ్రామంలోని రచ్చబండ వద్ద జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి విచ్చేశారు. ధర్మసాగరం ఎంతో ఆహ్లాదంగా ఉందని గ్రామం అంటే ఇలా ఉండాలని తనకు ఇక్కడే ఉండి పోవాలని అనిపిస్తోందని చెప్పారు. చక్కని మర్రిచెట్టు క్రింద రచ్చబండ పక్కనే రావిచెట్టు, ఊరంతా చెట్లు ఆట స్థలాలు పల్లె వైభవాన్ని చాటి చెబుతున్నాయన్నారు. ఎల్ఈడీ దీపాలు రోడ్లు కాలువలు ఇంకుడు గుంతలు శుభ్రమైన చెత్త నిర్వహణ పశువుల పేడ నిర్వహణ సుఖ సంతోషాలతో ఉన్న ప్రజలు ఆట పాటలతో బాల బాలికలు సంక్రాంతి పండుగ అంతా ఇక్కడే కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలోని పల్లెలన్నీ ఇలానే రూపొందాలని. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రతి పల్లే ధర్మసాగరంలా అభివృద్ధి చెందాలన్నారు. ఇక నుండి రాష్ట్రంలో ప్రతి రోజు సంక్రాంతి కావాలన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సుఖంగా ఇంట్లో ఉండవచ్చునని కానీ మంచి ఆశయంతో గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేశారన్నారు. ఈ గ్రామము ఇప్పటికే 6స్టార్స్ సాధించిందని మరో 4 స్టార్స్ సాధించాలని చెప్పారు. అంతకుముందు స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు వాటి చేసిన స్టాల్లో చిన్నపిల్లలకు అన్న ప్రాశనలు, బాలింతలకు సీమంతాలు ముఖ్యమంత్రి చేశారు. పౌష్టికాహారాన్ని పరిశీలించి, పొయ్యి వెలిగించి పాలు పొంగించారు. విద్యార్థులు వేసిన ప్రముఖుల వేషాలు ఆసక్తిగా తిలకించారు. భరతమాత ను పట్టుకుని కొన్ని అడుగులు ముందుకు వేశారు.

ఆరోగ్య శ్రీ బకాయిలు విడుదల చేయాలి : బీజేపీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరోగ్య శ్రీ పథకం యొక్క లక్ష్యాలు నీరుగారిపోతున్నాయని బీజేపీ నేత మామిడి అంజన్ కుమార్ ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని కారణంగానే అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలో అమలవుతున్న ఈ పథకాన్ని నీరుగార్చడంలో ఉన్న ఔచిత్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. ప్రచారార్భాటం కోసం రోజుకో కొత్త పథకాన్ని ప్రకటిస్తున్న ప్రభుత్వం, పేద ప్రజల ఆరోగ్యానికి ఉద్దేశించిన అత్యుత్తమమైన ఈ పథకంపై నిర్లక్ష్యం వహించడమంటే పేదల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లేనని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం నిర్దేశించిన ఇపిఎస్ పథకం కింద రూ.250కోట్లకు పైగా బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. సకాలంలో వీటిని చెల్లించని కారణంగా అనేక ప్రైవేటు వైద్యశాలలు ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలను నిరాకరిస్తున్నారని, దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని మామిడి అంజన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఇసుక మాఫియాపై కఠినంగా వ్యవహరించాలి : టీటీడీపీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః మంత్రి కేటీఆర్ సొంత జిల్లాలో ఇసుక మాఫియా చలరేగిపోతుంటే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ట్రాక్టర్లతో తొక్కించి చంపుతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అనుషరాం ఆరోపించారు. శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేరెళ్ల ఇసుక దుర్ఘటన మరవకముందే కామారెడ్డి జిల్లాలో ఇసుక మాఫియా మళ్లీ రెచ్చిపోందని, అందుకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని అన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియా దాడిలో ఆరుగురు మృతి చెందగా 8మంది అరెస్టు అయ్యారని, నోరు మెదిపితే బాధిత కుటుంబాల మహిళలపై బ్రోకర్ కేసులు పెడతామని పోలీసులు వారిని బెదిరించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇసుక మాఫియా చేతిలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుని, ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టని యెడల తమ పార్టీ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నిమ్మకూరు, నారావారి పల్లె సంగతేమిటి

వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణరెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పదేపదే ప్రజలను మోసం చేస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి పేరుతో మరో మోసపూరిత కార్యక్రమానికి తెరలేపారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) విమర్శించారు. గతంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను చెత్తబుట్టల్లో పారేసి, ఇప్పుడు కొత్తగా సాధించేదేమిటని ప్రశ్నించారు. జన్మభూమి కార్యక్రమం జాదూభూమిగా మారిందన్నారు. జన్మభూమి పేరుతో అధికారులు, స్కూల్ పిల్లలను ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎవరి గ్రామాన్ని వాళ్లే అభివృద్ధి చేసుకోవాలని చంద్రబాబు అంటున్నారు. అయ్యా మరి మీ నారావారిపల్లె సంగతేంటి, అక్కడి స్కూల్ భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. ఇక మీ తనయుడు లోకేశ్ బాబు దత్తత తీసుకున్న నిమ్మకూరు(ఎన్టీఆర్ స్వగ్రామం)లో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. కనీసం సొంత ఊళ్లను కూడా పట్టించుకోని మీరు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారా, మీ అబద్ధాలను ప్రజలు నమ్మాలా, ఇప్పటికైనా ఆ రెండు ఊళ్లకు న్యాయం చేయండి. ఆ తర్వాత మిగతా గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడండి." అని ఆర్కే అన్నారు.

సింగూరు ఇన్‌టేక్‌వెల్ ట్రయల్‌రన్

పరిశీలించిన ఈఎన్‌సీ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: మెదక్,సంగారెడ్డి, జుక్కల్ సెగ్మెంట్ మిషన్ భగీరథ పనులను గ్రామీణతాగునీటి సరఫరా ఇంజనీర్-ఇన్-చీఫ్ బిజ్జుల సురేందర్ రెడ్డి పరిశీలించారు. మొదట మెదక్,నిజామాబాద్ జిల్లాలోని ఆవాసాలకు నీటిని సరాఫరా చేసేందుకు మెదక్ జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట దగ్గర సింగూరు రిజర్వాయర్ లో నిర్మించిన ఇంటెక్ వెల్ ట్రయల్‌రన్‌ను పరిశీలించారు. ఆ మోటార్ల పనితీరును ఈ.ఎన్.సి పరిశీలించారు. పంపింగ్ చేసే సమయంలో నీళ్లు రివర్స్ రాకుండా ఉండేందుకు ఇజ్రాయెల్ టెక్నాలజీతో తయారుచేసిన వాల్వ్ లను ఇక్కడ బిగించారు. వాటి పనితీరును ఈఎన్.సి చూశారు. ఆ తరువాత మెదక్ జిల్లాకు నీటిని సరాఫరా చేసేందుకు అక్కడే నిర్మించిన వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను చూశారు. డిసెంబర్ 31 తారీఖున రాతంత్రా పనిచేసి ట్రయల్ రన్ నిర్వహించిన ఇంజనీర్లు, సిబ్బందిని అభినందించారు. పూర్తిస్థాయిలో మోటార్లు బిగించడంలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని సదరు ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆ పనులను పూర్తిచేసి ఆవాసాలకు నిరంతరం నీటిని సరాఫరా చేయాలని ఆదేశించారు. ఆ తరువాత జుక్కల్ సెగ్మెంట్ లోని నిజామాబాద్ , బాన్సువాడ లకు నీటిని సరాపరా చేసేందుకు నిర్మిస్తున్న వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, పంప్ హౌజ్ పనులను పరిశీలించారు. ఇంకా సివిల్ పనులు మిగిలి ఉండడంపై వర్క్ ఏజెన్సీ ప్రతినిధులపై సీరియస్ అయ్యారు. త్వరగా ఆయా పనులు పూర్తిచేసి ఎలక్ట్రో మెకానికల్ పనులు మొదలుపెట్టాలన్నారు. ఆ తర్వాత సంగారెడ్డి సెగ్మెంట్ కు సంబంధించిన ఇంటెక్ వెల్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను పరిశీలించారు. ఎలక్ట్రో మెకానికల్ పనులు ఆలస్యంగా చేస్తున్నారని సదరు ఏజెన్సీ ప్రతినిధులపై మండిపడ్డారు. టీంలను పెంచి వారం రోజుల్లో మోటార్లు, పంపులు బిగించడాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. లేకుంటే ఏజెన్సీని బ్లాక్ లిస్ట్ చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ అనుకున్న టైంలోగా పనులు పూర్తికాకుంటే 60 నిబంధన కింద వేరే కంపెనీకి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాశ్, ఎన్ఆర్‌డీడబ్లూపీ కన్సల్టెంట్ నర్సింగరావు, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ లు రఘువీర్, సురేష్, చౌదరి బాబులు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్

రాదని సిఎం వెల్లడించారు. మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా మరింత ఉదారంగా వ్యవహరించాల్సి ఉంది. వరి, మక్కలకు ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర పెరగాల్సి ఉంది. ఈ రెండింటికి రూ.2వేల మద్దతు ధర ప్రకటించాలి. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అసలు మద్దతు ధరే లేదు. కాబట్టి దేశంలో పండే ప్రతీ పంటకు మద్దతు ధర ప్రకటించే విధంగా కేంద్ర విధానం ఉండాలి. దీనికోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతాం. టిఆర్ఎస్ పార్టీ పరంగా పార్లమెంటులో కూడా ఈ విషయం ప్రస్తావిస్తాం అని ముఖ్యమంత్రి ప్రకటించారు. శుక్రవారంనాడు ప్రగతిభవన్‌లో వ్యవసాయంపై ఉన్నతస్థాయి సమీక్షించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రాష్ట్రంలో 70 శాతం మంది వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నారు... ఆర్థిక వేత్తలు ఏమి చెప్పినా ఎక్కువ మంది ఆధారపడిన ప్రధాన రంగం వ్యవసాయమే. అయితే వ్యయసాయ దారులు మాత్రం తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉన్నారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. తమనెవరూ పట్టించుకోరు అనే భావనలో ఉన్నారు. తమ కర్మ ఇంతే అనే బాధలో వారున్నారు. అలాంటి రైతుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. అవసరమైన చేయూత అందించి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల కొంత మార్పు వచ్చింది. రైతులకు మేలు జరుగుతున్నది. అంతిమంగా రైతులు పండించిన పంటకు మంచి ధర రావాలి. ఇది ఇప్పుడు ప్రభుత్వం ముందున్న లక్ష్యం. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఈ విషయంలో అత్యంత పట్టుదలతో, కృతనిశ్చయంతో ప్రభుత్వం వ్యవహరిస్తుంది. వరి, మక్కల లాంటి దిగుబడులకు ప్రస్తుతం కనీస మద్దతు ధర లభిస్తుంది. పత్తి లాంటి ఇతర పంటలకు మద్దతు ధర విషయంలో అనిశ్చితి నెలకొంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపుతున్నాయి. సిసిఐ లాంటి సంస్థలు కొనుగోలు చేస్తున్నప్పటికీ కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించే వ్యూహం రూపొందించాలి. రైతు సమన్వయ సమితిల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనగోలు చేసి, తిరిగి అమ్మాలి. ఇలా చేయడం వల్ల ఏమైనా నష్టం వస్తే కూడా ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో పండిన ప్రతీ పంట మార్కెట్ నెట్ లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతు ధర ఇచ్చే విషయంలో ఎలాంటి విధానం పాటిస్తున్నారో అధ్యయనం చేయడానికి అధికారులు మహారాష్ట్ర, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో పర్యటించాలి. మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో అధికారుల బృందం దేశ వ్యాప్తంగా మద్దతు ధరలకు సంబంధించిన విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. రైతులకు మద్దతు ధర వచ్చే విషయంలో ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరిస్తుంది. వరిధాన్యం, మక్కలు, పప్పులు లాంటి సంప్రదాయ పంటలే కాకుండా పసువు, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలకు, మామిడి, నిమ్మ, బత్తాయి లాంటి పండ్లకు కూడా మంచి ధర రావాలన్నదే మా లక్ష్యం. అందుకనుగుణంగానే ప్రభుత్వ విధానం ఉంటుంది అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ ఏడాది నుంచే పెట్టుబడి మద్దతు పథకం

ఈ ఏడాది నుంచే అమలవుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మే 15 నాటికి మొదటి విడత ఎకరానికి 4వేల చొప్పున పెట్టుబడి రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలు చేయాలి? రైతులకు డబ్బులు నేరుగా అందివ్వాలా? బ్యాంకుల ద్వారా అందివ్వాలా? సాగు చేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలి? తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వ్యవసాయం శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ కమిటీలో మంత్రులు ఈటెల రాజెందర్, టి.హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర్ రావు, జగదీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి సభ్యులుగా ఉంటారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, జెన్ కో,ట్రాన్స్ కో సిఎండి డి.ప్రభాకర్ రావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి. హర్టికల్చర్ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విసి ప్రవీణ్ రావు, సిసిఎల్ఎ డైరెక్టర్ వాకాటి కరుణ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు రఘునందన్ రావు, ఎంవి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ప్రశంసల జల్లు : రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యదర్శి పార్థసారథి నాయకత్వంలోని అధికారులు విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు.పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులతో పాటు, రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల పనులను శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్న నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు, అధికారులను సిఎం ప్రశంసించారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా సిబిఐపి అవార్డు అందుకున్న జెన్ కో, ట్రాన్స్ కో సిఎండి ప్రభాకర్ రావును సిఎం అభినందించారు.

గట్టెక్కని ట్రిపుల్ తలాక్

రాజ్యసభలోనే ఉండిపోయింది. లోక్‌సభలో మొత్తం 12 బిల్లులకు ఆమోదం లభించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29న ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు మొదటి బడ్జెట్ సమావేశాలు, రెండవ దశ సమావేశాలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు జరగనున్నాయని అధికారిక వర్గాలు ప్రకటించాయి. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ పార్లమెంటులోని రెండు సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అదే రోజున ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ మీడియాకు చెప్పారు. కాగా, రాజకీయంగా విపరీతమైన వేడిని పుట్టించిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గందరగోళం నడుమ ఉభయ సభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ చెప్పారంటూ

రుణ మాఫీపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ చేసిన వ్యాఖ్యలను ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రస్తావించడం ఆసక్తి రేపింది. ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు రుణ మాఫీ హామీలు అవ్వడం సరి కాదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడాన్ని జైట్లీ ప్రస్తావించారు. రుణ మాఫీ వాగ్ధానాలతో లబ్ధిదారులు రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యం ఉన్నా చెల్లించేందుకు ముందుకు రారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి తెలియజేశారు. ఈ పరిణామం బ్యాంకింగ్ రంగంతో పాటు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారన్నారు. అయితే, ఈసీకి రాజకీయ పార్టీల రుణ మాఫీ హామీలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లేఖ రాసిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్ పేరునూ, ఆయన ఎప్పుడు ఈ లేఖ రాశారనే వివరాలను జైట్లీ వెల్లడించలేదు. నాబార్డ్, సిడ్బీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులోనూ ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రుణ మాఫీలు, సబ్సిడీలు పరపతి వ్యవస్థను దెబ్బ తీసాయని ఆందోళన వ్యక్తం చేశారని మంత్రి చెప్పుకొచ్చారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ అభిప్రాయం గురించి ఆర్థిక శాఖ మంత్రి ఇచ్చిన వివరణ దుమారం రేపుతోంది. రైతు రుణ మాఫీపై అసలు ప్రభుత్వ ఉద్దేశమేమిటనేది జైట్లీ వివరణ ఇవ్వకపోవడం పలు సందేహాలను ముందుకు తెస్తోంది. గతంలోనూ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ దిగ్గజాలు వ్యవసాయ రుణాల మాఫీపై ప్రతికూల వ్యాఖ్యలు చేయడంపై ఆందోళన నెలకొంది.

బడి పిల్లలకు రూ. 15 వేలు

పాదయాత్ర కొనసాగనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 53వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆయన శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం సదుంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. "మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయని చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారు. నాలుగేళ్ల పాటు పింఛన్లు ఇవ్వకుండా అన్యాయం చేసిన ఈ వ్యక్తికి ఇప్పుడు జ్ఞానోదయం అయింది. పింఛన్లు ఇవ్వడం లేదన్న విషయం ఇప్పుడే తెలిసిందని డ్రామాలు ఆడుతున్నారు. నాలుగేళ్లలో ఏ ఒక్క హామీని అమలు చేయని వ్యక్తి తనకు ఓట్లు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలని చెప్పడం దుర్మార్గం. చిత్తూరు జిల్లాకు చంద్రగ్రహణం పట్టుకుని, అభివృద్ధి ఆగిపోయింది. నాలుగేళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదు. ఏమీ చేయకుండానే నాకు ఓటు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలని చంద్రబాబు అంటున్నారు. ఆయన మాటలు చూస్తే కళ్లు నెత్తికెక్కినట్లున్నాయి. ఓటు వేయకుంటే ప్రజలు సిగ్గుపడాలా, ఏమీ చేయకుండా ఓట్లు అడుగుతున్న చంద్రబాబు సిగ్గుపడాలా, ఏం చేశాడని చంద్రబాబుకు ఓట్లు వేయాలి. మూడుసార్ల కరెంట్, బస్సు ఛార్జీలను పెంచిన ఘనత చంద్రబాబుది. అలాంటి చంద్రబాబుకు ఓట్లు వేయాలా? రుణమాఫీ, డ్వాక్రా రుణాల రద్దు, నిరుద్యోగ భృతి ఇస్తామని, మాట తప్పినందుకు ఓట్లు వేయాలా, ఎన్నికల సమయంలో పదేళ్లు కాదు పదిహేనేళ్లు హోదా కావాలన్నారు. ఎన్నికలు రాగానే హోదాను మర్చిపోయారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి హోదాను అమ్మేసినందుకు ఓట్లు వేయాలా. జన్మభూమి కమిటీల పేరుతో మఫియాను ప్రోత్సహిస్తు న్నారు. 35 పడకల ఆస్పత్రికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి 11 ఎకరాల సొంత భూమి ఇచ్చారు. ఆ స్థలంలో ఆస్పత్రిని కట్టడం లేదు.

ఆ భూమిని తిరిగి ఇవ్వడం లేదు. ఆ భూమి ఇస్తే ఆస్పత్రి కట్టడానికి మేం సిద్ధం. పుంగనూరులో ఆర్టీసీ డిపో కట్టి ఏడున్నరేళ్లు అయినా బస్సులు ఇవ్వలేదు. ఇంత అన్యాయమైన పాలన ఎక్కడా ఉండదు. పార్టీ అధికారంలోకి రాగానే ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం. ఆర్టీసీని బ్రహ్మాండంగా నడిపిస్తాం. హంద్రీ-నీవా నీటిని పుంగనూరుకు తీసుకొచ్చి అన్ని చెరువులను నింపి గ్రామాలను సస్యశ్యా మలం చేస్తాం. పేదలందరికీ ఆరోగ్యశ్రీని వర్తింపచేస్తాం. ఎంత పెద్ద ఆపరేషన్ అయినా ఉచితంగా చేస్తాం. రూ.1000 బిల్లు దాటితే ఆరోగ్యశ్రీలో చేరుస్తాం.

ఆపరేషన్ చేయించు కున్న వ్యక్తికి విశ్రాంతి అవసరం అయితే ఆరు నెలల పాటు డబ్బులిస్తాం. వైద్యం కోసం పేదలను అప్పులపాలు కానివ్వం. అందరికీ కార్పొరేట్ వైద్యం అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడే పేదలకు రూ.10వేల పెన్షన్ ఇస్తాం. నాన్న ఒక్క అడుగు ముందుకేశాడు. నేను రెండడుగులు ముందుకేస్తా. పేద ప్రజలకు అండగా నిలుస్తా." అని జగన్ పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

టిక్కెట్ హుళక్కే

చేస్తోంది. ఇక పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లే లక్ష్యంగా షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల్ని ప్రవేశపెట్టింది. మధ్యాహ్నభోజనంలో సన్నబియ్యం, గురుకుల పాఠశాలల ఏర్పాటు, ఒంటరి మహిళలకు పెన్షన్, వృద్ధులకు, వితంతు, వికలాంగులకు ఫించన్ మొత్తాన్ని పెంచడం ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని ఏకకాలంలో అమలు ద్వారా ప్రజల మన్నల్ని పొందుతుంది

ఎమ్మెల్యేతీరుపై ఆగ్రహం...

కొన్ని జిల్లాల్లో తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, మరికొన్ని చోట్ల ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు, మరికొన్ని చోట్ల రిజర్వ్‌డ్ స్థానాల్లో గెల్చిన వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఆహంకారపూరితంగా వ్యవహరిస్తూ అధికారులతో దురుసుగా వ్యవహరిస్తూ అభాసుపాలవుతున్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిగిరిరెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్‌లు ఏకంగా జిల్లా కలెక్టర్లతోనే వివాదానికి దిగారు. ఇక ఉమ్మడి నల్గొండ జిల్లాలో నక్రేకల్ ఎమ్మెల్యే వీరేశం జిల్లాస్థాయి అధికారి బెదిరించగా, గతంలో ఒక కాలేజీ ప్రిన్సిపాల్ బెదిరింపులకు దిగారు. ఇక నల్గొండ జిల్లాకు చెందిన మరొక రిజర్వ్‌డ్ ఎమ్మెల్యేపై అవినీతి, దొంగనోట్ల వ్యవహారంలో ప్రమేయముందన్న ఆరోపణలు వినిపించాయి. ఇక మరొక జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అధికారులకు నెలవారీ టార్గెట్లు విధించి మామూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. కొంతమంది ఎమ్మెల్యేలు కాంట్రాక్టు పనులు చేయకుండానే బిల్లులు ఎత్తుకుని ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తుండగా, మరికొంతమంది నియోజకవర్గ పరిధిలో ఏచిన్న అభివృద్ధి పని జరిగినా తమకు పర్సెంటేజీలు ముట్టచెప్పాల్సిందేనని హుకుం జారీ చేస్తుండడంతో ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

బ్లాక్‌లిస్టులో సగం మంది ఎమ్మెల్యేలు...

తెలంగాణ ఉద్యమవాదంతో తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలతోపాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలతో కూడిన బ్లాక్‌లిస్టు ఒకటి గులాబీదళపతి రూపొందించినట్లు తెలుస్తోంది. వీరికి వచ్చే ఎన్నికల్లో టికెటిచ్చే అవకాశాలెంతమాత్రం లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్రతి నియోజకవర్గం నుంచి ఐదారు మంది ఆశవాహులు పోటీపడుతున్నారు. ప్రజాధరణ ఉన్న నేతల్ని గుర్తించి వారికి టికెటిచ్చేందుకు ముఖ్యమంత్రి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

రోగాలతో బాధ పడుతున్నా కనీస శిక్ష విధించండి

దృష్టిలో ఉంచుకొని ఆయనకు తక్కువ శిక్ష విధించాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కుంభకోణంలో తనకు ఎటువంటి ప్రత్యక్ష పాత్రా లేదని, తన వయసు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శిక్షను తగ్గించాలని లాలూ ఈ పిటిషన్‌లో కోరారు. పశు దాణా కుంభకోణం కేసులో దోషిగా నిర్ధారితుడై ప్రస్తుతం జైలులో ఉండి తనకు పడే శిక్ష కోసం వేచి చూస్తున్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ గురువారం కోర్టుకు వచ్చిన సందర్భంగా ఆయనకు, న్యాయమూర్తి శివ్ పాల్ సింగ్‌కు మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. జైలులో చలిగా ఉంది అని లాలూ ప్రసాద్ వ్యాఖ్యానించగా, ఆ మాటలు విన్న శివ్ పాల్ సింగ్ వెంటనే కౌంటర్ వేశారు. అలా అయితే తబలా వాయించు అని ఆయన అనడంతో అక్కడ నవ్వులు విరిశాయి. తాను న్యాయవిద్యను కూడా అభ్యసించానని లాలూ ఈ సందర్భంగా వెల్లడించారు. వాస్తవానికి లాలూ సహా ఇతర దోషులకు బుధవారం (3న) శిక్షలను ఖరారు చేయాల్సి ఉండగా, అది వాయిదా పడుతూ వచ్చింది. శనివారం లాలూ పరిస్థితులను బట్టి వ్యక్తిగతంగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరవుతారని సమాచారం.



ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదించాలి: బిజెపి

విజయవాడ, సూర్య బ్యూరో : పార్టీలకు అతీతంగా ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదించాలని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శరణాల మాలతీరాణి విజ్ఞప్తి చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముమ్మారు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే దుస్సంప్రదాయం నుంచి ముస్లిం మహిళలకు న్యాయం చేసేలా ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టాన్ని భాజపా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీనిని లోక్‌సభలో అన్ని పార్టీలు ఆమోదించాయన్నారు. అయితే ఈ బిల్లు రాజ్యసభకు వచ్చేసరికి కాంగ్రెస్ సహ విపక్షాలు ఈ బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. లోక్‌సభలో ఆమోదించి రాజ్యసభలో వ్యతిరేకించడంపై రాజకీయ పక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. భారతీయ జనతా పార్టీకి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ ఈ బిల్లును రాజ్యసభలో అడ్డుకుందని ఆరోపించారు. సుదీర్ఘకాలం మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీని, పార్టీ అధ్యక్షురాలుగా సోనియాగాంధీని కలిగిన కాంగ్రెస్ పార్టీ, ముస్లిం మహిళలు పడుతున్న వేదనను పట్టించుకోలేదని విమర్శించారు. ఆ పార్టీ ట్రిపుల్ తలాక్‌ను ఎందుకు నిషేధించలేకపోయిందని ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ మతపరమైన అంశంగా చూడరాదని, దానిని మహిళలకు జరుగుతున్న అన్యాయంగా చూడాలని అన్నారు. అందుకే ఈ ట్రిపుల్ తలాక్ నిషేధంపై అన్ని వర్గాల్లోని మహిళల నుంచి సానుకూల స్పందన లభించిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మాన్ని కప్పిన దట్టమైన పొగమంచు

- తల్లడిల్లుతున్న ప్రజలు
- ఢిల్లీ తరహాలో ఉక్కిరిబిక్కిరి
- కళ్లు మంటలు, వాంతులు
- వర్షాకాలంలోనూ ఈగలు, దోమలు
- కార్పొరేషన్ ఎన్నికలకు ముందు యార్డు తరలింపునకు ముఖ్యమంత్రి హామీ అమలు కాలేదు
- డంపింగ్ యార్డు తరలింపుపై మీనమేషాలు
- అధికారులు, పాలకవర్గంపై విమర్శల వెల్లువ
- కాంగ్రెస్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ధర్నా
- ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పే ప్రయత్నం



(మేజర్‌న్యూస్,బ్యూరో-ఖమ్మం) :ఖమ్మంనగరం దట్టమైన పొగమంచుతో గత వారంరోజులుగా ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ..... ఎక్కడో ఢిల్లీలో పొగమంచువల్ల అక్కడ ప్రజలు అస్వస్థతకు గురికావటం విన్నాం.... వాహనాలు రోడ్లమీద నడపటమే ఇబ్బందిగా మారింది.వందల సంఖ్యలో హైవేపైనే వాహనాలు ఒకదానినొకటి ఢీకొని యాక్సిడెంట్లు అయినసంఘటనలపై వార్తలు వెలువడ్డాయి. అదేలా సాధ్యమని అనుకున్నాం. కాని ఖమ్మంనగరంలో కూడా అచ్చం అలాగే జరిగింది. బైపాస్‌రోడ్‌కు సమీపంలో దానవాయిగూడెం వద్ద డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో చెత్తచెదారం, ఇతర వ్యర్థాలు వందలాది వాహనాలతో ఇక్కడ ఉన్న యార్డుకు తరలిస్తుంటారు. రోజుకు సుమారు 3 టన్నుల చెత్త యార్డుకు చేరడంతో నెలకు అది 90 నుంచి 100 టన్నులకు చేరుతుంది. సంవత్సరంలో వెయి నుంచి 1200 టన్నులకు అదిచేరటంతో గుట్టలుగా పేరుకు పేయింది యార్డుదగ్గర కాపాలదారును పెటాటల్సిన కార్పొరేషన్ నిర్లక్ష్యంగా వ్యహరించటంతో గుర్తుతెలియని వ్యక్తులు దానికి నిప్పు పెట్టడంతో పెద్దపెద్ద మంటలు లేస్తున్నాయి. ఆ లేచిన మంటలు నగర మంతా వ్యాపిస్తున్నాయి. ప్రధానంగా యార్డుకు దగ్గరగా ఉన్న దానవాయి గూడెం, రామన్నపేట, ఎన్‌జిఓస్‌కాలనీ, బిసి కాలనీ, రాపర్తినగర్, రమణగుట్ట, వికలాంగులకాలనీ, బుర్హాన్‌పురం, ఎన్నెస్పీ ఏరియా, బస్‌డిఫోరోడ్, మామిళ్ళగూడెం, బస్‌స్టాండ్, బాలాజీనగర్, మయూరిసెంటర్, రైల్వేస్టేషన్, కమాన్‌బజార్, కస్బాబజార్, మూడవ పట్టణంలోని గాంధీచౌక్,సారధినగర్, ఎఫ్‌సిఐ గౌడాన్స్, కాలువ ఒడ్డు వరకు ఇది వ్యాపించింది. సాయంత్ర పూట మంచి పడుతున్న వేళ ఈ పొగలు రావటంతో మంచు పొగలు కలిసిపోయి ఇళ్ళమీదకు రావటంతో ఇళ్లలోని ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. రెండు మూడురోజుల వరకు చాలా మందికి ఈ పొగ ఎక్కడ నుంచి వస్తుందో తెలియక ఎక్కడిదోలే అనుకున్నారు. తీరా ఆరా తీయగా ఇది మన ఖమ్మంనగర పాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్‌యార్డునుంచి వస్తుందని తెలియటంతో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాత్రిపూట నిద్రపట్టక అర్ధరాత్రి వీధుల్లోకి వచ్చి గుంపులు గుంపులుగా చేరి నగరపాలన తీరుపై మండిపడుతున్నారు. వారికి తెలిసిన అధికారులకు కార్పొరేటర్లకు ఫోన్లు చేసి తమ ఇబ్బందులను తెలియజేస్తున్నారు. అధికారపార్టీకి చెందిన ఒక కార్పొరేటన్ పొగమంచు విషయంలో తాము ఆందోళన చేయలేమని అధికారపార్టీలో ఉన్నందున కూదరదని చెప్పటంతో ఈ డివిజన్ ప్రజలు విస్తుపోయారు. ఎన్నికల్లో ఒకపార్టీ నుంచి గెలిచి మారో పార్టీకి మాకు చెప్పి మారావా, తల్లీ అని నిలదీశారు. దీంతో కంగుతినటం ఈ కార్పొరేటర్ వంతైంది. నగరంలోరోజుకు వందల ట్రాక్టర్లు ఇతర వాహనాల ద్వారా చెత్తను యార్డులో డంప్ చేసి దాన్ని మంటపడితే వచ్చే ఇబ్బందులపై ప్రజలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. రెండు దశాబ్దాలనాడు ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడ ఎలాంటి నివాసగృహాలు లేవు. తరువాత కాలంలో యార్డు చుట్టపక్కల కాలనీలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ నివశిస్తున్న ప్రజలకు నిరంతరం నరకయాతనగా మారింది. వర్షాకాలంలో ఈగలు, దోమలబెడదతో వ్యాదులు ప్రభలటంతో ప్రజలు చుట్టుపక్కల ప్రజలు జ్వరాల బారినపడి చికెన్‌గున్యా, డెంగ్ లాంటి వ్యాదులు వస్తున్నాయి. చిన్న,చిన్న వ్యాపారాలు, ఆటోలు , సుతారి పనులు చేస్తున్నవారు అధికంగా ఈయార్డు పరిసరాల్లో నివశిస్తున్నారు. దానికి తోడు దానవాయి గూడెం, రామన్నపేట, కైకొండాయిగూడెం గ్రామాలు దగ్గరలో ఉన్నాయి. ఇక్కడ వారికి ఈ గాలిపిల్చటం వలన దగ్గు , క ళ్ళు మంటలు, ఆస్తమా లాంటి జబ్బులు వస్తున్నాయని చెబుతున్నారు. రషీద్ అలీ అనే ఒక ఆటోడ్రైవర్ తన కుమారుడికి యార్డు నుంచి వచ్చే పొగవల్ల ఆస్తమా వచ్చిందని వాపోయారు. గత కొన్ని సంవత్సరాలుగా దీనిపై వచ్చిన అధికారికి కార్పొరేటర్లకు చెబుతున్నా వారు పట్టించుకోవటం లేదని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు డంపింగ్ యార్డులను పరిశీలించి అక్కడ నుంచి తరలిం చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదికారులను ఆదేశించారు. ఆయన పర్య టించి సంవత్సర్నర కాలం దాటిని అది అమలు కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఖమ్మంను కమ్ముకుంటున్న పొగ మంచుపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహంతో కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్ దీపక్ చౌదరి శుక్రవారం డంపింగ్ యార్డు వద్దగల ఎన్‌జిఓ కాలనీ వద్ద ఆందోళన చెపట్టారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకుని డంపింగ్ యార్డు మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ ఇంజన్ల ను రప్పించారు. రెండు ఫైర్ ఇంజన్లు ఆమంటలను ఆదుపులోకి తీసుకుని వచ్చాయి . డంపింగ్ యార్డుకు ఒక కాపాల దారుని పెట్టాల్సి ఉండగా నగర పాలక సంస్థ అలాంటి చర్యలు చేపట్టలేదు. పాలకవర్గానికి కమీషనర్‌కు పొసగ కపోవటంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతు న్నాయి. ఇప్పటికే నగరంలో పౌరసేవలు పడకేసిన నేపథ్యంలో ఇలాంటి సంఘ టనలపై నగర ప్రజలు ఆగ్రహవేశాలు వ్యక్తం చేస్తున్నారు. మంటలను ఆర్పిన ప్పటికి తిరిగి మంటలు రాకుండా చర్యలు తీసుకోవాలని పౌరులు కోరుకుంటున్నారు.

సిద్దిపేట నుంచి నేరెళ్ల వరకు సీపీఐ పాదయాత్ర : చాడ



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: సిద్దిపేట నుంచి నేరెళ్ల వరకు పాదయాత్ర కోసం ప్రభుత్వ అనుమతి కోరామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..తాము చేపట్టే పాదయాత్రకు ప్రభుత్వం అనుమతిని నిరాకరించా..చేసి తీరుతామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రెచ్చిపోతుందని, అక్రమ రవాణాను అడ్డుకున్న వీఆర్‌ఏను చంపడం అత్యంత దుర్మార్గమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుకపై వెంటనే ప్రభుత్వ విధానం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాయుతంగా నిరసన దీక్ష చేపట్టిన మందకృష్ణ అరెస్టును ఖండిస్తున్నట్లు చాడ తెలిపారు.

జన్మభూమి సభల్లో చంద్రబాబు సొంత డబ్బా

వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి, మేజర్‌న్యూస్: జన్మభూమి సభల్లో చంద్రబాబు ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుంటోందని వైసీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడయాతో మాట్లాడుతూ శ్రమదానం, జన్మభూమి, ప్రజల వద్దకు పాలన ఇవన్నీ వినడానికి బాగుంటాయి కానీ ఆచరణ మాత్రం శూన్యం అంటూ విమర్శించారు. ప్రస్తుతం తెలుగుదేశం పాలన 'పైన పటారం.. లోన లొటారం' అన్న చందంగా తయారైందన్నారు. గ్రామసభల్లో అధికారులు, నాయకులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఏదో అది చేశాం, ఇది చేశాం అని చెప్పుకోవడం తప్పితే ప్రజలకు చేసింది మాత్రం ఏమీలేదని విమర్శించారు. రేషన్ షాపుల్లో ఇచ్చే సరుకులను కూడా గ్రామసభలో నలుగురికి ఇచ్చి ఫొటోలకు ఫోజులు ఇస్తూ చేతులు దులుపుకొంటున్నారంటూ దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతల నుంచే మైక్ లాక్కున్న చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సమస్యలను ఎంతమాత్రం పట్టించుకుంటుందంటూ విమర్శించారు. గత నాలుగు జన్మభూమి కార్యక్రమాల్లో ఇచ్చిన అర్జీలు ఎంత వరకూ పరిష్కరించారో అడుగుదామంటే గ్రామస్థలకు మైక్ కూడా ఇవ్వడం లేదని, ఎన్ని సార్లు అర్జీలు ఇస్తే ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను రాష్ట్రంలో యువత ఎప్పటికప్పుడు గమనిస్తోం దని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఉన్న సమస్యలను పరిష్కరించడానికి వైఎస్ జగన్ సరైన నాయకుడని యువత భావిస్తోందని, అందుకే జగన్ వైపు మొగ్గుతున్నారని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రాయచోటిలో నూతనంగా ఏర్పాటైన జగన్ యువసేన నాయకులతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

జన్మభూమిలో సతీష్ రెడ్డికి చేదు అనుభవం

కడప, మేజర్‌న్యూస్ :జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ నేత సతీష్‌రెడ్డికి స్థానిక ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే కడప జిల్లా తొండూరు మండలం ఇనగలూరులో శుక్రవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం నేత, శాసన మండలి మాజీ వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే అక్కడి ప్రజలను నుంచి సతీష్ రెడ్డికి ఊహించని అనుభవం ఎదురైంది. ఏహోదాతో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ స్థానిక ప్రజలు ఆయన్ను నిలదీశారు. దీంతో సతీష్‌రెడ్డి చేసేది ఏమీలేక అక్కడి నుంచి ఆగ్రహంగా వెనుదిరిగాడు.


రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం

టీడీపీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్



కర్నూలు,సూర్యప్రతినిధి: రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయమని టీడీపీ ఎమ్మెల్సీ కే.ఈ.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండ ల పరిధిలోని చిన్నభూంపల్లి గ్రామంలో నిర్వహించిన జన్మ భూమి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి ప్రతి గ్రామంలో సీసీ రహదా రులు, మురుగు కాలువలు, తాగునీటి పథకాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు కనబడుతున్నాయని అన్నారు. మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ తిక్కారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులను పార్టీలకు అతీతంగా మంజూరు చేస్తున్నామన్నారు.

విద్యావ్యవస్థకు ప్రపంచస్థాయి గుర్తింపు



ఇరగవరం,సూర్యబ్యూరో: విద్యావ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి గుర్తింపు పొందేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నాడని దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. ఇరగవరం మండలం తూర్పు విప్పర్రులో జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. చంద్రన్న బీమా పథకం వల్ల ప్రమాదం జరిగిన కుటుంబానికి అందించే సొమ్ము ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు.

త్వరలోనే వీఐపీ దర్శన టికెట్ల రేట్లు పెంపు

- టైమ్ స్లాట్ సర్వదర్శనం విజయవంతం
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



తిరుమల,సూర్యప్రతినిధి: తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల రేట్లు పెంచాల్సి వస్తోందని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. ఎప్పుడో గత 10 సంవత్సరాల క్రితం నిర్ణయించిన రేట్లు ఇంకా అమలులో ఉన్నాయన్నారు. కాలానుగుణంగా మార్పులు అవసరం అని అన్నారు. భక్తుల అవసరాల దృష్ట్యా రేట్లు పెంచక తప్పదని ఈవో తెలిపారు. వీఐపీ దర్శనాల రేట్లు పెంచడం వల్ల సామాన్య భక్తులపై ఎలాంటి భారం పడదన్నారు. త్వరలో విధి విధానాలు ప్రకటిస్తామన్నారు. గతేడాది శ్రీవారి హుండీ ద్వారా రూ. 995.89 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ ఈవో సింఘాల్ తెలిపారు. ఈ నెలాఖరు నాటికి క్యూకాంప్లెక్స్‌లోని క్యూలైన్లలో తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే భక్తుల కోసం తిరుపతిలో 2500 గదులను నిర్మిస్తామన్నారు. బ్రేక్ దర్శన టిక్కెట్ల ధర పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ప్రభుత్వానికి ఎలాంటి నివేదిక పంపలేదని ఆయన పేర్కొన్నారు. 2017లో 2,73,13,897 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని, గతేడా ది 10,66,72,730 లడ్డూలు పంపిణీ చేశామని సింఘాల్ తెలిపారు. టైం స్లా ట్ సర్వదర్శనం విజయవంతమైందని టీటీడీ ఈవో సింఘాల్ చెప్పారు. మార్చి మూడో వారం నుంచి పూర్తి స్థాయిలో టైం స్లాట్ సర్వదర్శనం అమలు చేస్తామ న్నారు. మార్చి నెలకు సంబంధించి 10658 ఆర్జితసేవా టిక్కెట్లు.. శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, ఏప్రిల్ నెలకు సంబంధించి 10658 టిక్కెట్లు అందుబాటులో ఉంచామని ఈవో పేర్కొన్నారు. రికార్డు స్థా యిలో 1.75 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పిం చామ న్నా రు. 24న రథసప్తమి సందర్భంగా శ్రీవారు సప్త వాహనాలపై భక్తులకు దర్శన మిస్తారని, ఈ నెల 9, 29న వికలాంగులు, వృద్ధులకు, 10, 30 తేదీల్లో చంటి బిడ్డ తల్లిదండ్రులకు శ్రీవారి దర్శనాన్ని కల్పిస్తామని సింఘాల్ వెల్లడిం చారు.

రూ 4.5 కోట్లతో వంతెనకు హోమ్ మంత్రి శంకుస్థాపన



విశాఖపట్నం,సూర్యప్రతినిధి: ప్రజా సంక్షేమం కోసం టీడీపీ కృషి చేస్తుందని హోంమంత్రి చినరాజప్ప తెలిపారు. విశాఖ జిల్లా కోటవురట్ల మండలం జల్లూరు వద్ద వరహానదిపై రూ. 4.5 కోట్లతో నిర్మించే వంతెనకు రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం శంకుస్థాపన చేశారు. శుక్రవారం రహదారులు, భవనాలశాఖ మంత్రి సీహెచ్ అయ్యన్నపాత్రుడితో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 5ఏళ్ల క్రితం వచ్చిన వరదలకు బ్రిటిష్ కాలం నాటి వంతెన కుంగిపోవడంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించింది. ప్రస్తుతం వంతెన లేక పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు రాకపోకల కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ నిర్మాణం పూర్తయితే ప్రజలకు కష్టాలు తీరనున్నాయి.

వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సూర్యాపేట క్రైం, మేజర్‌న్యూస్ : వాహనదారులు రోడ్డు ప్రమాధాలపై ముందస్తు జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాధాలను నివారించవచ్చునని జిల్లా ఎస్పీ ప్రకాశ్‌జాదవ్ అన్నారు. శుక్రవారం డయిల్ యువర్ ఎస్పీ ద్వారా 4 ఫిర్యాదులు అందగా ఫోన్ ద్వారా వారి సమస్యలు తెలిపినట్లు ఆయన అన్నారు. రోడ్డు ప్రమాధాల నివారణ, రోడ్డు భద్రతలో భాగంగా జిల్లా పోలీసు ప్రజలకు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. పోలీసు సిబ్బందితో కలిసి పోలీసు కలజాత సిబ్బంది గ్రామాల్లో, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. వాహనదారులు ఇతరులకు ఇబ్బందులు కల్గించవద్దని పోలీసు సిబ్బంది చేసే సూచనలను, ట్రాఫిక్ నియమాలను జాగ్రత్తలను పాటించాలని ఆయన అన్నారు.

మొదటి దశ భూ ప్రక్షాళన పూర్తి



- 71,75,096 ఖాతాలు
- 1.42కోట్ల వ్యవసాయానుకూల భూమి
- త్వరలో పాస్‌బుక్కుల పంపిణీ
- ఇకపై మ్యుటేషన్ల అధికారం తహశీల్దార్లకే
- క్రయవిక్రయాలు జరిగిన వెంటనే అధికారుల వద్ద వివరాలు
- వాకాటి కరుణతో పాటు కలెక్టర్లకు అభినందించిన సీఎం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ ప్రక్షాళన మొదటి దశ భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయినట్లు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రాష్ట్రంలో 71,75,096 వ్యవసాయ ఖాతాలున్నట్లు తేలిందని, 1,42,12,826.17 ఎకరాల వ్యవసాయయోగ్యమైన భూమి ఉన్నట్లు లెక్కకొచ్చిందని సిఎం ప్రకటించారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర సిబ్బందికి సిఎం శుభాకాంక్షలు తెలిపారు. వీలైనంత తొందరలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందివ్వనున్నట్లు సిఎం వెల్లడించారు. ఇప్పటి నుంచి భూముల క్రయ, విక్రయాలు జరిగిన వెంటనే ఆ వివరాలు రాష్ట్ర అధికారుల వద్ద కూడా నమోదు కావాలని చెప్పారు. భూముల మ్యుటేషన్ అధికారం కూడా ఎమ్మార్వోలకే అప్పగిస్తున్నామని, ఇక ఆర్డీవోల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.
రాష్ట్రంలో ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలు ఎన్ని అనే విషయంలో ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నదని, దానికి అనుగుణంగా క్రాప్ కాలనీలు నిర్ధారించి, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మంచి మార్కెట్ ఉన్న పంటలను, నాణ్యతారకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాల్సిందిగా రైతులను కోరనున్నట్లు వెల్లడించారు. కల్తీ విత్తనాలను అరికట్టడంలో గత ఏడాది ఎంతో కృషి జరిగింది. ప్రభుత్వం పిడి యాక్టు కూడా తెచ్చింది. ఈ ఏడాది కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. విత్తనాల తయారీ దారులు, అమ్మకం దారుల వివరాలు, ఫోటోలు ముందే సేకరించి పెట్టుకోవాలని, ఎక్కడ ఏ పొరపాటు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు. ఎరువుల కొరత రాకుండా ముందే స్టాక్ పెట్టుకున్నారని, అయినప్పటికీ ఎక్కడ ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకోవాలని సిఎం కోరారు. రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ కొత్తగా గోదాముల నిర్మాణం జరుగుతుందని, దీంతో 22.50 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు అందుబాటులోకి వస్తాయన్నారు. వేర్ హౌజింగ్, ఎఫ్.సి.ఐ. గోదాములు కూడా కలుపుకుంటే రాష్ట్రంలో 53 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములుంటాయని, వీటిని ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోవడానికి కూడా ఉపయోగించుకోవచ్చని సిఎం చెప్పారు. పంటలకు చీడ, పీడలు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలి. వ్యవసాయ విస్తరణాధికారులు రైతులను చైతన్య పరచాలని సిఎం కోరారు. రాష్ట్రంలోని ఏ ఎకరంలో ఏ పంట వేశారనే లెక్కలు వ్యవసాయ శాఖ వద్ద ఉండాలి. రెవెన్యూ శాఖపై ఆధారపడవద్దు. వ్యయసాయ విస్తరణాధికారులతో సమాచారం తెప్పించుకోవాలి అని సిఎం కోరారు.

భూ సర్వేలను పనులను వెంటనే పూర్తిచేయాలి : సంయుక్త కలెక్టర్



భూవివాదాలకు శాశ్వత పరిష్కారం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డు ల ప్రక్షాళన చరిత్రలో నిలిచిపోతుందని సంయుక్త కలెక్టర్ డి. సంజీవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నందు భూ పక్షాళన, సమగ్ర భూ సర్వే నిర్వహణ అంశాలపై మండల తహశీల్దార్ లతో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిగిలి ఉన్న భూసర్వే పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుగా ఉన్న సర్వే నెంబర్లను సరిచూసి వాటిని సరిచేయడమే ప్రభుత్వ ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రతి ఖాతా సెంటర్లకు సంబంధించిన పూర్తి వివరాలను వెబ్ లాండ్‌లో నమోదు చేయ్యాలని అన్నారు. ఆర్‌ఓఆర్ రికార్డు ప్రక్షాళన బావితరాలకు స్ఫూర్తిగా అందివ్వాలని అన్నారు. జిల్లాలో 772633 సర్వే నెంబర్లను కలిగి ఉన్నాయని 779612 పరిశీలించనైనదని వాటిలో 578930 సర్వే నెంబర్లు సృష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్, ఆర్‌డిఓ మోహన్‌రావు, తహశీల్దార్లు , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై యంత్రాంగం కృషి : పరకాల ప్రభాకర్



విజయవాడ, సూర్య బ్యూరో : జన్మభూమిమాఊరు కార్యక్రమం 2వ తారీఖున మొదలైన నాటి నుంచి ప్రజలు లక్షలాదిగా హాజరై తమ వినతులు సమర్పిస్తున్నారని, వాటిని అధికార యంత్రాంగం పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డా.పరకాల ప్రభాకర్ తెలియజేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డా.పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 2, 3, 4 తేదిలలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో 3,82,615 మంది నుంచి వినతులు వచ్చాయని, ఈ మూడు రోజులలో 18,86,783 మంది పాల్గొన్నారని తెలిపారు. జన్మభూమిమాఊరు కార్యక్రమాలలో 67,356 మందికి రేషన్ కార్డులు ఈ మూడు రోజులలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొత్తగా అర్హులైన వారికి 42,489 క్రొత్త పెన్షన్లు మంజూరు చేశామన్నారు. ఈ మూడు రోజుల పాటు 6,622 హెల్త్ క్యాంపులు నిర్వహించగా, ఇందులో 3,88,570 మంది రోగులను పరీక్షించామన్నారు. కంటి సమస్యలపై పరీక్షించి 18,747 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. వెటర్నరీ క్యాంప్స్ 12,119 నిర్వహించామని, యాక్టివిటీస్ ఎ క్రింద ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. యాక్టివిటీస్ బి లో వకృత్వం, వ్యాస రచన పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు అందించామన్నారు. ఈ పోటీలలో 61,235 మంది పాల్గొన్నారన్నారు. 2వ తేది కన్నా 3వ తారీఖున అర్జీలు 140 శాతం పెరిగాయని, రెండవ రోజుకన్నా మూడవ రోజు 3 శాతం అర్జీలు తగ్గాయన్నారు. ప్రజల హాజరు మొదటి రోజు కన్నా రెండవ రోజు (3వ తేది) 124 శాతం అధికంగా, రెండవ రోజు కన్నా మూడవ రోజు 4 శాతం తగ్గిందని, దీనికి కారణం మొదటి రోజు పెద్ద గ్రామాలు నుంచి ప్రజలు హాజరు అయ్యారని భావిస్తున్నట్లు, తర్వాత చిన్న గ్రామాల నుంచి ప్రజలు రావటం వల్ల ఇది ఏర్పడినట్లు తెలుస్తుందన్నారు. మొత్తం మూడు రోజులలో గ్రామ సభలు 28,998 నిర్వహించడం జరిగిందన్నారు. మూడవ రోజు 1,55,009 అర్జీలు రాగా గుంటూరు నుంచి 22,179 అర్జీలు వచ్చాయని, అత్యల్పంగా శ్రీకాకుళం నుంచి 3,019 వచ్చాయన్నారు. మూడవ రోజు 7,54,412 మంది హజరుకాగా, అత్యధికంగా గుంటూరులో 98,557 మంది హజరుకాగా, నెల్లూరులో అత్యల్పంగా 32,096 మంది హాజరయ్యార న్నారు. మూడవ రోజు రేషన్ కార్డులు మొత్తం పంపిణీ 25,262 కాగా, అత్యధి కంగా కర్నూలులో 3,533 కాగా, అతి తక్కువ శ్రీకాకుళంలో 460 పంపిణీ చేశామన్నారు. మూడవ రోజు ఫించన్లు 13,262 పంపిణీ చేయగా, అత్యధికంగా పశ్చిమగోదావరిలో 2,478, అత్యల్పంగా కడపలో 111 పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాలు మూడవ రోజు 4,769 పంపిణీ చేయగా, అనంతపురంలో అత్యధికంగా 1,158 అత్యల్పంగా ఇళ్ల స్థలాలు 337 పంపిణీ చేశామన్నారు. పనిముట్ల పంపిణీ మూడవ రోజు 24,842 పంపిణీ చేయగా అత్యధికంగా గుంటూరులో 20,048, అత్యల్పంగా కర్నూలులో 3 పంపిణీ చేయడం జరిగిందన్నారు. హెల్త్ క్యాంపులు 2,527 నిర్వహించగా, అత్యధికంగా 277 చిత్తూరులో, అతి తక్కువగా ప్రకాశం జిల్లాలో 152 నిర్వహించడం జరిగిందన్నారు. మూడవ రోజు జన్మభూమి కార్యక్రమంలో 1,55,026 మంది వైద్యం కోసం నమోదు చేసుకోగా కంటి సమస్యలపై 7,108 మందికి పరీక్ష చేయడం జరిగిందన్నారు. వెటర్నరీ క్యాంప్‌లు మొత్తం 5,629 నిర్వహించగా, చంద్రన్న బీమా క్లైమ్స్ 22,820 మూడవ రోజు పంపిణీ చేయడం జరిగిందన్నా రు. నిన్న జరిగిన బి యాక్టివిటీస్ క్రింద 23,977 మంది హజరుకాగా అత్యధి కంగా అనంత పురం నుంచి 5,244 మంది, అత్యల్పంగా శ్రీకాకుళం నుంచి 277 మంది హాజరయ్యారని తెలిపారు. 5వ తేదీ జన్మభూమిమా ఊరు కార్య క్రమం కింద సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 64,855 వినతులు వచ్చాయన్నారు. ప్రజలు 3,65,868 మంది పాల్గొన్నారన్నారు. రేషన్ కార్డులు 11,049 మంది కి పంపిణీ చేసామని, పెన్ష న్లు 8,894 మందికి కొత్తగా మంజూరు చేశామన్నా రు. ఇళ్ల స్థలాలు 3,170 మందికి, 2,677 మందికి పనిముట్లు పంపిణీ చేయ గా, హెల్త్‌క్యాంపులు 1160 నిర్వ హణకు 72,191 మంది నమోదు చేసుకు న్నారన్నారు. హెల్త్ క్యాంపుల ద్వారా 2,593 మందికి కళ్లజోడు పంపిణీ చేశామ న్నారు. యాక్టివిటీస్ బి కింద నిర్వ హించిన పోటీలలో బహుమతులు పొందిన వారు 10,476 మంది ఉన్నారని తెలియజేశారు.

దేశ అభివృద్ధికై ప్రత్యేక ప్రార్థన



భానుపురి, మేజర్‌న్యూస్ : దేశం ఆర్థిక అభివృద్ది చెందాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ అసోసియేషన్ జిలా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబరాద్‌లో జరిగే జాతీయ ప్రత్యేక ప్రార్ధన దినం సభకు క్రైస్తవులు భారిగా తరలివెళ్లారు. ఈసందర్భంగా మున్సిపల్‌చైర్ పర్సన్ గండూరి ప్రవల్లిక ప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గాబ్రియేల్, మీసాల గోవర్ధన్, లాజర్, పూర్ణశశికాంత్, జాకోబ్, మణిదాస్, యేసుపాదం, మత్తయి, ఫిలిప్, అంజయ్య, జనార్ధన్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.



సముద్ర తాబేళ్ల సంరక్షణకు అటవీ శాఖ చర్యలు

విజయవాడ, సూర్య బ్యూరో : సముద్ర తాబేళ్ళ సంరక్షణకు అటవీశాఖ అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సముద్రతీరంలో మత్యకారులకు అవగాహనా కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు అటవీశాఖ ముఖ్యసంరక్షణా అధికారి (పి.సి.సి.ఎఫ్) పి.మల్లికార్జునరావు వెల్లడించారు. శుక్రవారం అటవీశాఖ ప్రధానకార్యాలయంలో ట్రీఫౌండేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ, ట్రీఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సముద్రతీరప్రాంతంలో జనవరి నుండి మే వరకూ తాబేళ్ళు కృషి చేయాలని కోరారు. తాబేళ్ళను రక్షిస్తే సముద్రజీవులన్నిటినీ కాపాడినట్లేనని, తాబేళ్ళను చంపడం వాటిని తినడం చట్టప్రకారం నేరమని ఆయన అన్నారు. ఆంధ్రరాష్ట్ర సముద్రతీరానికి వచ్చే ఒకే ఒక్క సముద్ర వన్యప్రాణి చిన్న తాబేలు మ్రాత్రమేనని, తాబేలు వల్ల సముద్రంలో మత్స్య సంపద పెరుగుతుందని అన్నారు. వెయ్యి తాబేళ్ళను సముద్రంలో వదిలితే గుడ్లు పెట్టే సమయానికి ఒక తాబేలు మ్రాత్రమే మిగులుతుందని మిగతా 999 తాబేళ్ల పిల్లలు పెద్ద చేపలకు ఆహారమవుతున్నాయన్నారు. సముద్రగర్భంలోని రాళ్ళపై ఉండే పాచి, చెట్లు గుడ్లు పెట్టే సమయంలో వాటిని రక్షించి సముద్రంలోనికి వదలడానికి ఫౌండేషన్ ప్రతినిధులు తాబేలు తిని శుభ్రపరచి నందు వలన అందులో చేపలు వచ్చి గుడ్లుపెట్టి చేపలు ఉత్పత్తి జరుగుతుందని ఆయన వివరించారు. తాబేలు తింటే వ్యాధులు తగ్గుతాయని అనడం కూడా మూఢనమ్మకమేనని అన్నారు. ప్రకృతిలో ప్రతీజీవి మరొక జీవిపై ఆధారపడి ఉన్న కారణంగా ఒకదానిని చంపితే దానిమీద ఆధారపడి జీవించే జీవులన్నింటికీ అపాయమని ఆయన వివరించారు. ట్రీఫౌండేషన్ చైర్‌పర్సన్ డా॥ సుప్రజ ధరణి మాట్లాడుతూ సముద్ర తాబేళ్ళను కాపాడడానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటివరకూ పదహారు లక్షల తాబేళ్ళ పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలామని ఈ సీజన్‌లో వీటికి రెట్టింపు తాబేళ్ళ పిల్లలను సముద్రంలో వదలడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు.

పేదల కన్నీళ్లు తుడుస్తున్న చంద్రన్న ప్రభుత్వం

- పేదల అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలు అమలు
- పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికోన్నతి సాధించాలి
- ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ
- ముఖ్యమంత్రి సారథ్యంలో దర్శి నియోజకవర్గం అభివృద్ధి
- రూ 1750 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు
- త్వరలో పారిశ్రామిక హబ్‌గా దొనకొండ ప్రాంతం
- ప్రజా సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వెంకటాపురంలో రూ 11 లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభం
- సీఎం సహాయ నిధి నుంచి పలువురికి చెక్కులు అందజేత
- జన్మభూమి కార్యక్రమంలో మంత్రి శిద్దాకు బ్రహ్మరథం
- దొనకొండ, కురిచేడు మండలాల్లో గ్రామ సభల్లో పాల్గొన్న మంత్రి శిద్ధా రాఘవరావు



దొనకొండ, కురిచేడు, మేజర్‌న్యూస్: దొనకొండకు త్వరలో మహర్దశ పడుతుందని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. శుక్రవారం దొనకొండ మండలం పడమటి వెంకటాపురం, కురిచేడు మండలం బయ్యవరం గ్రామంలో జరిగిన 5వ విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి చెందుతుందని అయనన్నారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి 24 వేల కోట్ల రూపాయాలతో రైతు రుణమాఫీ అమలు చేయడం జరిగిందన్నారు. 12 వేల కోట్ల రూపాయలతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తారన్నారు. రూ 6 వేల కోట్లతో వివిధ రకాల పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో 16 వేల 500 కోట్లలు లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. గడిచిన మూడున్నరేళ్ల కాలంలో భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ ను అభవృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాద యాత్ర సమయంలో వృద్ధులకు ఇచ్చిన మాట కోసం రూ 200 పెన్షన్ వెయ్యి రూపాయలు, రూ 500 పెన్షన్ రూ 1500 పెంచారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యారంగానికి అధిక ప్రధాన్యత ఇస్తుందన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 16 వేల 500 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సంవత్సరం అదనంగా మరో 6 వేల 400 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థుల అభివృద్ధి కోసం అదనపు తరగతి గదులను, డిజిటల్ గదులు మౌళిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిదన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలో రూ 1750 కోట్ల రూపాయాలతో గతంలో ఎన్నాడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేశామన్నారు. కురిచేడులో రూ 30 కోట్లతో సోషల్ వెల్ఫేర్ బాలిక రెసిడెన్షియన్ హాస్టల్ నిర్మిస్తున్నామన్నారు. దొనకొండ మండలంలో రూ 245 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. దొనకొండ నుంచి పీ వెంకటాపురం వరకు 4.30 కోట్ల రూపాయల తారు రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. గ్రామ పంచాయితీలో ఉపాధి పథకం నిధుల రూ 10 లక్షలతో గ్రామ పంచాయితీ భవనం నిర్మించామన్నారు. దొనకొండ గ్రామంలో రూ 1.50 కోట్లతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేశామన్నారు. దర్శి నియోజకవర్గం పరిధిలోని త్రాగు నీటి సమస్యలు పరిష్కరించడానికి 75 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు తన సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పడమటి వెంకటాపురం గ్రామంలో గృహ నిర్మాణాలకు నివేశ స్థలాల పట్టాలను, రేషన్‌కార్డులు, పెన్షన్లు, చంద్రన్న భీమా పథకం క్రింద రూ 10 లక్షల ప్రొసిడింగ్ అర్డర్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మార్కెట్ కమిటీ అధ్యక్షులు సుబ్బారావు, దర్శి నియోజకవర్గ జన్మభూమి-మా ఊరు ప్రత్యేక అధికారి, దర్శి నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి రవి, దొనకొండ ఎంపీపీ నాగులపాటి గాలేమ్మ, కోటేశ్వరరావు, సర్పంచ్ తోట రాజేశ్వరి, ఎంపీడీవో రాజేంద్ర, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు షేక్ మగ్గబుల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఓ నరకాసురుడు...వైసిపి ధ్వజం



మాట్లాడుతున్న వైసిపి నేతలు

సూర్య జనరల్ బ్యూరో అమరావతి: గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓ నరకాసూరిడి లా రాష్ట్ర ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నారన వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీ రావి వెంకట రమణ..వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి రోశయ్య లు ఆరోపించారు. అందరి ఇళ్లలో ఆనందం నిపానని ముఖ్యమంత్రి అనుకుంటే సరిపోతుందా అని వారు ప్రశ్నించారు. గుంటూరు అరండలపేటలోని జిల్లా వైసిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. గత నాలుగేళ్లలో జన్మభూమి లో చేపట్టిన కార్యక్రమాలు..ఐదో విడత జన్మభూమిలో ఇస్తున్న హామీలపై ప్రభుత్వం స్వేతప్త్రం విడుదల చేయాలని డిమాండ్ల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమం ప్రజలను వంచించడానికి మ్రాత్రమే చేస్తుందన్నారు. అన్నారు..జన్మభూమి కమీటీ ల పేరుతో పచ్చ చొక్కాలకు పరిమితంగా మారి ంది. గత నాలుగేళ్లుగా ఈ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఐదు సంతకాలు పెట్టారని వారు గుర్తు. హేశారు. వాటిని అమలు చేయకుండా కొత్తగా హామీలు ఇస్తున్నారు. ప్రజలు గమనిస్తున్నారు. ముఖ్య మంత్రి చెప్పే మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. తాత్కాలిక రుణ మాఫీ కింద 13.176 కోట్లు కావాల్సి ఉంటే కేవలం 3600 కోట్లు ..డ్వాక్రా సంఘాల వడ్డీ లేని రుణాలకు 3,420 కోట్లు అవసరం అయితే ఇచ్చింది 110 కోట్లు మ్రాత్రమేనన్నారు. అదేవిధంగా డ్వాక్రా కు పెట్టుబడి నిధి కింద 3316 కోట్లు కావాల్సి ఉండగా 1600 కోట్లు మ్రాత్రమే విడుదల చేశారని వారు అన్నారు. గత నాలుగు రోజుల నుంచి జరుగితిన్న జన్మభూమి లో రేషన్ కార్డులు.. పింఛన్లు..ఇళ్ల నిర్మాణాలకు ఈ జిల్లాలో 70 వేళకు పైగా దరఖాస్తు లు పైగా వచ్చాయని చెప్పారు. దీన్ని బట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారు లేదా తేలిపోయిందన్నారు.. జన్మభూమి లో అనేక గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాక అర్జీలు పెట్టిన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మరుగుదొడ్లు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయన వారు మండిపడ్డారు ఈ ప్రభుత్వం జన్మభూమిని ఒక పార్టీ కార్యక్రమం గా చేపట్టింది తప్ప ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. అనేక గ్రామాల్లో తాము పర్యటిస్తున్న సమయంలో మరుగుదొడ్లు లేవని ఇల్లు కూడా మంజూరు కాలేదని వాపోయారని ఆవేదన వ్యక్తం చేశారు అనేక చోట్ల జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు తిరగబడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం 4 సంవత్సరాల కాలంలో పేద ప్రజల విషయంలో వివక్షత చూపిస్తూ పేద ప్రజలకు మోసం చేస్తున్నాడని విమర్శించారు. పార్టీలకు అతీతంగా నిర్వహించాల్సిన జన్మభూమి కార్యక్రమంలను పచ్చ చొక్కాల కోసం నిర్వహిస్తున్నట్లుగా కనపడుతుందన్నారు. రాష్టంలో మా అధినేత జగన్మోహన్ రెడ్డి చేప్పట్టిన ప్రజా సంకల్పం యాత్ర ను చూసి ఓర్వలేక చంద్రబాబు జన్మభూమి ని తెరమీదకు తెచ్చారని ఆరోపించారు .దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడు కొన్ని వేల లక్షల ఇళ్ల నిర్మాణం చేపడితే ఈనాడు చంద్రబాబు నాయుడు ఆ లెక్కలను కూడా జమ చేసుకొని పూర్తి స్థాయిలో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేశామని చెప్పడం చాలా విడ్డురంగా ఉందన్నారు.రాష్ట్రంలో టిడిపి నిర్వహిస్తున్న ఆనందలహరి ఏ ఒక్కరి ఇళ్లలో ఆనందంగా లేరని కేవలం ముఖ్యమంత్రి.. ఆయన క్యాబినెట్ మర్త్రుల ఇళ్లలో మాటేంఏ ఆనందంగా ఉన్నారని వారు ఎద్దేవా చేశారు..ఇప్పటికైనా చంద్రబాబు మాయమాటలు చెప్పడం మాని ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయండి అని వారు సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో మందపాటి శేషగిరిరావు ఆగతవరపాడు గ్రామ సర్పంచ్ గద్దె కిషోర్ .మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ జిలని %ంఎ% సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు బండారు సాయి బాబు.యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిటిపాటి ప్రేమ్ కుమార్.రైతు విభాగం అధ్యక్షులు తిప్పారెడ్డి రామక ష? రెడ్డి .మోక్షగుండం వంశీ. శ్యామ్.పలువురు నాయకులు పాల్గొన్నారు...

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ

- మంత్రి నారా లోకేష్
- నరసాపురం విచ్చేసిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్
- భారీ ర్యాలీగా పట్టణ వీధులలో నారా లోకేష్‌కు ఘన స్వాగతం




నరసాపురం,మేజర్‌న్యూస్ః రాష్ట్ర పంచాయతీ రాజ్, ఐటి శాఖా మాత్యులు నారా లోకేష్ కు నరసాపురం పట్టణంలో ఘన స్వాగతం లభించింది.శనివారం మధ్యాహ్నం 4 గంటలకే చేరాల్సిన మంత్రి పాలకొల్లు నుండి రావడం ఆలస్యమైనా ఆయన రాక కోసం ప్రజలు, మహిళలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న రోడ్డు కిరువైపులా బారులు తీరారు. పాలకొల్లు నుండి రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ఇసుక ర్యాంపు వద్ద ఉన్న ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంపై మంత్రి నారా లోకేష్ రోడ్డు కిరువైపులా ఉన్న పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ భారీ మోటార్ సైకిళ్ళ ర్యాలీతో, తీన్ మార్ వాయిద్యాలుతో , బాణ సంచాకాల్పులతో ఆయనకు ఘనంగా స్వగతం పలికిన పార్టీ శ్రేణులుతో కలసి ర్యాలీగా బయలు దేరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళులు అర్పించారు.అక్కడ నుండి ర్యాలీగా బయలు దేరి బరియల్ గ్రౌండ్ వద్ద దేశంలోనే తొలిసారిగా రు.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన మల వ్యర్థ శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన రాష్ట్రంగా మార్చాలన్నదే ద్యేయంగా పనిచేస్తూ కోట్లాది రూపాయిలు వెచ్చిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా నియోజకవర్గంలోని మొగల్తూరు మండలం మొగల్తూరు పంచాయతీలో రు. 13 కోట్ల వ్యయంతో నిర్మించిన సమగ్ర మంచినీటి పథకాన్ని ప్రారంభించేందుకు బయలు దేరి వెళ్లారు. అయన వెంట స్దానిక ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, మున్సిఫల్ చైర్ పర్సన్ పసుపులేటి రత్నమాల సాయి, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు డా॥ శిరిగినీడి రాజ్యలక్ష్మీ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బండారు పటేల్ రాజా నాయుడు, నాయకులు, వివిధ ప్రజాప్రతినిధులు డా॥ చినిమిల్లి సత్యనారాయణ, రాయుడు శ్రీరాములు, పొత్తూరి రామరాజు, జీవిఎస్ లక్ష్మీఫణి, కూనపరెడ్డి రంగారావు, కొప్పాడ రవీంధ్రనాథ్ ఠాగూర్, కొల్లు పెద్దిరాజు, ఎంపిపి వాతాడి కనకరాజు, జెపిటిసి బాలం ప్రతాఫ్ , తెలుగు యువత అధ్యక్షులు రెడ్డిం శ్రీను, గన్నవరపు శ్రీను, బెజవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలలో అవగాహన కల్పించాలి : మంత్రి దేవినేని ఉమా




విజయవాడ, సూర్య బ్యూరో : 5వ విడత జన్మభూమి కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో మీ ముందు జరువుకోవడం ఆనందంగా వుందని జలవనరుల శాఖ దేవినేని ఉమామహేశ్వరావు పేర్కొన్నారు. శుక్రవారం 5వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో భాగంగా విద్యావికాసం పై పలు శాఖల పరిధిలో విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కింద ఎన్‌టిఆర్ విద్యోన్నతి కింద సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణను అందించడం జరుగుతోంది. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. చంద్రన్న బీమా ద్వారా నిరాదకణకు గురైన కుటుంబాలకు ఆసరాగా గతంలో ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం 30 వేలు ఇస్తే ప్రస్తుతం తాము 2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తు న్నామన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నేరవేర్చాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. జన్మభూమి వేదికగా ప్రజా సమస్యలపై చర్చించి ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న మౌలికవసతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా వాటిపై అక్కడ వున్న ప్రజల సూచనలకు సలహాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శాసనసభ్యులు బొండా ఉమమహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మౌలిక సదుపాయాలు అందించడంలో పెద్ద పీట వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా వాంబే కాలనీలో పర్య టించిన ఏకైక ముఖ్యమంత్రిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి అధ్యక్షత వహించి కాలనీలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ జె. నివాస్, డిప్యూటి ఇఇ పి. గంగరాజు, ఇతర సమన్వయ శాఖ అధికారులు, సిబ్బంది, మహిళలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. చంద్రన్న బీమా లబ్దిదారుల కుటుంబాలకు చెక్కులను, డ్వాక్రా మహిళలకు రు.2.89 కోట్ల మేర చెక్కులను మంత్రి అందజేశారు.

చెంబు చచ్చింది...ఆత్మగౌరవం బ్రతికింది



విజయవాడ, సూర్య బ్యూరో : ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమంలో భాగంగా చెంబు చచ్చింది...ఆత్మగౌర వం బ్రతికింది నినాదంతో కృష్ణాజిల్లాలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. డిసెంబర్ 19వ తేది నుండి స్వచ్ఛకృష్ణా 21 రోజుల ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా వినూత్న రీతిలో నిర్వహిస్తూ రోజుకు ఒక ప్రత్యేకతను చాటుకుంటుంది. మరుగుదోడ్లను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలనే ప్రధాన అంశంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, చర్చాగోష్టిలు, వైట్‌డ్రస్ కోడ్, జెండా అవిష్కరణ, రిలే నిరాహార దీక్షలు, మత పెద్దలు, మీడియా ప్రతినిధులతో సమావేశం, ఛాయా చిత్రాల ప్రదర్శన, సైకిల్, మోటార్ బైక్స్ ర్యాలీలు, వ్యాస, వకృత్వ, చిత్రలేఖన పోటీలు అందరికి అకట్టుకుంటున్నాయి. కృష్ణాజిల్లా గూడూరులో గ్రామప్రజలు చెంబు ను అలంకరించి ఊరేగింపుతో చెంబు చచ్చింది...ఆత్మగౌరవం బ్రతికింది నినాదాలతో ఊరేగిస్తూ ఊరు బయట చెంబును పాతిపెట్టడం వినూత్నమైన కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది.కృష్ణాజిల్లా యంత్రా ంగం నిర్వహిస్తున్న ఆత్మగౌరవ దీక్షలో కృష్ణాజిల్లాలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఆదర్శంగా ఉంటున్నాయని, ఇతర జిల్లాలు కృష్ణాజిల్లాను స్పూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అధికారులకు సూచించడం జరిగింది.

జన్మభూమిలో వచ్చిన అర్జీలకే దిక్కులేదు : ఎన్.రఘువీరారెడ్డి



విజయవాడ, సూర్య బ్యూరో : గతంలో తొమ్మిదేళ్ళు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కనకదుర్గమ్మ కిరీటం దొంగిలించబడితే దానికి నకిలి కిరీటం పెట్టిన సంగతి ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని, ఇంకా ఆ గాయం నయం కాకముందే మళ్ళీ టిడిపి నాయకులు వచ్చారు. అంతకంటే పెద్ద అపచారం. కనకదుర్గమ్మ ఆలయంలో తాంత్రిక వూజలు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయంలో మీ ప్రమేయం, మీ అనుమతి లేకుండా జరిగిందా? లేక మీరే చేయించారా అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ప్రశ్నించారు. దుర్గగుడిలో తాంత్రిక వూజల విషయంపై టిడిపి నియమించే కమిటీలపై ప్రజలకు విశ్వాసం లేదని, హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని రఘువీరారెడ్డి డిమాండ్ల చేశారు. ఆంధ్రపదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏపి యువజన కాంగ్రెస్ సంస్థాగత సభ్యత నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధి ఆదేశాల మేరకు పిఆర్వో టి.కె.రామ్ అధ్వర్యంలో ఏపీ యూత్ కాంగ్రెస్ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభంచడం జరిగిందన్నారు. సభ్యత్వ నమోదుకు వయస్సు 18 నుంచి 35 సంవత్సరాలు నిర్ణయించడం అయిందన్నారు. సభ్యత్వ నమోదు ఆఖరి తేదీ ఫిబ్రవరి 28వ తేదీతో ముగుస్తుంది. ఏపీలోని నియోజకవర్గాల వారీగా 21 జిల్లాలుగా విభజించి, సభ్యత్వ నమోదు ప్రారంభించడం జరుగుతుందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో కిడ్నీలను అమ్ముకోవడం చూశామని, మళ్లీ టిడిపి ప్రభుత్వం వచ్చింది. మళ్లీ కిడ్నీ అమ్మకాలు ప్రారంభమయ్యాయన్నారు. జన్మభూమిని పండుగగా చేయాలని పిలువునిచ్చిన జన్మభూమి కార్యక్రమం పోలీసుల పహారాలో జరగడం విడ్డూరంగా వుందన్నారు. గత నాలుగు జన్మభూమిల్లో ఇచ్చిన అర్జీలకు దిక్కులేదన్నారు. మరుగుదొడ్లు మార్చిలోపు కట్టకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు దీక్ష చేస్తారంటా నాకు ఆశ్చర్యం వేస్తుందన్నారు. డిల్లీలోని నరేంద్రమోడి దగ్గర చేసివుంటే నేటికి ప్రత్యేకహోదా వచ్చేది, పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యేది, రాజధాని నిర్మాణానికి కావలసిన నిధులు వచ్చేవి, లోటు బడ్జెట్ రూ.16 వేల కోట్లు వచ్చేవి, రైల్వేజోన్ అన్ని వచ్చేవని అన్నారు. ఈ సమావేశంలో పిఆర్వో టి.కె.రామ్, యూత్ కాంగ్రెస్ ఏపి ఇన్‌చార్జీ వి.వరప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, పిసిసి నాయకులు జిల్లా, నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజయవాడలో క్రెడాయ్ ప్రాపర్టీ షో



విజయవాడ, సూర్య బ్యూరో : క్రెడాయ్ ఆధ్వర్యంలో కట్టిన ఇళ్లు నిండాలంటే రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటే ఐ.టి కంపెనీలకు స్పేస్ ఇవ్వాలని రాష్ట్ర ఐ.టి, పంచాయతీరాజ్ శాఖ నారా లోకేష్ చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షోను ఐ.టి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాజధాని ఏర్పాటు చేయడం ఆయన ముందుచూపుకు నిదర్శనమన్నారు. పాలన పారదర్శకంగా చేయడంతో పాటు ముఖ్యమంత్రి వికేంద్రీకరణ జరగాలని కోరుకుంటారన్నారు. ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ కు కేంద్రంగా, రాయలసీమ ఎలక్ట్రానిక్స్ రంగానికి కేంద్రంగా, అమరావతి ఐ.టిలో ప్రముఖ సంస్థలకు నిలయంగా చేయబోతున్నామన్నారు. విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో మొబైల్ తయారీ యూనిట్లు ఒక్కటి కూడా లేవని, ఈ మూడున్నర ఏళ్ళల్లో 2 మొబైల్ యూనిట్లు నెలకొల్పడం జరిగిందన్నారు. ఐ.టి సంస్థల్లో లక్ష ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని తక్షణమే 60 వేల ఉద్యోగాలు రాష్టంలో ఐ.టి పరిశ్రమల ఏర్పాటుకు స్పేస్ ఉంటే ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రముఖ హౌసింగ్ కార్పొరేట్ సంస్థలు ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని, ఐ.టి రంగానికి సంబంధించి కూడా భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సి.ఆర్.డి.ఎ పరిధిలో హౌసింగ్ స్కీమ్స్ విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని, దానికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో కన్‌స్ట్రక్షన్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చామన్నారు. త్వరలోనే జి.ఎస్.టి, రెరా చట్టం ఇబ్బందులపై దృష్టి పెడతామన్నారు. జి.ఎస్.టి కౌన్సిల్ జీఎస్‌టీ ఇబ్బందులపై చర్చిస్తుందన్నారు. క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఆధ్భుతమైన ప్రాపర్టీ షోను ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను యుద్ధప్రాతిపదికపైన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు మాట్లాడుతూ జి.ఎస్.టి, రెరా యాక్ట్ సమస్యలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో చేపడుతుందన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బోండా ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, సి.ఆర్.డి.ఎ కమీషనర్ చెరుకూరి శ్రీధర్, నగర మేయర్ కోనేరు శ్రీధర్, కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు శివారెడ్డి, శేఖర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూజలపై 40 మందిని విచారించాం

విజయవాడ, సూర్య బ్యూరో : దుర్గగుడిలో అర్ధరాత్రి పూజల వ్యవహారంపై సుమారు 40 మందిని విచారించామని నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు రఘునాథ్ అన్నారు. విచారణ వివరాలను దేవాదాయశాఖ కమిషనర్‌కు పంపిస్తామన్నారు. ఇక్కడ ఆయన మాట్లాడుతూ అంతరాలయాన్ని పరిశీలించి నివేదిక సమర్పిస్తామన్నారు.

సీసీ టీవీ ఫుటేజ్‌లో కనిపించింది గుమ్మడికాయలు కాదని, కొబ్బరి కాయలు ఉన్నట్టు విచారణలో తేలిందన్నారు. ఆలయం మూసివేసిన తరువాత కొబ్బరికాయలు కొడతారని తేలిందన్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌ను మరోసారి పరిశీలిస్తామని ఈ సందర్భంగా రఘునాథ్ వ్యాఖ్యానించారు.

సచివాలయ స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు



విజయవాడ, సూర్య బ్యూరో : సచివాల యం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2017 విజేతలకు సచివాల యంలో శుక్రవారం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, టూరిజం శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా లు బహుమతులు అందజేశారు. క్రికెట్, రన్నింగ్, షెటిల్ తదితర పోటీలలో వురుష, మహిళా విజేతలకు ప్రధమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ నూతన రాష్ట్రంలో మొదటి సారిగా నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల క్రీడా పోటీలను విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. మరో అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విన్నర్స్‌గా, రన్నర్స్‌గా నిలవడం కంటే పాల్గొనడం ముఖ్యమన్నారు. క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్న మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకష్ణ మాట్లాడుతూ వయసుతో సంబంధంలేకుండా ఉద్యోగులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్-2016లో కాంస్య పతకం సాధించిన కె. వెంకట్రావు, సౌత్ ఏషియన్ వెటరన్ టేబుల్ టెన్నీస్‌లో రజతపతకం సాధించిన బి.సుజాతలను సభకు పరిచయం చేశారు. నూతన రాష్ట్రంలో తొలి స్పోర్ట్స్‌మీట్ విజయవంతంకావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సంఘం క్రీడల విభాగం జాయింట్ సెక్రటరీ ఎన్ ఎస్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో, విజయవాడ ఐజీఎం స్టేడియంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు 4 రోజుల పాటు స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఉద్యోగులు దాదావు 700 మంది వరకు పాల్గొన్నట్లు తెలిపారు. సచివాలయం 6 బ్లాకుల్లోని మహిళ, వురుష ఉద్యోగులను 4 గ్రువులుగా, 31 టీమ్స్‌గా విభజించి మొత్తం 61 ఈవెంట్లలో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ



విజయవాడ మేజర్‌న్యూస్: వ్యక్తిగత మరుగుదోడ్లను ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఆరోగ్యవంతమైన సమాజానికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. శుక్రవారం ఎస్.ఆర్.ఆర్ అండ్ల సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్ యూనిట్). విద్యార్థులతో వ్యక్తిగత మరుగుదోడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదోడ్లను వాడండి...ఆరోగ్యంగా జీవించండి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి వ్యక్తిగత మరుగుదోడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా ప్రకటించామని దీనిలో భాగంగా ఇప్పటికే నిర్మించుకున్న మరుగుదోడ్లను వాడుకల్లోకి తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినప్పటికి బహిరంగ మలవిసర్జణ చేయడం సిగ్గుచేటన్నారు. బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల పరిసరాలు కలుషితం కావడంతో మన ఆరోగ్యానికి హాని కలిగించే కలరా, టైఫాయిడ్ల, మలేరియా మొదలైన వ్యాధులు సంభవిస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదోడ్లను నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఉండి వాడుతుంటే రోగాలు దరిచేరవని, తద్వారా కుటుంబం ఆరోగ్యంగా ఉండటంతో పాటు గ్రామం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం విద్యార్థులపైనే ఉందని, వ్యక్తిగత మరుగుదోడ్ల వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులు చేయవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందని కలెక్టర్ అన్నారు. ఈ అవగాహన ర్యాలీలో కళాశాల ప్రిన్సిపల్ డా.వెలగజోషి, ఎన్.ఎస్.ఎస్ యూనిట్ అధికారులు డా.వి.ఫణికుమార్, ఎం.హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



అమృత వాక్కులు

- భగవద్భక్తి పుస్తకాలు చదవడం వల్ల రాదు. చదివి ఎవరూ పారమార్థికులు కాలేరు. అందులో చెప్పబడిన ధర్మాలు ఆచరిస్తే సార్థకత.
- భగవత్సాక్షాత్కారానికి మనస్సును పూర్తిగా స్వాధీన పరచుకోవాలి. యోగి మనస్సుకు లొంగకుండా, మనస్సునే ఎల్లప్పుడూ తన స్వాధీనంలో ఉంచుకోవాలి.

సూర్య ఆరాధన

సూర్య
హైదరాబాద్
శనివారం
6 జనవరి 2018



స్వామియే శరణం

ఆదిశేషుడిపై పవళించిన శ్రీమహావిష్ణువు పాదాల చెంత భూదేవి, వక్షస్థలంలో లక్ష్మీదేవి కొలువుంటారు. ఆదిదేవుడైన శివుడు తలపై గంగను ధరించి, తన శరీరంలో అర్ధభాగాన్ని పార్వతికి ఇచ్చాడు. హరిహరాదుల అంశతో జన్మించిన శబరిమల అయ్యప్పస్వామి చిన్ముద్రిధారియై భక్తులకు దర్శనమిస్తారు. మిగతాదేవతలతో పోలిస్తే స్వామి యోగాసనంలో కూర్చుంటారు. స్వామి మోకాళ్ల చుట్టూ బంధనం ఉంటుంది. దీన్ని పట్ట బంధనం అంటారు. మహిషి సంహారం కోసం మానవ రూపంలో అవతరించిన హరిహరసుతుడు పందళరాజు వద్ద పెరిగాడు. సంతానం లేక బాధపడుతోన్న పందళరాజు అడవిలో దొరికిన బాలుడిని మణికంఠుడిగా పెంచి పెద్ద చేశాడు.

అయ్యప్పకు విద్యాబుద్ధులు చెప్పించి, రాజుగా పట్టాభిషేకం చేయాలని భావిస్తాడు పందళరాజు. అయితే తాను హరిహరసుతుడనని, ధర్మసంస్థాపన కోసం మానవ రూపంలో మహిషి సంహారం కోసం అవతరించాననే సత్యాన్ని నారద మహర్షి ద్వారా తెలుసుకున్నారు. మహిషిని వధించిన అయ్యప్పస్వామి తన అవతారం పూర్తయిందని పందళరాజుకు చెప్పి, తన కోసం ఆలయాన్ని నిర్మించమన్నారు. స్వామి కోరిక మేరకు శబరిమల ఆలయంలో పందళరాజు ఆలయంనిర్మించారు. అలా చిన్ముద్రదాల్చి యోగాసనంలో జ్ఞానపీఠంపై కూర్చుని భక్తులను అనుగ్రహిస్తుంటారు. శబరిగిరిపై ఆలయం నిర్మించి, స్వామికి ఆభరణాలు సమర్పించేందుకు పద్దెనిమిది మెట్లెక్కి పందళరాజు వస్తారు.

యోగాసనంలో అయ్యప్ప

తన పెంపుడు తండ్రి పందళరాజు రాకను గుర్తించిన స్వామి యోగాసనం నుంచి లేచి నిలబడటానికి ప్రయత్నిస్తారు. దీంతో పందళరాజు స్వామివారిని నిలువరించి తన భుజాన ఉన్న పట్టు వస్త్రంతో స్వామివారి మోకాళ్లకు చుట్టి బంధిస్తారు. తాను అయ్యప్పస్వామిని ఏ విధంగా చూసి తరించానో అదేవిధంగా భక్తులకు అదే రూపంలో దర్శనం ఇవ్వాలని అయ్యప్పస్వామిని అర్థించడంతో ఆయన అనుగ్రహించారు. అలా కట్టి ఉన్నదానిని పట్ట బంధం అంటారు. ఇది శివకేశవులను ఐక్య పరిచే బంధమని కూడా అంటారు. తనకు ఎలాంటి భవబంధాలు లేవని చెప్పడానికి స్వామి ఈ ఆసనంలో కూర్చుంటారని అంటారు.



చిన్ముద్ర రూపం

హరిహరసుతుడు అయ్యప్ప స్వామి వెలసిన పవిత్ర క్షేత్రం శబరిమల. తను దర్శనం కోసం వచ్చే భక్తులను స్వామివారు చిన్ముద్ర రూపంలో అభయమి స్తా రు. అయితే ఈ చిన్ముద్రలో నిగూఢమైన అర్థం ఉంది. ముద్ర అంటే అభిన యం. చిన్ అనే పదం చిత్‌ను సూచిస్తుంది. సిద్ధింపజేసేది అని అర్థం. చిన్ముద్ర లో జాగురూకత నిండుగా కనిపిస్తుంది. దీనిలో చూపుడు వేలు అహంకారాన్ని, బొటనవేలు బ్రహ్మం, మిగిలిన మూడు వేళ్లు రాజస, తామస, సత్వగుణాలను సూచిస్తాయి. చూపుడు వేలు ఎప్పుడూ ఇతరుల తప్పులను చూపించి నిందలు మోపడానికి, భయపెట్టడానికి ఉపయోగిస్తాం. అందుకే జపం చేసే వేళ ఈ వేలుని ఉపయోగించరు. ఈవేలిని అహంకారానికి చిహ్నంగా భావిస్తాం.

బొటన వేలు మిగతా నాలుగు వేళ్లకు ఆధారం. ఇదే గనుక లేకపోతే ఏ పనులు చేయలేం. మిగతా వేళ్లు కూడా శక్తిని కోల్పోతాయి. అందుకే బొటనవేలిని ఆత్మగా, ఆధారం బ్రహ్మంగా చెబుతారు. మిగతా మూడు వేళ్లు త్రిగుణాలను గ్రహించడానికి ఉపయోపడతాయి. విజ్ఞానం పొందడానికి, ఆహారం స్వీకరించడానికి, ఇతరులతో పోరాడి విజయం సాధించడానికి ఉపయోగపడతాయి. త్రిగుణాలను అధీనంలో తెచ్చుకుని, బ్రహ్మం గురించి తెలుసుకుని జీవితాన్ని సార్థకత చేసుకోవచ్చని చిన్ముద్ర వెనుక పరమార్థం. బ్రహ్మం గురించి తెలిస్తే అహంకారం మాయమవుతుంది. ఇదే జీవాత్మ పరమాత్మ సంగమం. దీని అంతిమ పరిణామం సంపూర్ణ జ్ఞాన సిద్ధి. త్రిగుణాలను అదుపులో ఉంచి, పరబ్రహ్మంతో ఐక్యం అయ్యేవాడికి జ్ఞాన ప్రాప్తి లభిస్తుంది. చిన్ముద్ర మనకు ఇదే విషయాన్ని తెలియజేస్తుంది. భగవానుని అనుగ్రహం పొందే మార్గం తెలిపే ముద్రగా దీనిని పేర్కొంటారు.

ఇక అయ్యప్పస్వామి ఎడమ చేయి పాదాలను చూపుతున్నట్లుగా ఉంటుంది. పరమాత్మలో జీవాత్మ లీనం కావాలంటే ముందు స్వామి పాదాలను శరణు కోరాలని అర్థం. అంటే స్వామిని త్రికరణ శుద్ధిగా నమ్మి పాదాల వద్ద శరణాగతి చేయడం వల్ల జీవాత్మకు పరమాత్మను చేరే సమర్థత కలుగుతుంది. పట్టబంధనం అనే సూత్రం స్వామి మోకాళ్ల కింది నుంచి వాటిని ఉంటుంది. నిశ్చలమైన ఆ భంగిమలో కూర్చుని తనను నమ్మి వచ్చే భక్తుల కోర్కెలు తీర్చి వారిలో ఆధ్యాత్మిక చింత పెంపొందేలా చేస్తానంటూ ప్రసన్నమైన ముఖంతో స్వామి అభయమిస్తారు.



మహా వాక్యం తత్వమసి

ప్రతి హిందువు జీవితంలో నమస్కారం ఓ అంతర్భాగం. నిద్ర మేల్కోగానే భూమాతకు, తల్లిదండ్రులు, సూర్య భగవానుడు, గురువులు, కుల, ఇష్ట దైవాలకు నమస్కారం చేసి బయట ప్రపంచంలోకి అడుగు పెడతారు. అలాగే పెద్దలు కనపడితే నమస్కరించి, చిరునవ్వుతోనే పలకరిస్తాం. ఇది మన హిందూధర్మానికి మాత్రమే సొంతమైన విశిష్ట ఆచారం. మన పెద్దలు ఎందుకు ఈ సాంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారో? ఎప్పుడైనా ఆలోచించారా? వారు ఏం చేయించినా అందులో నిగూఢమైన వైదిక , ఉపనిషత్, పురాణ వాఙ్మయ సారంతో ముడిపడే ఉంటుంది.

రెండు చేతులు జీవాత్మ–పరమాత్మలకు సంకేతం. ఆ రెండూ కలవడం...జీవాత్మని పరమాత్మతో ఐక్యం చేయడం. అదే మన జీవిత కాలపు లక్ష్యం. ఎదుట ఉన్న వ్యక్తులకు నమస్కారం చేసేటప్పుడు ,రెండు చేతులను ఒకదానికొకటి ఎదురెదురుగా కలుపుతాం. అంటే నీలోని ఆత్మ , నాలోని ఆత్మ ఒక్కటే అని చెప్పడం. ఎదుటి వ్యక్తికి, మనకి భేదం లేదని, మనమంతాఒక్కటే అని చెప్పకనే చెబుతాం. అంతా ఒక్కటిగా మెలగమని మన పూర్వీకులు మనకు నేర్పించిన అద్భుతమైన సంస్కారం ఈ నమస్కారం. మరి దీనికి మూలం.. సామవేద అంతర్గత చాందోగ్యోపనిషత్ సారమైన తత్వమసి అనే మహా వాక్యం.

ఈ మహా వాక్యాన్ని అర్థం చేసుకొనే శక్తి కలియుగంలో మానవులకు ఉండదని, దాని పరమార్థాన్ని నమస్కారం అనే సంకేతం ద్వారా వారికి తెలియకుండానే ఆచరింపజేశారు. అయితే ఈ వాక్యం శబరిమలలోని అయ్యప్ప ఆలయం ముందు రాసి ఉంటుంది. 41 రోజుల కఠోర దీక్షచేసి, పవిత్రమైన ఇరుముడిని శిరస్సును పెట్టుకుని, పావన పదునెట్టాంపడి ఎక్కగానే భగవంతుడి కన్నా ముందే దర్శనమిచ్చే మహావాక్యం తత్వమసి. అంటే భక్తితో స్వామికి నమస్కరించే ముందే, నమస్కారానికి మూలమైన తత్వమసి మహావాక్యం మనకు దర్శనమిస్తుంది. అంటే నమస్కరించే ముందు ఎందుకు, ఎవరికి నమస్కరిస్తున్నామో తెలుసుకొని నమస్కరించమని దీని అర్థం.

తత్వమసి అనేది సంస్కృత పదం. తత్+ త్వం +అసి అను మూడు పదాల కలయికే తత్వమసి, తత్.. అంటే అది, త్వం అంటే నీవె, అసి అంటే ఉన్నావు. అది నీవె ఉన్నావు అనేది తత్వమసి వాచకానికి అర్థం. మాలధరించి, మండల కాలం పాటు దీక్షచేసి, కొండ కోనలు దాటి పావన పదునెట్టాంబడి ఎక్కి ఏ పరబ్రహ్మ తత్వాన్ని చూడాలని వచ్చావో అది నీవె ఉన్నావు నీలోనే పరమాత్మ అంతర్యామియై ఉన్నాడు అని తెలియజేస్తుంది. అందరికీ అంతర్ముఖంగా పరమాత్మ సాక్షాత్కారం కలిగించే ప్రక్రియే నీవు. మండల కాల బ్రహ్మచర్య దీక్ష అనే ఆత్మ ప్రబోధను కలిగించి, అందరిలోనూ స్వామి అయ్యప్పను దర్శించేలా మానవాళిని తీసుకెళ్లే సత్ ప్రబోధమే తత్వమసి. అందుకే పదునెట్టాంపడి ఎదురుగా సన్నిధానం పైభాగాన అందరికీ కనిపించేలా దీన్ని లిఖించారు. అంచెలంచెలుగా, మెట్టుమెట్టుగా ఒక్కొక్క సంవత్సరం కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాల లాంటి పద్దెనిమిది అజ్ఞాన స్థితులను ఛేదించుకుంటూ వెళ్తే.. కొన్నాళ్లకు తత్వమసి పరమార్థం ప్రతి ఒక్కరికీ సాక్షాత్కరిస్తుంది.

దీక్షలో గురుస్వామి


శబరిమలలో శ్రీ అయ్యప్పస్వామి దర్శించుకునే భక్తులు మాలను ధరించి 41 రోజులపాటు కఠోర దీక్ష చేస్తారు. కఠిన దీక్షచేసి, ఇరుముడి కట్టుకుని శబరిమలకు చేరుకుంటారు. తలపై ఇరుముడితో పావన పదునెట్టాంబడి ఎక్కి, స్వామివారిని దర్శనం చేసుకుంటారు. అయితే అయ్యప్ప దీక్షలో గురుస్వాములు పాత్ర కీలకమైంది. గురుస్వాములపై గురుతర బాధ్యతలు ఉంటాయి. గురుస్వామి సమక్షంలో మాలను ధరిస్తారు. అయ్యప్పస్వామి మూల మంత్రాన్ని గురుస్వామే ఉపదేశిస్తారు. తొలిసారి మాల ధరించిన కన్నెస్వాములు దీక్షా సమయంలో ఆచరించాల్సిన నియమ, నిబంధనలు గురించి గురుస్వాములే వివరిస్తారు. దీక్ష ప్రారంభమైన రోజు నుంచి యాత్ర పూర్తయ్యే వరకూ గురుస్వామి ఇతర మాలధారులకు దీక్ష పవిత్రతను తెలపడంతో పాటు సంరక్షకుడిగా భావించవచ్చు.

18 సంవత్సరాల పాటు పవిత్ర శబరిమల యాత్రను చేసిన వారిని గురుస్వామిగా గుర్తిస్తారు. 18 పర్యాయాలు మాల ధరించి, శబరిమలకు వెళ్లిన స్వాములు దేవస్థానవనంలో కొబ్బరి మొక్కను నాటుతారు. మాలధారణ చేసిన వారందరికీ శబరి యాత్ర చేయించడానికి, కన్నెస్వాములకు మార్గదర్శనం చేస్తూ గురుస్థానంలో ముందు ఉండాలి. ఇరుముడి, అభిషేకాలతోపాటు అయ్యప్ప దర్శనం చేయించడంలోనూ గురుస్వామి ఇతర స్వాములకు గురువులా ఉంటారు. యాత్ర తిరుగు ప్రయాణంలోనూ అవకాశాన్ని బట్టి తన శిష్యుల కోరిక మేరకు తీర్థయాత్రలు చేయించాలి. అంతేకాదు పీఠానికి వచ్చి గురుస్వామి సమక్షంలో మాల విసర్జన చేయడంప సూచనలు చేస్తారు. ఇవన్నీ గురుస్వామి సమక్షంలోనే జరగాలి.

మొదటిసారి మాల వేసేవారిని కన్నెస్వాములని అంటారు. వీరికి దీక్ష సమయంలో ప్రతీ అంశాన్ని గురుస్వామి క్షుణ్ణంగా బోధిస్తాడు. ఇరుముడి నుంచి యాత్రపూర్తయి మాల విసర్జన చేసేంత వరకు గురుస్వామి సూచనలను మిగిలిన స్వాములు పాటిస్తారు. అరణ్య ప్రాంతంలో కొండలపై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి క్షేత్రాన్ని 18 సార్లు దర్శించుకున్న స్వాములపై హరిహరసుతుడి కటాక్షం లభిస్తుంది.

ఒక్కసారైనా వనయాత్ర చేయాలట!

శబరిమల అయ్యప్పస్వామి ఆలయం ఏడాదిలో కొన్ని రోజులు మాత్రమే తెరచి ఉంటుంది. మండల పూజకు తెరుచుకున్న ఆలయం మకర జ్యోతి వరకు ఉంటుంది. ఈ సమయంలో లక్షలాదిగా భక్తులు స్వామి దర్శనం కోసం తరలివస్తారు. మాలను ధరించి, 41 రోజుల పాటు దీక్ష చేసి ఇరుముడి ధరించి పావన పదునెట్టాంబడి ఎక్కి స్వామి దర్శనం చేసుకుంటాయి. అయితే శబరియాత్ర ఎరుమేలి నుంచే మొదలవుతుంది. ఎరుమేలిలో వావరు స్వామి దర్శనం తర్వాత పేటతూళ్లు ఆడతారు. ఆ తర్వాత ధనుర్బాణధారియై ఉన్న ధర్మశాస్త ఆలయాన్ని సందర్శించి ఇక్కడ కొలువున్న కన్నెమూల గణపతికి కొబ్బరికాయ కొడతారు.ఇక్కడి నుంచే భక్తుల పాదయాత్ర మొదలవుతుంది. పాదయాత్రకు రెండు మార్గాలున్నాయి. పెద్ద పాదం అనేది దట్టమైన అరణ్యంలో కొండల మధ్య సాగే కాలిబాట. ఇది పెరియార్ అభయారణ్యం గుండా ఎనభై కిలోమీటర్ల సాగుతుంది. అయ్యప్ప భక్తులు తమ జీవితంలో ఒక్కసారైనా వనయాత్ర చేయాలని అంటారు. అయితే వనయాత్రకు కేవలం జనవరిలో మకర జ్యోతి ముందు మాత్రమే అనుమతిస్తారు. జనవరి 2 నుంచి మకర విలక్కు పూర్తయినంత వరకు ఈ మార్గం తెరచి ఉంటుంది.ఈ దారిలో పెరూర్తోడు, కాలైకట్టి అనే ప్రదేశాలు ఉన్నాయి. మహిషితో అయ్యప్పస్వామి యుద్ధం చేస్తుండగా కాలైకట్టి దగ్గర శివకేశవులు నిలబడి తిలకించారట. ఇక్కడికి కొద్ది దూరంలోనే అళుదా నది ఉంది. మహిషి కార్చిన కన్నీరే అళుదా నదిగా రూపాంతరం చెందినట్లు చెబుతారు.ఈ నదిలో స్నానం చేసిన తర్వాత భక్తులు అందులోని నుంచి ఒక రాయిని తీసుకు వెళతారు. అళుదామేడును ఎక్కి, తమతో తెచ్చిన ఈ రాయిని కళిడం కుంద్రులో (మహిషి కళేబరాన్ని పూడ్చిన చోటు) వేస్తారు. తరువాత యాత్ర ముందుకు సాగి కరిమల శిఖరానికి చేరుకుంటుంది. వనయాత్రలో కరిమల శిఖరం ఎక్కడమే చాలా కష్టమని భావిస్తారు. కరిమల శిఖరం ఎక్కడానికి స్వామి సాయం చేస్తాడని నమ్మకం. ఆ తర్వాత పెరియానవట్టమ్, చెరియానవట్టమ్ గుండా పంబ నది చేరుకుంటారు. అక్కడే పంబ అనే గ్రామం కూడా ఉంది. ఇక్కడి నుంచి స్వామి సన్నిధానానికి ఏడు కిలోమీటర్ల దూరం. ఎరుమేలి నుంచి బస్సుల ద్వారా చిన్నపాదం మార్గంలో పంబానదికి చేరుకోవచ్చు. చివరి ఏడు కిలోమీటర్లు మాత్రం కాళినడకన వెళ్లాలి. ఇదే చిన్నపాదం. ఈ వనయాత్రలోనే కొందరు భక్తులు శక్తిపూజ చేసి అన్నదానం చేస్తారు. పంపానదిలో స్నానం చేసి పంబాగణపతికి ఇరుముడిని చూపిస్తారు. అక్కడ నుంచి నీలిమల, శరంగుత్తి మీదుగా శబరి పీఠానికి చేరుకోవాలి.



శరంగుత్తిలో బాణాలు

శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం వెళ్లే భక్తులు మాలను ధరించి, 41 రోజుల పాటు దీక్షచేస్తారు. కఠిన నియమాలతో దీక్షచేసి ఇరుముడి ధరించి శబరిమల చేరుకుంటారు. అయితే అయ్యప్ప దీక్షలో కన్నెస్వాములకు ప్రత్యేక స్థానం ఉంది. తొలిసారి దీక్ష తీసుకున్న వారిని కన్నెస్వాములని అంటారు. పందళరాజు కుమారుడిగా పెరిగిన మణికంఠుడు తల్లి శిరోవేధనకు పులిపాలు తీసుకురావడానికి అడవికి వెళ్లారు. నారద మహర్షి వల్ల తాను మహిషి సంహారం కోసం భూమిపై అవతరించినట్లు స్వామి తెలుసుకున్నారు. మహిషి సంహరించిన స్వామివారు అలాగే అడవి దొంగ వావర్ను తన భక్తుడిగా చేసుకున్నారు.

అంతేకాదు ముమ్ముందు కాలంలో నా దర్శనం కోసం అడవి మార్గంలో నడచి వచ్చి, సన్నిధానానికి చేరుకునే భక్తులకు ఎలాంటి ఆపద కలగకుండా తోడుగా నిలవాల్సిన బాధ్యత మీదే వావర్, కరుప్పస్వామికి అయ్యప్ప ఆదేశించారు. అందుకే ఎరుమేలిలో పేటతుల్లి ఆడిన తర్వాత కన్నిస్వాములకు బాణాలు వాటిని భద్రపరమని గురుస్వామి చెబుతారు. వనయాత్రలో వావర్ స్వామి, కరుప్పస్వామి, కడుత్తు స్వామి, కరిమల భగవతి దేవతలు ఆ శరంలో ఆవాహనమై భక్తునికి అండగా నిలిచి వన్యమృగాలు తిరిగే ఘోర అడవిని దాటిస్తారని నమ్మకం. పంబ నుంచి సన్నిధానానికి వెళ్లే మార్గంలో శబరిపీఠం దాటిన తర్వాత వచ్చే శరంగుత్తిలో ఎరుమేలి నుంచి తమ వెంట తెచ్చిన శరములను కన్నిస్వాములు గుచ్చుతారు. అంతవరకూ తోడుగా వచ్చిన వన దేవతలు శరంగుత్తిలో ఆగిపోతారని ప్రగాఢ నమ్మకం.

మొదటి ఏడు బాణం తీసుకెళితే ఆ తరవాత కత్తి, గంట, గద, తేరు ఇలా ఏడాదికో వస్తువుని దీక్ష తీసుకున్న వారు తమ వెంట తీసుకెళ్లి శరంగుత్తిలో వదిలిపెడతారు. అలా ఈ పద్దెనిమిదింటి స్వామివారి ఆయుధాలని అంటారు. మరో కథ కూడా ప్రచారంలో ఉంది. మహిషి సంహారం కోసం అడవికి వచ్చిన మణికంఠుడు.. అది పూర్తయ్యాక ఆయుధాలను శరంగుత్తిలో విడిచి పెట్టారని అంటారు. అంతేకాదు కన్నిస్వాములు తన దర్శనానికి రాని ఏడాది నిన్ను వివాహం చేసుకుంటానిని మాలికాపురత్తమ్మకు అయ్యప్ప వాగ్దానం చేశారు. తమ యాత్రను ధ్రువీకరించడానికే కన్నిస్వాములు శరములను శరంగుత్తిలో గుచ్చుతారు.

అయ్యప్పను నెయ్యాభిషేక ప్రియుడు

అయ్యప్ప మాలను ధరించి దీక్ష చేసే భక్తులు నిత్యం స్వామినామ స్మరణతోనే జీవిస్తారు. శరణఘోషలు, భజనలతో స్వామిని పూజిస్తూ 41 రోజుల పాటు కఠిన దీక్ష చేస్తారు. అయితే స్వామిని నెయ్యాభిషేక ప్రియుడని, కర్పూర ప్రియుడని అంటారు. శబరిమలలో నెయ్యాభిషేకానికి విశేష ప్రాధాన్యత ఉంది. ఇరుముడితో పదునెట్టాంబడి ఎక్కి స్వామి దర్శనం చేసుకున్న భక్తులు తర్వాత జరిగే నెయ్యాభిషేకంలో పాల్గొంటారు. అందుకే దీక్షచేసిన భక్తులు శబరిగిరీశుడి దర్శనానికి వెళ్లే ముందు ఇరుముడి ధరిస్తారు. ఈ ఇరుముడిలో ప్రధానమైంది నెయ్యితో నింపిన టెంకాయ. టెంకాయలోని నీటిని తీసి, ఆవు నేతిని నింపుతారు. నెయ్తేంగా తేంగా అంటే టెంకాయ అని అర్థం. దీక్షచేసిన భక్తులు ఎంతో పవిత్రంగా టెంకాయను ఇరుముడిలో కట్టి శబరిమలకు చేరుకుంటారు.టెంకాయలో నెయ్యి నింపడం వెనుక విశేషమే ఉంది. శ్రీమహావిష్ణువు అనంతుని పాన్పుగా చేసుకుని క్షీరసాగరంలో పవళించివుంటాడు. ప్రతి జీవిలోనూ భగవంతుని ప్రతిరూపం ఉంటుంది. పాలను చిలికితే వెన్న వస్తుంది. వెన్నను కాచి నెయ్యి తయారుచేస్తారు. అంటే నెయ్యిని జీవాత్మగా భావిస్తారు. అలాంటి నెయ్యితో భగవంతుడికి అభిషేకం చేయడం ఎంతో విశిష్టం. అయ్యప్ప పరమాత్మ. ఇరుముడిలో భక్తులు తీసుకొచ్చిన నెయ్యితో అయ్యప్పకు అభిభిషేకం చేయడమంటే పరమాత్మలో జీవాత్మ ఐక్యం చెందడం. ఇందులోనూ ఎంతో పరమార్థం దాగివుంది. నెయ్యి విష్ణువుకు ప్రతిరూపమైతే పరమేశ్వరుడు అభిషేకప్రియుడు. ఇలా నెయ్యాభిషేకంతో హరిహరసుతునికి పూజలు నిర్వహించడం విశేషం.నెయ్యి ఉంటేనే టెంకాయకు విశిష్టత. నెయ్యి తీసిన అనంతరం అది సాధారణ టెంకాయ మాత్రమే. అలాగే మనిషిలోని జీవుడు బయటకు వెళ్లిపోతే కట్టె మాత్రమే మిగులుతుందనే సత్యాన్ని ఇది తెలుపుతుంది. జీవుడు ఈ జీవన సత్యాన్ని తెలుసుకొని ఇతర మనుషులు, జీవులపై ప్రేమతో మెలగాలన్న అంతర్లీనమైన భగవత్ సందేశం. నెయ్యాభిషేకం అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఉన్న ప్రజ్వలిస్తున్న అగ్నిలో టెంకాయలను సమర్పించడంలో అర్థం పరమార్థం ఇదే. మండలం, మకరవిలక్కు సందర్భంగా ఈ క్రతువును రోజూ నిర్వహిస్తారు. తెల్లవారుఝామున 4.15 గంటలకు ప్రారంభమయ్యే అగ్నిహోమం రాత్ర 11.30 గంటల వరకు నిరాటకంగా కొనసాగుతుంది. ఈ అగ్నిధారలతో శబరగిరులు మరింత ఆధ్యాత్మికతను సంతరించుకుంటారు.

ఇలా చేస్తే సులువుగా అయ్యప్ప దర్శనం!

శబరిమలలోని అయ్యప్ప దర్శించుకునే భక్తులు మాలను ధరించి, మండల కాలం పాటు కఠిన దీక్ష చేస్తారు. దీక్ష పూర్తయిన తర్వాత ఇరుమడితో శబరిమల చేరుకుని, పావన పదునెట్టాంబడి మీదుగా హరిహరసుతుని దర్శించుకుంటారు. నవంబరు నుంచి జనవరి 20 వరకు ఆలయం తెరుచుకుని ఉంటుంది. శబరిమలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు నడువుతోంది. ఇటీవల కాలంలో శబరిమలకు వెళ్లే భక్తులు సంఖ్య విపరీతంగా పెరిగింది. రద్దీ ఎక్కువ కావడంతో స్వామి ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో కేరళ ప్రభుత్వం అంతర్జాలం ద్వారా దర్శన టిక్కెట్లను అందుబాటులోకి తెచ్చింది.ముందుగా పేరు నమోదు చేసుకోవడం ద్వారా వారు కోరుకున్న సమయానికే వెళ్లి స్వామిని దర్శనం చేసుకోవచ్చు. మొబైల్ ద్వారా కూడా ఈ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్లో కేరళ పోలీస్ పోర్టల్ను ఓపెన్ చేయాలి. అందులో శబరిమల విర్చువల్ క్యూ పోర్టల్ బై కేరళ పోలీస్అనే లింక్ ఉంటుంది. దీనిపై క్లిక్ చేసి ఏ తేదీల్లో దర్శనానికి వెళుతున్నారో ఎంపిక చేసుకోవాలి. అనంతరం దానికి ఎదురుగా ఉన్న బటన్ క్లిక్ చేస్తే ఒక టేబుల్ డిస్‌ప్లే అవుతుంది. అందులో తేదీ, దర్శనం సమయం ఎంపిక చేసుకుని, కనిపిస్తున్న బుక్ నౌ బటన్ క్లిక్ చేయాలి.తర్వాత మరో పేజీ కనబడుతుంది. అక్కడ మెంబర్ లాగిన్, నాట్ ఎ మెంబర్ లాగిన్ అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. తొలిసారి బుక్ చేసుకునే భక్తులు తమ ఈ–మెయిల్ ఐడీ, పాస్వర్డ్తో లాగిన్ అయి, మెంబర్ షిప్ ఫారాన్ని పూర్తిచేయాలి. ఇందులోని ప్రొఫైల్ పేజ్లో పూర్తి వివరాలను పొందుపరచాలి. వివరాలు పూరించిన తర్వాత పాస్పోర్ట్ ఫోటోను అప్లోడ్ చేయాలి. అనంతరం అన్ని వివరాలు మరొకసారి సరిచూసుకుని కిందనున్న సేవ్ డివోటీ డిటైల్స్‌పై క్లిక్ చేస్తే దర్శనం టిక్కెట్ కన్ఫర్మ్ అవుతుంది. దీనిని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతోపాటు గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది.

cinema@suryaa.com

సూర్య
హైదరాబాద్
శనివారం
6 జనవరి 2018

సూర్య సినిమా

ప్రనుష్క పరిణయం?

అనుష్కతో అలాంటిదేమీ లేదని ప్రభాస్ పత్రికాముఖంగా ప్రకటించాడు. అయినాసరే వారిద్దరి పెళ్లి గురించి వుకార్లు, సదరు వుకార్లకు సంబంధించిన కథనాలు వుంఖానువుంఖాలుగా వెలువడుతూనే ఉన్నాయి. అంతేకాదు.. కొందరు నెటిజెన్ల మరికొంచెం ముందుకెళ్లి, విరాట్ కోహ్లీ-అనుష్క జంటకు 'విరుష్క' అని నామకరణం చేసినట్లుగా.. ప్రభాస్-అనుష్క జంటకు 'ప్రనుష్క' అనే పేరు ప్రతిపాదించేశారు. ఇప్పుడు 'ప్రనుష్క' సోషల్ మీడియాలో విపరీతంగా పాపులర్ అయిపోయింది.

ప్రభాస్‌తో కలిసి అనుష్క తొలిసారి 'బిల్లా' చిత్రంలో నటించింది. ప్రభాస్ కోసం ఈ చిత్రంలో ఈ అమ్మడు బికినీ కూడా ధరించింది. ఆ తర్వాత 'రెబల్' చిత్రంలోనూ అనుష్క నటించాల్సి ఉన్నప్పటికీ డేట్స్ కుదరకపోవడం వల్ల కుదరలేదు. అయితే.. 'మిర్చి'లో నటించాక వీరిద్దరి బంధం 53 గ్రేడ్ సిమెంట్‌లా బ్రహ్మాండంగా గట్టిపడిపోయింది. 'బాహుబలి-ది బిగినింగ్, బాహుబలి-ది కంక్లూజన్' చిత్రాల్లో నటించడం వల్ల నాలుగయిదేళ్ళపాటు వీరిద్దరి బంధం కొనసాగింది. ఇప్పుడు అనుష్క నటిస్తున్న 'భాగమతి' కూడా ప్రభాస్‌కి సొంత సంస్థ లాంటి యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుండడం గమనార్హం. 'భాగమతి' షూటింగ్ పూర్తయి చాలా నెలలు కావస్తున్నా అనుష్క కొత్త సినిమాలు ఒప్పుకోవకపోవడం కూడా 'ప్రనుష్క' పెళ్లి వుకార్లు మరింత ఊతం ఇస్తోంది. అంతేకాదు.. 'సాహో' చిత్రంలోనూ అనుష్క నటిస్తోందని, అయితే ప్రస్తుతానికి శ్రద్ధాకపూర్ పేరు మాత్రమే తెరమీదకు తెచ్చారనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. 'విరుష్క వివాహం' లానే 'ప్రనుష్క పరిణయం' కూడా గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతుందేమో చూడాలి!



రంగంలోకి దిగుతున్న రానా





హలో చిత్రం ప్రచారం కోసం ఇచ్చిన ఇంటర్వ్యూలోనే చెప్పాడు అఖిల్. మూడో చిత్రం అనౌన్స్ చేయడానికి ఎక్కువ రోజులు వెయిట్ చేయనని. జనవరి 10 లోపు తన తదుపరి చిత్రం ప్రకటిస్తానని చెప్పిన అఖిల్ తన మాట నిలబెట్టుకుంటున్నాడు. "మలుపు" సినిమా తీసిన దర్శకుడు సత్య పినిశెట్టి కథ విని నచ్చిందని చెప్పాడట అఖిల్. సత్య పినిశెట్టి ఎవరో కాదు ఒకప్పటి ఫేమస్ డైరక్టర్ రవిరాజా పినిశెట్టి రెండో కుమారుడు. హీరో ఆది ఆయన బ్రదర్. ఇక్కడ మరో పెద్ద విషయం ఏమిటంటే ఈ చిత్రాన్ని ప్రముఖ హీరో రానా నిర్మించనుండడం!


మా సినిమా హీరో.. నా పాలిట విలన్



ఎస్‌బికె ఫిలిమ్స్ కార్పొరేషన్ పతాకంపై ఎస్ కె అబ్దుల్లా సమర్పించిన చిత్రం ప్రాజెక్ట్ జెడ్. సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి హీరో హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. చిత్ర సమర్పకుడు ఎస్ కె బషీద్ మాట్లాడుతూ... 'ప్రాజెక్ట్ జెడ్ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు... మంచి చిత్రం అని అభినందిస్తున్నారు. అందుకు ఆడియన్స్‌కు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. ప్రతి సినిమాలో ఒక విలన్ ఉంటాడు. కానీ నా జీవితంలో హీరో సందీప్ కిషన్ విలన్‌గా మారి సినిమాను చంపేస్తున్నాడు. ఈ సినిమా తలపెట్టినప్పటి నుంచి నాకు పలు రకాలుగా అడ్డుపడుతున్నాడు. సందీప్ కిషన్ చేసిన సినిమాలు వరుసగా 19 పరాజయాలయ్యాయి. అందుచే నేను సెంటిమెంటల్‌గా పోయి తన వాయిస్‌ను కాదని డబ్బింగ్ వేరేవారి చేత చెప్పించాను. దాంతో సందీప్ కిషన్ ఈ సినిమాలో నా వాయిస్ కాదు, సినిమా ప్రమోషన్స్‌లో నేను పాల్గొనని, సినిమా విడుదలను అడ్డుకుంటామని చాలాసార్లు ప్రయతించాడు. అందుకు నేను లీగల్‌గా ప్రొసీడ్ అయ్యి కష్టపడి సొంతంగా విడుదల చేసుకున్నా. కానీ సందీప్‌కిషన్ నాపై పగ పట్టినట్టుగా వ్యవహరిస్తున్నాడు' అన్నారు.



రెగ్యులర్ షూటింగ్‌లో..



రవితేజ హీరోగా కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాళవికశర్మ హీరోయిన్‌గా ఎంపికైంది. ముకేశ్ కెమెరామన్‌గా వర్క్ చేస్తున్నారు.

శశిరేఖ సిద్ధమవుతోంది



మహానటిలో సమంత పోషిస్తున్న పాత్ర సావిత్రిదో కాదో ఇంకా సరిగ్గా తెలియదు కానీ.. 'అభిమన్యుడు'లో హీరోయిన్‌గా నటిస్తున్న సమంతను మాత్రం శశిరేఖగా కచ్చితంగా అభివర్ణించవచ్చు. ఎందుకంటే విశాల్ టైటిల్ రోల్ ప్లే చేస్తున్న ఈ చిత్రంలో సమంత హీరోయిన్ కాబట్టి. పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం జనవరి 26న విడుదల కానుంది. అదే రోజు అనుష్క టైటిల్ పాత్ర పోషిస్తున్న 'భాగమతి' కూడా అదే తారీఖున వస్తుండడం గమనార్హం.

అమీర్‌పేట నుంచి అమెరికా

రాధా మీడియా బ్యానర్‌పై శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పించు ఎ టు ఎ, 'అమీర్ పేట్ టు అమెరికా' ఫస్ట్ పోస్టర్ నగర ప్రథమ పౌరుడు హైదరాబాద్ మేయర్ బొంతు రామ్‌మోహన్, డిప్యూటి మేయర్ బాబా ఫసివుద్దీన్ కలిసి రిలీజ్ చేసారు. ఈచిత్రానికి కర్త, కర్మ, క్రియగా వున్న రామ్ మోహన్ కొమండూరి 'ఏ టు ఏ' చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ని వినూత్నంగా డిజైన్ చేసారు. 'తెలంగాణకి రారాజు సి.ఎం. కెసిఆర్ ఐతే అమెరికాకి రారాజు ట్రంప్ అంటూ తెలంగాణ నుండి అమెరికాకి ఎగురుతున్న విమానంతో కాన్సెప్ట్‌ని సూటిగా చెప్తున్న కొత్త తరహా పోస్టర్ అని పలువురు ప్రశంసించారు. 'అమీర్ పేట్ టు అమెరికా' పాటను ఫ్లాష్ మాబ్ ద్వారా వినూత్నంగా విడుదల చేసారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా-అరుణ్, జివిల్ బాబు. ఎడిటర్-ప్రవీణ్ పూడి, సంగీతం- కార్తీక్ కొడకండ్ల, దర్శకుడు- చల్లా భానుకిరణ్.



ఆమెలా రాణించాలనుకుంటున్నా.. రషీక



తెలుగు తెరకు మరో కన్నడ సోయగం రాబోతోంది. పేరు రషీకా దత్. ఈ బ్యూటీ మిస్ రాజస్థాన్ కాంపిటీషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. ప్రస్తుతం తెలుగులో 'నీవేనా నను పిలిచినది' అనే రొమాంటిక్ హారర్ సినిమాలో మెయిన్ లీడ్ చేస్తోంది. ఫ్యాషన్ డిజైనింగ్‌లోనూ డిప్లమా చేసిన రషీక శనివారం తన బర్త్ డే సందర్భంగా తన కెరీర్‌ను తెలుగులోనే మలచుకోవాలనుకుంటున్నానని చెప్పింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే.. 'నేను పుట్టింది పెరిగింది, చదివింది బెంగళూరులో. రాజస్తాన్‌లో గ్రాడ్యుయేషన్ చేసినప్పుడు మిస్ రాజస్తాన్ పోటీలో పాల్గొని రన్నరప్‌గా నిలిచాను. ఆ తర్వాత ముంబైలో రంగ్ రసియా థియేటర్ ఆర్ట్స్‌లో యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నా. తర్వాత యాడ్స్‌లో నటించి గుర్తింపు తెచ్చుకున్నా. 'ట్విస్ట్ వాలా లవ్' అనే సీరియల్‌లో మెయిన్ లీడ్‌రోల్ చేశా. తెలుగు ఫిల్మ్ మేకర్స్ నన్ను అప్రోచ్ అయ్యారు. కథ నచ్చడంతో పాటు ఎప్పటి నుంచో తెలుగులో నటించాలన్న నా కోరిక కూడా నెరవేరుతుందని ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పాను. అయితే ఇకపై పెద్ద సినిమాల్లోనే నటించాలనుకుంటున్నాను. నాకు హైదరాబాద్ చిన్నప్పటి నుంచీ తెలుసు. ఇక్కడ నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. నాకు అనుష్క అంటే చాలా ఇష్టం. ఆమెలా మంచి నటి అన్న ఇమేజ్ తెచ్చుకోవాలనుకుంటున్నాను. కథ డిమాండ్ చేస్తే గ్లామరస్ పాత్రలకూ ఓకే. నేను తెలుగు పరిశ్రమలోనే సెటిల్ కావాలనుకుంటున్నాను. ప్రస్తుతం నా దృష్టంతా ఇక్కడే ఉంది. అందుకే ఓ ట్యూటర్ సాయంతో తెలుగు నేర్చుకుంటున్నాను'.

10 కోట్ల కోసం రేయింబవళ్లు..

'రాత్ ఔర్ దిన్' రీమేక్ కోసం ఐశ్వర్యరాయ్‌కి పది కోట్ల పారితోషికం



నిరుపమానమైన నటిగా నీరాజనాలందుకున్న నర్గిస్‌కు విపరీతమైన పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన చిత్రాల్లో 'రాత్ ఔర్ దిన్' ఒకటి. సత్యేన్ జోష్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నర్గిస్ పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. పగలంతా ఫక్తు సాధారణ గృహిణిలా మెలుగుతూ ఉండే ఈమె పాత్ర - రాత్రయ్యేసరికి వింతవింతగా.. విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ ఉంటుంది. పరస్పర విరుద్ధమైన స్వభావాలు కలిగి, ద్విపాత్రలను పోలిన తన క్యారక్టర్‌ని నర్గిస్ 'న భూతో' అన్న రీతిలో నటించి మెప్పించింది. ఈ చిత్రం కోసం నర్గిస్ జాతీయ ఉత్తమ నటి అవార్డు కూడా సొంతం చేసుకుంది. 1967లో విడుదలై 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అదే పేరుతో తాజాగా ఐశ్వర్యారాయ్‌తో రీమేక్ చేస్తున్నారు. ఈ చిత్రంలో నటించేందుకు ఐసు అక్షరాలా పదికోట్లు తీసుకుంటోందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ పాత్ర పోషణను ఐసు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, మల్టిపుల్ పెర్సనాలిటీ డిజార్డర్ కలిగి, రెండు పార్శ్వాలు కలిగిన ఈ పాత్రను రక్తి కట్టించేందుకు ఐశ్వర్య ఇప్పటికే హోమ్ వర్క్ స్టార్ట్ చేసిందని తెలుస్తోంది!


సూర్య
హైదరాబాద్
శనివారం 6
జనవరి 2018
11



తరగతి గదిలోనే విద్యార్థిని మెడలో తాళి కట్టిన విద్యార్థి

చెన్నై : తరగతి గదిలోనే ఓ విద్యార్థి మరో విద్యార్థిని మెడలో తాళి కట్టడం సంచలనంగా మారింది. ఇప్పుడీ వీడియో వైరల్ అయింది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వీడియోలో ఉన్న సంభాషణను బట్టి ఈ ఘటన తమిళనాడులో జరిగినట్టు తెలుస్తోంది. బాలిక మెడలో బాలుడు తాళి కడుతున్నప్పుడు తోటి విద్యార్థులు సహా బాలుడి తల్లి కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ వీడియోను ఆమే చిత్రీకరించినట్టు అనుమానిస్తున్నారు. బహుశా ఆమె టీచరై ఉండవచ్చని అంటున్నారు. వీడియో వైరల్ కావడంతో స్పందించిన బాలల హక్కుల సంరక్షణ సంస్థల ప్రతినిధులు, పోలీసులు ఈ బాల జంట కోసం గాలిస్తున్నారు. ఈ వీడియో మొత్తం 29 సెకన్లు ఉంది. చేతిలో తాళి పట్టుకుని నిల్చున్న బాలుడు 'అమ్మా!' అంటూ ఆమె ఆదేశం కోసం చూడడం స్పష్టంగా కనిపించింది. ఆ వెంటనే 'తాళి కట్టరా' అని మహిళ తమిళంలో చెప్పడం వినిపించింది. తల్లి ఆదేశంతో యూనిఫామ్‌లో ఉన్న బాలిక మెడలో బాలుడు తాళి కట్టాడు. ఆ సమయంలో తరగతి గదిలో మరి కొంత మంది విద్యార్థులు ఉన్నట్టు వీడియోలో కనిపిస్తోంది. అంటే క్లాసు జరుగుతుండగానే ఈ తంతు జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ ఘటన ఎక్కడ జరిగింది మాత్రం తెలియరాలేదు.

రజనీకాంత్‌కు నకిలీల బెడద



- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బోగస్ వెబ్‌సైట్లు
- అభిమానుల ఆందోళన
- అయోమయానికి గురి చేస్తున్న బోగస్ వెబ్‌సైట్లు
- సభ్యత్వ స్వీకరణకు ప్రజలను నేరుగా కలవడమే మంచిదంటున్న అభిమానులు
- కొత్తగా వాట్సాప్ గ్రూప్ ప్రారంభం
- రజనీ రాజకీయ రంగ ప్రవేశంపై స్పందించిన అక్షయ్
- రాజకీయాల్లోనూ రాణిస్తారు
- రాజకీయ నేతగా ఆయన ఎదుగుతారు

చెన్నై : రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించిన తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌కు ఆదిలోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాజకీయ అరంగేట్రాన్ని ప్రకటించిన తరువాత ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించి సభ్యులుగా చేరాలని ప్రజలకు రజనీకాంత్ పిలుపు ఇచ్చారు. అయితే సభ్యులుగా చేరేందుకు ఆసక్తితో వెళ్లే వారికి బోగస్ వెబ్‌సైట్లు దర్శనమిస్తున్నాయి. దీనితో ఏది అసలైనదో, ఏది బోగసో తెలియక అభిమానులు అయోమయంలో పడిపోతున్నారు. తాను ప్రారంభించబోయే పార్టీలో చేరాలనుకున్న వారు, తనతో కలసి నడవాలనుకున్నవారు సభ్యులుగా చేరాల్సిందిగా కోరుతూ ఒక వెబ్‌సైట్‌ను రజనీకాంత్ ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా 50 లక్షల మంది సభ్యులుగా చేరారు. మరింత మంది చేరేందుకు సిద్ధమవుతుండగా బోగస్ వెబ్‌సైట్లు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం రజనీకాంత్ పేరుతో మూడు బోగస్ వెబ్‌సైట్లు ఇంటర్నెట్‌లో దర్శనమిస్తున్నాయి. తలైవర్ మన్ద్రమ్, రజనీ మంన్ద్రమ్, కేస్ తమిళనాడు పేరుతో ఇవి కనిపిస్తుండడంతో ఏది అసలో, ఏది నకిలీయో తెలియడం లేదని తలైవా అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోగస్ వెబ్‌సైట్ల కారణంగా అభిమానులు తప్పుదోవ పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. వెబ్‌సైట్ ద్వారా కాకుండా అభిమానులను, ప్రజలను నేరుగా కలుసుకుని దరఖాస్తు పత్రాల ద్వారా సభ్యత్వం చేయడం మంచిదని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజనీకి మొత్తం 50 వేలకు పైగా అభిమాన సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా సభ్యత్వ నమోదు చేయడమే మంచిదని సూచిస్తున్నారు. కాగా, రజనీకాంత్ పేరుతో అభిమాన సంఘాలు గురువారం కొత్తగా వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించాయి.

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోనూ రాణిస్తారని, ఆయనకు అంతా మంచే జరుగుతుందని బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ అన్నారు. రజనీ రాజకీయ రంగ ప్రవేశంపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, మంచి రాజకీయ నేతగా ఆయన ఎదుగుతారని, ఆయన రాణిస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. కాగా, రజనీ రాజకీయ పార్టీ పెడతానని ప్రకటించినప్పటి నుంచి ఆయనకు పలువురు నటులు అభినందనలు తెలిపారు. లైకా ప్రొడక్షన్స్ క్రియేటివ్ హెడ్ రాజ్ మహాలింగం, ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు లారెన్స్ రాఘవ.. రజనీ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. అలాగే, ప్రముఖ నటుడు విశాల్ కూడా రజనీకి మద్దతు తెలిపాడు.

అమెరికాతో గొడవలోకి భారత్‌ను లాగిన పాక్



ఇస్లామాబాద్: అమెరికా, పాకిస్తాన్ గొడవ మధ్యలోకి పాక్ భారత్‌ను కూడా లాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఖ్వాజా అసిఫ్ పాక్, అమెరికా మాటల యుద్ధంలోకి భారత్‌ను లాగారు. ట్రంప్ ఉగ్రవాదుల విషయంలో భారత్ భాషలో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పాక్, అమెరికా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఖ్వాజా దేశ భద్రతపై పార్లమెంటరీ కమిటీతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్తాన్‌లో అమెరికా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ట్రంప్ తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ట్రంప్ కూడా భారత్ భాషలో మాట్లాడుతున్నారని, వారి వ్యాఖ్యల్లో నిజం లేదని పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య ఉన్న సంబంధాల వల్ల అమెరికా ఆ దేశ్ భాష మాట్లాడుతోందని ఆరోపించారు. పాక్ ఉగ్రవాదులపై సరైన చర్యలు తీసుకోకుండా, తమను గత కొన్నేళ్లుగా మోసం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాక్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వెనువెంటనే పాక్‌కు 255 మిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని, తాజాగా 900 మిలియన్ డాలర్ల భద్రతా సహకారాన్ని నిలిపేశారు.

పాక్‌కు మరో షాకిచ్చిన అమెరికా



వాషింగ్టన్ : పాకిస్తాన్‌కు అమెరికా మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే పాక్‌కు సైనిక సాయాన్ని నిలిపేసిన అమెరికా తాజాగా భద్రతా సహకారాన్ని కూడా నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉంటోందని, ఉగ్రవాద నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవడం లేదని అమెరికా పాక్‌పై గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ కారణంతోనే పాక్‌కు 1.15 బిలియన్ డాలర్ల సహకారాన్ని నిలిపేస్తున్నట్లు అమెరికా వెల్లడించింది. గత 15 ఏళ్లుగా పాక్‌కు ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తుంటే వాళ్లు తమను మోసం చేస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే ఆ దేశానికి 255 మిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని నిలిపేసిన సంగతి తెలిసిందే. తాజాగా అక్కడి రక్షణ విభాగం 900 మిలియన్ డాలర్ల భద్రత సహకారాన్ని కూడా నిలిపేసింది. రెండూ కలిపి మొత్తం 1.15 బిలియన్ డాలర్ల సహాయాన్ని అమెరికా ఆపేసినట్లు అయింది. పాకిస్తాన్ ప్రభుత్వం ఆఫ్గాన్ తాలిబన్లు, హక్కాని నెట్‌వర్క్ తదితర ఉగ్ర సంస్థలపై తగిన చర్యలు తీసుకునేంత వరకు పాక్‌కు ఆర్థిక, భద్రత సహకారాలు నిలిపేస్తామని అమెరికా విదేశాంగ్ శాఖ అధికార ప్రతినిధి హీతర్ వెల్లడించారు. పాక్ అండగా ఉంటున్న ఉగ్రవాదులు అమెరికా దళాలపై దాడులు చేస్తున్నారని అన్నారు. పాక్‌కు ఇక మీదట మిలిటరీ పరికరాలు సహా భద్రతపరమైన ఎలాంటి సహకారమూ అందబోదని స్పష్టం చేశారు.

'మీ ప్రోగ్రెస్ చెప్పండి?'

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అప్పుడే 2019 లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో నియోజకవర్గాల్లో సాధించిన ప్రగతిని వివరించాలని ప్రధాని మోడీ పార్టీ పార్లమెంట్ సభ్యులకు సూచించారు. ప్రజలకు అందించిన మౌలిక సదుపాయాల కల్పన, కీలకమైన విజయాలు, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి చేసిన కృషిపై ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆయన ఎంపీలకు తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులపై ప్రజలనుంచి అభిప్రాయాలను సేకరించాలని సహచర మంత్రులకు మోడీ సూచించారు. ఇది ఇలా ఉండగా, ఇప్పటికే 250 మంది బీజేపీ ఎంపీలు నమో యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకున్నట్లు తెలిసింది.

మెట్రో పిల్లర్ కూలిపోయిందని వదంతులు

- టీవీల్లో బ్రేకింగ్ న్యూస్‌లు
- బెంగళూరులో కలకలం
- అంతా ఉత్తిదేనన్న పోలీసులు
- పిల్లర్ కూలిపోయిందంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్
- మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టిన ట్రక్కు



బెంగళూరు : మెట్రో పిల్లర్ కూలిపోయిందంటూ వదంతులు వ్యాపించడంతో బెంగళూరు వాసులు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. నగరంలోని మైసూర్ రోడ్డులో ఓ పిల్లర్ కూలిపోయిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. పలు టీవీ చానళ్లు కూడా బ్రేకింగ్ న్యూస్‌తో ఈ విషయాన్ని హోరెత్తించాయి. దీంతో ప్రజలు పోలీసులకు, కంట్రోల్ రూములకు ఫోన్ల మీద ఫోన్లు చేశారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వార్తలు అబద్ధమని తేల్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని, మెట్రో పిల్లర్‌కు ఎటువంటి నష్టమూ వాటిల్లలేదని పేర్కొన్నారు. నగర శివారులోని నయందహళ్లిలో నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో పిల్లర్ కొంత మేర దెబ్బ తిన్నది. ట్రక్కు డ్రైవర్ పరారయ్యాడు. అయితే, వాస్తవాన్ని తెలుసుకోకుండానే కొందరు సోషల్ మీడియాలో విపరీత ప్రచారం చేశారు. పిల్లర్ కూలిపోయిందని పోస్టులు పెట్టారు. దీంతో క్షణాల్లోనే ఈ వార్త నగరమంతా పాకిపోయింది. దీంతో స్పందించిన పోలీసులు, మెట్రో అధికారులు అవి వదంతులు మాత్రమేనని స్పష్టం చేసి, నమ్మవద్దని కోరారు.

త్వరలో కూలిపోనున్న చైనా స్పేస్ స్టేషన్

- భూమికి ముప్పు?
- ఏమీ కాదంటున్న చైనా
- బెడిసికొట్టిన చైనా ప్రయత్నం
- నియంత్రణ కోల్పోయి భూమికి దగ్గరైన స్పేస్ స్టేషన్
- 19 వేల పౌండ్ల బరువుతో వస్తున్న పెను విపత్తు
- మార్చిలోగా కూలిపోయే అవకాశం



న్యూఢిల్లీ : అంతరిక్ష రంగంలో అమెరికా, రష్యాలతో పోటీ పడాలని చైనా చేసిన ప్రయత్నం ఇప్పుడు భూమికి మహా వినాశనాన్ని తేనున్నదా? గతి తప్పిన చైనా అంతరిక్ష కేంద్రం భూమిని ఢీకొట్టనున్నదా? న్యూఢిల్లీ వంటి నగరాన్ని నామరూపాలు లేకుండా చేస్తూ, కోటి మందిని బలిగొనేంత శక్తితో ఆ స్పేస్ స్టేషన్ భూమిని తాకనున్నదా? అవుననే అంటున్నారు స్పేస్ సైంటిస్టులు. చైనా ప్రయోగించిన తియాంగాంగ్-1 స్పేస్ స్టేషన్ 19 వేల పౌండ్ల బరువుతో భూమిపై పడనుందని, గత సంవత్సరం మార్చిలో నియంత్రణ కోల్పోయిన ఇది నెమ్మదిగా భూమి వైపు వస్తూ, భూ కక్ష్యలోకి వచ్చేసిందని చెబుతున్నారు. ఇది ఉత్తర, దక్షిణ ధ్రువాల మధ్య 43 డిగ్రీల అక్షాంశంలో ఎక్కడైనా పడవచ్చని అంచనా వేస్తున్నారు. మార్చిలోగా ఇది భూమిని తాకుతుందని, దీని మార్గంలో న్యూయార్క్, లాస్ ఏంజిల్స్, బీజింగ్, రోమ్, ఇస్తాంబుల్, టోక్యో నగరాలు ఉన్నాయని తేల్చారు. దురదృష్టవశాత్తూ, గతి తప్పిన ఈ స్పేస్ స్టేషన్ ఈ నగరాల్లో ఒకదానిపై పడితే, భారీ భవనాలు సైతం నేలమట్టమై, అక్కడి జీవరాశి మొత్తం అంతరిస్తుందని సైంటిస్టులు వెల్లడించారు. కాగా, ఇది కూలిపోయినా పెద్దగా నష్టం ఉండదని, ఇందులో చాలా భాగం ఇప్పటికే కాలిపోయిందని, భూ వాతావరణంలోకి రాగానే, ఇది మొత్తం మండిపోతుందని చైనా చెబుతుండడం గమనార్హం. కాగా, ఇది ఇండియా, బ్రిటన్‌లపై కూలిపోయే అవకాశాలు ఏమాత్రం లేవని శాస్త్రవేత్తలు భరోసా ఇస్తున్నారు.

రాఖీ సావంత్‌పై పరువు నష్టం దావా వేసిన హనీప్రీత్ తల్లి

- రూ. 5 కోట్ల నష్టపరిహారానికి నోటీసు పంపించిన ఆశా తనేజా
- 30 రోజుల్లోగా క్షమాపణలు తెలియజేయాలని వ్యాఖ్య
- హనీప్రీత్ మీద తప్పుడు వ్యాఖ్యలు చేసిందని ఆరోపణ



చండీగఢ్ : డేరా బాబా ప్రియురాలు హనీప్రీత్ గురించి తప్పుడు వ్యాఖ్యలు చేసిందని ఆరోపిస్తూ ఆమె తల్లి ఆశా తనేజా బాలీవుడ్ నటి రాఖీ సావంత్‌కు పరువునష్టం దావా నోటీసులు పంపింది. తమ లాయర్ మోమిన్ మాలిక్ ద్వారా రూ. 5 కోట్ల నష్టపరిహారానికి నోటీసును పంపించింది. అంతే కాకుండా రాఖీ చేసిన వ్యాఖ్యలకు 30 రోజుల్లోగా క్షమాపణలు తెలియజేయాలని నోటీసులో పేర్కొంది. డేరా బాబా గుర్మీత్ సింగ్, హనీప్రీత్ ఇన్సాన్ మధ్య ఉన్న సంబంధం గురించి రాఖీ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి హనీప్రీత్‌కు చెడ్డ పేరు తీసుకువచ్చిన కారణంగా ఈ దావా వేస్తున్నట్లు ఆశా తనేజా వెల్లడించింది. గుర్మీత్ సింగ్‌తో ఒకప్పుడు మంచి స్నేహం నడిపిన రాఖీ సావంత్ ప్రస్తుతం ఆయన జీవిత కథ ఆధారంగా 'అబ్ హోగా ఇన్సాఫ్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. ఇందులో హనీ ప్రీత్ పాత్రను ఆమె పోషిస్తోంది. దీనికి సంబంధించి ఓ ఇంటర్వ్యూలో గుర్మీత్ బాబాకు తాను దగ్గరవుతుండడాన్ని హనీ ప్రీత్ జీర్ణించుకోలేకపోయిందని రాఖీ పేర్కొంది. ఆ వ్యాఖ్యలు హనీ ప్రీత్ వ్యక్తిత్వాన్ని కించపరిచేట్లుగా ఉన్నాయని ఆశా తనేజా తెలిపారు.

కుల్‌భూషణ్ నోటితో భారత్‌ను తిట్టించిన పాక్

- దాయాది నయా ఎత్తుగడ
- మరో వీడియో విడుదల చేసిన పాక్
- జైలు అధికారులు తనను బ్రహ్మాండంగా చూసుకుంటున్నారన్న కుల్‌భూషణ్ జాదవ్
- భారత దౌత్య అధికారులే తన తల్లిని అవమానించారని ఆరోపణ
- కొట్టి పారేసిన భారత్
- పాక్‌కు ఇది మామూలేనంటూ కౌంటర్



న్యూఢిల్లీ : దాయాది పాకిస్తాన్ మరో నాటకానికి తెర తీసింది. గూఢచర్యం కేసులో పాక్ జైలులో ఉన్న భారత నేవీ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌తో భారత్‌ను తిట్టించింది. పాక్ జైలులో ఉన్న కుమారుడిని చూసేందుకు జాదవ్ తల్లి, ఆయన భార్య ఇటీవల పాకిస్తాన్ వెళ్లారు. ఈ సందర్భంగా కుమారుడిని నేరుగా కలవకుండా ఆంక్షలు పెట్టిన పాక్ అధికారులు జాదవ్ తల్లి మెడలోని మంగళసూత్రాలు తీయించి, బొట్టును చెరిపివేయించి మరీ కుమారుడిని చూపించింది. పాక్ తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగానూ పాక్ తీరును పలువురు దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో గురువారం పాక్ విదేశాంగ శాఖ తాజాగా ఓ వీడియో విడుదల చేసింది. అందులో జాదవ్ మాట్లాడుతూ, పాకిస్తాన్ అధికారులు తనను బాగా చూసుకుంటున్నారని పేర్కొన్నాడు. తనను కలిసేందుకు తల్లి, భార్య వచ్చినప్పుడు ఇక్కడి భారత దౌత్య అధికారి (డిప్యూటీ హై కమిషనర్) అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. తాను ఇప్పటికీ భారత నేవీలో కమిషన్డ్ ఆఫీసర్‌గానే ఉన్నానని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. తాను గూఢచారిని కాదని భారత్ అబద్ధమాడుతోందని అందులో పేర్కొన్నారు. పాక్ అధికారులు తనను బాగానే చూసుకుంటున్నారన్న విషయం తన తల్లికి అర్థం అయిందని పేర్కొన్నారు. తనను కలిసి బయట అడుగు పెట్టగానే తన తల్లిని భారతీయ అధికారి గద్దించడం చూశానని ఆరోపించారు. గతంలో వలెనే పాక్ కుల్‌భూషణ్‌తో బలవంతంగా ఈ అబద్ధాలు ఆడించిందని భారత్ ఆరోపించింది. తల్లిని కలిసినప్పుడు అడ్డుగా గాజు తెర పెట్టిందని, అటువంటప్పుడు భారత అధికారి ఒకవేళ అతడి తల్లిపై అరిచి ఉంటే ఆ అరుపులు అటు వైపు ఉన్న జాదవ్‌కు ఎలా వినిపించాయో పాకిస్తానే చెప్పాలని డిమాండ్ చేసింది. భారత్‌పై దుష్ప్రచారంలో భాగంగానే ఈ వీడియోను విడుదల చేసిందని ఆరోపించింది. తల్లిని కలిసినప్పుడు అతడి శరీరంపై కనిపించిన గాయాలను బట్టే పాక్ ఎంతకు తెగించిందో అర్థమవుతోందని పేర్కొంది. ఇటువంటి పనులు పాక్‌కు అలవాటేనని, ఈ వీడియోను చూసి తామేమీ ఆశ్చర్యపోలేదని పేర్కొంది. ఇటువంటి ఎత్తుగడలు పాక్‌కు మామూలేనని దుమ్మెత్తిపోసింది. ఇటువంటి చవకబారు ఎత్తులతో నమ్మించలేమన్న సంగతిని పాక్ తెలుసుకుంటే మంచిదని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రావిష్ కుమార్ హితవు పలికారు.

నేరాలకు పాల్పడుతున్న యువతిని కాల్చి చంపుతున్న అమెరికా పోలీసులు



కెన్సాస్ : చేతిలో తుపాకీ పట్టుకుని హల్‌చల్ చేస్తున్న ఓ యువతిని అమెరికా పోలీసులు కాల్చి చంపారు. పోలీసుల యూనిఫామ్‌కు ఉన్న కెమెరాల్లో నిక్షిప్తమైన ఈ వీడియో విడుదలైంది. కెన్సాస్‌లో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. సియారా హోవార్డ్ అనే మహిళ పదే పదే నేరాలకు పాల్పడుతూ నిబంధనలను అతిక్రమిస్తుండడంతో ఆమెను అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెళ్లారు. ఆ సమయంలో తన ఇంటిలోనే ఉన్న ఆమె ఎంతకీ తలుపులు తీయలేదు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించిన అనంతరం పోలీసులు తలుపులను బద్దలు కొట్టి లోపలికి వెళ్లేసరికి చేతిలో తుపాకితో ఆమె కనిపించింది. తుపాకీని కింద పడేయాలని పోలీసులు ఎంతగా చెప్పినా వినిపించుకోకుండా వారిపై కేకలు వేస్తూ దూషించింది. చివరకు పోలీసులు ఆమెను కాల్చి చంపారు.


వెనిస్ ఎగ్జిబిషన్ నుంచి కోట్లాది రూపాయల విలువైన భారత ఆభరణాలు చోరీ



వెనిస్ : ఇటలీలోని వెనిస్ నగరంలో వెనెటియన్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న ఏఐ థాని కలెక్షన్ ఎగ్జిబిషన్ నుంచి విలువైన భారతీయ వజ్రాభరణాలు చోరీకి గురయ్యాయి. ఎగ్జిబిషన్ చివరి రోజైన బుధవారం చెవి ఆభరణాలు మాయమైనట్టు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన ఆభరణాలు మొఘలుల కాలం నాటి బంగారం, ప్లాటినమ్, వజ్రాలు పొదిగిన చెవి రింగులని వివరించారు. వీటి విలువ భారత కరెన్సీలో కోట్లాది రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం పది గంటల సమయంలో ప్యాలెస్‌లోని సెక్యూరిటీ అలారం మోగిందని, ఆ వెంటనే ఆ ప్రాంతాన్ని సీల్ చేశామని పోలీసులు తెలిపారు. అయితే, అప్పటికే దొంగలు మ్యూజియం నుంచి పరారయ్యారని వివరించారు. అలారం ఆలస్యంగా మోగేలా దొంగలు మేనేజ్ చేశారని, ఫలితంగా తప్పించుకోగలిగారని పేర్కొన్నారు. వారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

అతిపెద్ద ప్రధాన సంఖ్య కనిపెట్టిన శాస్త్రవేత్తలు

77232917గా గుర్తింపు



టెన్నెసీ : ప్రధాన సంఖ్యల్లో అతిపెద్ద ప్రధాన సంఖ్యను అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ టెన్నెసీ గణిత శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఈ సంఖ్యలో మొత్తం 23 మిలియన్ల అంకెలు ఉన్నాయి. దీనికి క్లుప్తంగా 77232917 అని పేరు పెట్టారు. రెండును 77,232,917 సార్లు గుణించి, వచ్చిన ఫలితం నుంచి ఒకటిని తీసివేయడం ద్వారా 23,249,425 అంకెలు ఉన్న ఈ అతిపెద్ద ప్రధాన సంఖ్యను గుర్తించారు. గతంలో గుర్తించిన అతిపెద్ద ప్రధాన సంఖ్య కంటే ఇందులో 10 లక్షల అంకెలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా రెండుకు ఘాతాలు చేసి, ఒకటిని తీసివేయడం ద్వారా ప్రధాన సంఖ్యను కనిపెట్టే విధానాన్ని ఫ్రెంచ్ సన్యాసి మారిన్ మెర్సీన్ కనిపెట్టారు. ఆయన పేరు మీదుగానే అతిపెద్ద ప్రధాన సంఖ్యలను మెర్సీన్ సంఖ్యలు అంటారు. ఇప్పటి వరకు 49 మెర్సీన్ సంఖ్యలు ఉన్నాయి. ఈ కొత్తగా కనిపెట్టిన ప్రధాన సంఖ్య 50వ మెర్సీన్ సంఖ్య. జోనథాన్ పేస్ అనే వ్యక్తి కంప్యూటర్‌లో ఆరు రోజుల పాటు నిరంతర కంప్యూటింగ్ చేసి ఈ ప్రధాన సంఖ్యను కనిపెట్టారు. ఇందుకు గాను పేస్‌కు 3000 డాలర్ల బహుమతి లభించనుంది.

మదర్సాల్లో మోడీ ఫోటో పెట్టాలని ఆదేశాలు

డెహ్రాడూన్ : మదరసాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలన్న ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఆదేశాలపై మదర్సా ఉపాధ్యాయులు మండిపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలను వారు తిరస్కరించారు. మదర్సాలలో వ్యక్తుల ఫోటోలు పెట్టడం ఇస్లాంకు వ్యతిరేకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాము మోడీ ఫోటోను పెట్టబోమని అన్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. మదర్సాలకు రాజకీయ రంగు పులమవద్దని రూర్కీకి చెందిన మదర్సా ఉపాధ్యాయుడు ఎహసాన్ సాహెబ్ కోరారు. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

కులభూషణ్ జాదవ్‌ను పాక్‌కు అప్పగించింది ఇతనే!



న్యూఢిల్లీ : ఇరాన్‌లో ఉన్న చాబహార్ పోర్టుకు దాదాపు 50 కిలో మీటర్ల దూరంలోని సర్బాజ్ పట్టణంలో ఉన్న భారత నేవీ ఉద్యోగి కులభూషణ్ జాదవ్‌ను కిడ్నాప్ చేసి, పాకిస్తాన్‌కు అప్పగించారని, జాదవ్‌ను జైషే ఉల్ అదిల్ అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ముల్లా ఒమర్ ఇరానీ అనే వ్యక్తి కిడ్నాప్ చేశాడని భారత భద్రతా దళాలు గుర్తించి, అతని ఫోటోను విడుదల చేశాయి. లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉంటూ, పాక్ సైన్యంతో కలసి పని చేస్తున్న జైషే ఉల్ అదిల్, బెలూచిస్తాన్ ప్రాంతంలో ఉద్యమాన్ని అణగదొక్కడంలో సహకరిస్తోందని, హఫీజ్ సయీద్ ఆదేశాలతో ఇరాన్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతోందని ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సంస్థకు ఇరాన్, బహ్రెయిన్ తదితర ప్రాంతాల్లోని పాకిస్తాన్ ఎంబసీలు నిధులు అందిస్తున్నాయని తెలిపారు. కాగా, పాకిస్తాన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ జాదవ్ మాట్లాడినట్టున్న ఓ వీడియో ప్రకటన విడుదలైన కొద్దిసేపటికే అతన్ని కిడ్నాప్ చేసిన వ్యక్తి వివరాలను భారత్ బహిర్గతం చేయడం గమనార్హం.

శబరిమలకు వెళ్లే మహిళలకు వయసు ధ్రువీకరణ తప్పనిసరి



తిరువనంతపురం : కేరళలోని శబరిమలై అయ్యప్ప సన్నిధానంలోకి 10 నుంచి 50 ఏళ్ల వయసు ఉన్న మహిళల ప్రవేశంపై నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. అయితే, గత కొన్ని నెలలుగా అక్రమంగా లోపలికి ప్రవేశించడానికి కొంత మంది ప్రయత్నిస్తున్న నేపథ్యంలో వారిని అరికట్టడానికి ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు ఓ కొత్త నిబంధనను తీసుకువచ్చింది. దీని ప్రకారం లోపలికి వెళ్లాలనుకున్న బాలికలు, మహిళలు తమ వయసును ధ్రువీకరించాల్సి ఉంటుంది. అందు కోసం చెకింగ్ సమయంలో వయసు ధ్రువీకరించే ఆధార్, ఎన్నికల గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ వంటి పత్రాలను సమర్పించాలని బోర్డు అధ్యక్షుడు ఎ. పద్మకుమార్ సూచించారు. నైష్ఠిక బ్రహ్మచారి అయిన అయ్యప్ప స్వామి సన్నిధానంలోకి రుతుక్రమంలో ఉన్న మహిళలు ప్రవేశించడానికి వీలు లేదు. అలాగే ఈ నెల 14 వరకు అయ్యప్ప భక్తుల రద్దీ ఎక్కువగా ఉండబోతున్న కారణంగా ధ్రువీకరణ పత్రం సమర్పించడమనే నిబంధన వల్ల చెకింగ్ పనులు సులభతరం అయ్యే అవకాశం ఉంది.

రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధి

- మిషన్ కాకతీయ ద్వారా సాగునీరు
- భగీరథ ద్వారా తాగునీరు ఇప్పుడెమో నిరంతర కరెంట్
- స్పీకర్ మధుసూదనాచారి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకెళ్తున్నామని శాసనసభాస్పీకర్ మధుసూదనాచారి అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీరు అందిస్తోన్న తెలంగాణ రాష్ట్రం, ఇప్పుడు నిరంతర విద్యుత్ సరఫరాతో మరో ఘనత సాధించిందన్నారు. రాష్ట్ర రైతాంగానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఆయన ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2018 డైరీని మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరయి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, సిఎండి రఘుమారెడ్డితో పాటు విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని మధుసూదనాచారి అన్నారు. ఆనాడు ప్రతి అంశాన్ని ఒక్క ఆయుధంగా తీసుకొని ఉద్యమంలో ముందుకు కదిలారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు ,నిధులు, కరెంట్ ఎక్కడి నుంచి వస్తది అని హేళన చేసినవారికి రాష్ట్రం సాధించుకున్న తరువాత నిరంతర విద్యుత్‌తో సమాధానం చెప్పినట్లయిందన్నారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు తక్కువ సమయంలో రాత్రింభవళ్లు శ్రమించి, 24 గంటల విద్యుత్ అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే 'శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సందర్భంగా ఈసంఘం ఆవిర్భావించిందని గుర్తు చేశారు. గతంలో ఈసంఘం డైరీని అవిష్కరిస్తే కొంతమంది నవ్వేవారన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులు అంటే రైతులకు ,ప్రజలకు ఆగ్రహం వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు 24 గంటల విద్యుత్ ఇస్తూ అన్నివర్గాల ప్రజలకు చేరువ అవుతున్నారని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సీఎండీ రఘుమారెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల కష్టఫలితమే నేటి 24 గంటల విద్యుత్ సరఫరా అని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు 24 గంటలు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని ముఖ్యమంత్రి కేసీఆర్ కితాబునివడం ఆనందంగా ఉందన్నారు.







రేషన్ బియ్యం రీసైక్లింగ్

- అధికారుల నిఘాతో దొరికిన దొంగలు
- ప్రభుత్వానికే బియ్యం అమ్ముతున్న కేటుగాళ్లు
- ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ ప్రభుత్వం నిరు పేదల సంక్షేమం కోసం సబ్సిడీపై రేషన్ షాపుల ద్వారా ఒక్క రూపాయికే కిలో చొప్పున పంపిణీ చేస్తున్న బియ్యాన్ని స్వార్థపరులైన కొంతమంది మిల్లర్లు ఆ బియ్యాన్ని తిరిగి పౌరసరఫరాల శాఖకే అమ్మిన వైనం వెలుగులోకి వచ్చింది. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై పౌరసరఫరాల శాఖ నిఘా బృందం ద్వారా సమాచారం అందుకున్న కమిషనర్ సివి. ఆనంద్ నేరుగా రంగంలోకి దిగి తనదైన శైలిలో బియ్యం దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే గోదాం ఇంచార్జీపై వేటు వేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కమిషనర్ తీవ్రంగా స్పందించారు. అందుకు ప్రధాన కారకులైన రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రదారులైన నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. అలాగే ఆయా మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఈ జిల్లాలో మిల్లర్ల నుండి దొడ్డు బియ్యం, సన్న బియ్యం కొనుగోలును నిలిపివేశారు. రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్‌కు తమ సభ్యులపై నిఘా లేకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. పేదల బియ్యాన్ని దిగమింగడానికి ప్రయత్నం చేస్తే సహించేది లేదని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లింగ్, తదితర ఛార్జీలు నిలిపివేస్తామని, అలాగే మిల్లర్లపై క్రిమినల్ కేసులతో పాటు మిల్లులను సీజ్ చేయడానికి ఏమాత్రం వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ, మిల్లర్ల మధ్య ఒక నమ్మకం, సమన్వయంతో కలిసి పనిచేస్తున్న ప్పుడు, మళ్లీ పాత తప్పులనే పునరావృతం చేయడం, మోసాలకు పాల్ప డటం సహించరానిదన్నారు. ప్రజాపంపిణి అవసరాల మేరకు ప్రభుత్వం దగ్గర సరిపడినన్ని బియ్యం నిల్వలు లేకపోవడంతో ప్రతి ఏటా మిల్లర్ల నుండి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని, ప్రభుత్వ వసతి గృహాలు, మధ్యాహ్న భోజనం పథకం కోసం 1.50లక్షల మెట్రిక్ సన్నబియ్యాన్ని మిల్లర్ల నుండి కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది టెండర్ ప్రక్రియ ద్వారా మిల్లర్ల నుండి కొనుగోలు చేసింది. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు సరఫరా చేసిన దొడ్డు బియ్యం నిల్వలు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని సిడబ్ల్యూసీ గోదాములో ఉన్నాయి. రెండు రోజుల క్రితం పౌరసరఫరాలశాఖ సాంకే తిక సిబ్బంది ఈ గోదాముల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో రేషన్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారం బహిర్గతమైంది. 1080(50కేజీలు) బస్తాలు రేషన్ బియ్యంగా గుర్తించారు. దీని విలువ రూ.15లక్షల మేరకు ఉంటుంది.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

మంత్రి కేటీఆర్‌తో బీసీ నేతల భేటీ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో బీసీలకు 35శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుతో బీసీ సంక్షేమ సంఘం నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ నేతృత్వంలో మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. జనాభాలో 59శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, ఉద్యోగ పరంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, అందుకోసం ప్రభుత్వం నిర్మించే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో రిజర్వేషన్లు కల్పించాలని కృష్ణయ్య మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు టి.నందగోపాల్, నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేశ్, సంజయ్ కుమార్, ఎన్.భూపేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్లకు కరాటే శిక్షణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్నంగా మహిళా కండక్టర్లలో ఆత్మస్థైర్యం, మనో ధైర్యాన్ని పెంచడానికి చేపట్టిన రెండు రోజుల కరాటే శిక్షణా తరగతలు హకీంపేటలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం హకీంపేటలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ జి.ఆర్.కిరణ్ ఆదేశాల మేరకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జీడిమెట్ల, గ్రేటర్ హైదరాబాద్ జోన్లలో ఉన్న పలు డిపోలకు చెందిన 66మంది మహిళా కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లు అనిత, కమలాబాయిలు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ శిక్షణతో ఎంతో మానసికంగా ఉంటున్నామని, దీంతో సక్రమంగా విధులు నిర్వహిస్తూ సంస్థ ఆదాయాన్ని పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను విజయవంతం చేసినందుకు కరాటే కోచ్ ఆర్ఎ.స్వామిని కిరణ్ అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సిబ్బంది రాజశేఖర్, సుధాకర్, జి.కృష్ణ, కె.శ్రీనివాస్, కెవి.రమణ, ఎ.రామకోటి, టీఆర్ రెడ్డి, ఎవి.చారి, నిర్జన్, సోమిరెడ్డిలను కిరణ్ అభినందించారు.

జన్మభూమి ప్రపంచం మొత్తం ఆకర్షిస్తోంది

4వ రోజు జన్మభూమి నిర్వహణపై టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

జన్మభూమి 3 రోజుల్లో 3,77,863 ఫిర్యాదులు

(వెలగపూడి నుంచి 'సూర్య ప్రత్యేక ప్రతినిధి): మన జన్మభూమి ప్రపంచం మొత్తం ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇది మనందరం గర్వపడాల్సిన అంశం అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి జన్మభూమి నోడల్ అధికారులు,వివిధ శాఖల అధికా రులు, జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిం చారు. గత మూడురోజులు జన్మభూమి అద్భుతంగా జరిగిందని, ఇదే స్ఫూర్తిని రాబోయే 7రోజుల్లో కూడా చూపించాలని కోరారు. 80 శాతం సంతృప్తి ప్రజల్లో రావాలి, సానుకూలత సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 15శాతం వృద్ధిరేటు రాబోయే 15ఏళ్లు కొనసాగించాలని, ప్రతి శాఖ సామర్థ్యం పెరగాలని, పనితీరు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి. ఒక్క ఫిర్యాదు కూడా పెండింగ్ ఉండకూడదు. 11వ తేదీకల్లా అన్ని ఫిర్యాదులు రియల్ టైంలో పరిష్కరిం చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అధికారులు, ఉద్యోగుల్లో మరింత అవగాహన పెరగాలన్నారు.సాధికారమిత్రల సహకారంతో ఫిర్యాదు దారులను గుర్తించాలన్నారు. జనవరి వరకు 7,78,422 ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయని, ఈ జన్మభూమి 3రోజుల్లో 3,77,863 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పింఛన్ల అర్జీలను త్వరితగతిన అప్ లోడ్ చేయాలన్నారు. హవుసింగ్ 28,000, సివిల్ సప్లయిస్ 22,000, పెన్షన్లు 11,380, ఇళ్లపట్టాల కోసం 10,134 అర్జీలు వచ్చాయని గుర్తుచేశారు.

ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలి

గ్రామసభల్లో మాట్లాడుతున్న చిన్నారులను చూస్తే ముచ్చట వేస్తోంది. మన పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రామసభల్లో చిన్నారులతో మాట్లాడించి వారిలో సమస్యల పట్ల అవగాహన, సామాజిక బాధ్యత పెంచాలన్నారు. అభివృద్ధిపై ప్రజల్లో స్పష్టత ఉంది,అవగాహన ఉందంటూ, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే స్థాయికి చేరుకోవాలన్నారు.

3వరోజు జన్మభూమిపై ప్రజాభిప్రాయం ఇదే

జన్మభూమిలో మీరు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 56 శాతం అవునని,29 శాతం లేదని,15శాతం తెలియదని అన్నారు. అధికారులు పాల్గొన్నారా అని అడిగితే 93శాతం అవునని,73 లేదని జవాబిచ్చారు. అధికారులు మీకు అవగాహన కల్పించారా అన్న ప్రశ్నకు 83శాతం అవునని,17శాతం లేదని అన్నారు. సమస్యలపై అధికారుల స్పందన బాగుందా అని అడిగితే 75% అవునని,25 శాతం లేదని అన్నారు. సాధికార మిత్రలు జన్మభూమిలో పాల్గొన్నారా అని అడిగితే 52% అవునని,48% లేదని జవాబిచ్చారు.డిబేట్ చేసిన అంశం అర్థమైందా అని అడిగితే 88% అవునని,12% లేదని తెలిపారు.జన్మభూమి మీకు ఉపయోగంగా ఉందా అన్న ప్రశ్నకు 87% అవునని,13% లేదని అన్నారు.పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అంటే 68% అవునని,32% లేదని అన్నారు.రేషన్ కార్డులు వచ్చాయా అని అడిగితే 66% అవునని,34% లేదని అన్నారు.చంద్రన్న బీమాపై సంతృప్తిగా ఉన్నారా అంటే 70శాతం అవునని,30శాతం లేదని జవాబిచ్చారు.అర్జీల పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా అంటే 49శాతం అవునని,51శాతం లేదని అన్నారు.దీనినిబట్టి ఫిర్యాదుల పరిష్కారం మరింత వేగం పుంజుకోవాల్సి వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.ప్రజలనుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు.

3వరోజు టాప్ టెన్ మండలాలు,గ్రామాలు ఇవే

మూడవరోజున విశాఖ అర్బన్,చెరుకుపల్లి,విస్సన్నపేట, పెద్దాపురం, కడియం, యలమంచిలి,మొవ్వ,పెందుర్తి మండలాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.మిగిలిన మండలాలు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని, ఒకరితో మరొకరు పోటిబడాలని పిలుపునిచ్చారు. కాకుమాను, పాలకొల్లు , పొన్నూరు, మేడికొండూరు, రాజాం, ఉంగుటూరు, పెదన, కసింకోట, పామిడి గ్రామాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయన్నారు. మిగిలిన గ్రామాలు కూడా పోటిబడి జన్మభూమిని విజయవంతం చేయాలని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా శాఖ,రియల్ టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన అధికారులు సంజయ్ గుప్తా,అహ్మద్ బాబు, రామాంజనేయులు, కృష్ణమోహన్, మురళి ,వివిధ జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

- 3,449 కోట్లు ఖర్చుతో మౌలిక వసతులు
- 5 వేల పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు
- బాలికలకు 79.50 కోట్ల ఖర్చుతో సైకిళ్లు పంపిణీ
- స్కూళ్లకు బయోఫెన్సింగ్ ఏర్పాటు
- ఇళ్లకు తక్కువ ధరకే ఫైబర్‌నెట్
- ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్



(పాలకొల్లు నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఐటి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం మంత్రి నారా లోకేష్ పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా పాలకొల్లు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. 5 విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా అధికారులు,ప్రజాప్రతినిధులు మీ ముందుకు వస్తున్నారని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రియల్ టైం గవర్నెన్స్ అందిస్తున్నామన్నారు. 1100 కు ఫోన్ చేస్తే చాలు ఎలాంటి సమస్య ఉన్నా ప్రభుత్వమే మీ ఇంటికి వచ్చి సమస్య పరిష్కరిస్తుందన్నారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ప్రజలు తమ సమస్యను చెప్పే లోపే గుర్తించి పరిష్కరించాలి అనే లక్ష్యంతో పని చేస్తున్నామని, కానీ ఎలాంటి పరిస్థితుల్లో మన రాష్ట్రం ఏర్పడిందో మనం గుర్తు పెట్టుకోవాలన్నారు. 2014లో కట్టు బట్టలతో మనల్ని బయటకు గెంటేశారని, లోటు బడ్జెట్ ఎటు చూసినా సమస్యలు అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బస్సులో ఉంటూ పరిపాలన ప్రారంభించారని, మన ముఖ్యమంత్రి సమస్యలు ఉన్నాయి కదా అని సంక్షేమాన్ని పక్కన పెట్టలేదని, ఖజానాలో రూపాయి లేక పోయినా మా అవ్వా తాతలకు వెయ్యి రూపాయల పెన్షన్ ఇచ్చారన్నారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా రైతన్నలు ఆత్మహత్యలు చేసుకోగోడదు అని రైతు రుణమాఫీ చేశారని, అభివృద్ధి పనులకు కావలసిన నిధులు లేకపోయినా ఆడ బిడ్డల కళ్లలో ఆనందం చూడాలని డ్వాక్రా రుణ మాఫీ చేశారని, రూ.6 వేలు ఇచ్చారని, మరో రూ.4 వేలు త్వరలోనే ఇస్తామన్నారు. 2014 కు ముందు గ్రామాల్లో కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి అని, కానీ ఇప్పుడు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని, అంతే కాదు త్వరలోనే మీకు ఇష్టం అయిన సీరియల్,సినిమా,టీవీ ఛానెల్ చూసుకోవచ్చు.పట్నంలో ఉన్న మీ పిల్లలతో ఫోన్లో వైఫై ద్వారా మాట్లాడుకునేలా తక్కువ ధరకే ఫైబర్ నెట్ అందిస్తున్నామని, 2014 కు ముందు గ్రామాల్లో సిసి రోడ్లు లేవని, కానీ ఇప్పుడు ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేశామన్నారు. లోటు బడ్జెట్ ఉన్నా ప్రజలకు లోటు లేకుండా లక్ష కోట్ల రూపాయిలతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, గత పాలకుల హయాంలో విద్యార్థులు స్కూల్ కు వెళ్లాలి అంటే బయపడేవారని, స్కూల్స్ లో సరైన వసతులు ఉండేవి కావని, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాలు, కూర్చోవడానికి బల్లలు ఉండవు కావని, కనీసం మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి ఉండేదన్నారు. కానీ మన ప్రభుత్వం వచ్చిన తరువాత 3,449 కోట్లు ఖర్చు చేసి స్కూల్స్‌లో మెరుగైన మౌలిక వసతులు కల్పించామని, 5 వేల పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నామని, బాలికలకు 79.50 కోట్ల ఖర్చుతో సైకిళ్లు పంపిణీ చేశామని చెప్పారు. ఉపాధిహామీ పథకం ద్వారా స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, స్కూళ్లకు బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ఆట స్థలాలు నిర్మాణం చేస్తున్నామని, మినీ స్టేడియంలు నిర్మిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ్ ఆంధ్రా కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వారికి స్వచ్ఛత పై అవగాహన కలిపిస్తున్నామని, స్వచ్ఛత పై అవగాహనకు స్కూల్స్ లో ప్రత్యేక కిట్స్ ఇస్తున్నామన్నారు. మీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గా అనేక నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నానన్నారు. 2019 నాటికి 12918 గ్రామాల్లో 30 లక్షల ఎల్ఈడి బుల్బులు ఏర్పాటు చేయబోతున్నామని, 2019 నాటికి ప్రతి గ్రామంలో మిగిలిన సిసి రోడ్లు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని, గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా 157 గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఆదేశాలతో 10 స్టార్ రేటింగ్ ఇవ్వబోతున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్, గ్యాస్ కనెక్షన్, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు డంప్ యార్డ్ నిర్మాణం, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి ఫైబర్ నెట్ కనెక్షన్, ప్రతి కుటుంబానికి 10 వేల ఆదాయం కల్పించడం, అందరికి విద్య మరియు అనుబంధ విషయాలు, ఆరోగ్యం,పౌష్టిక ఆహారం వీటి ఆధారంగా గ్రామాలకు ప్లాటినం, గోల్డ్,సిల్వర్,బ్రాంజ్ రేటింగ్ ఇవ్వబోతున్నామని చెప్పారు. 2022 నాటికి అన్ని గ్రామాలు టెన్ స్టార్ రేటింగ్ సాధించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

గవర్నర్, కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం?

- గవర్నర్ తీరు పట్ల కాంగ్రెస్ నేతల నిరసన
- రాష్ట్రంలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- ఇసుక మాఫియా ఆగడాల్ని అరికట్టాలి
- గతంలో నేరెళ్ల ఇప్పుడు కారేగాంలో దారుణం
- ట్రాక్టర్‌తో తొక్కించి వీఆర్‌ఏ సాయిలు హత్య
- ఇసుక అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- గవర్నర్ నర్సింహన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నర్సింహన్‌తో రాజ్‌భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు వాగ్వివాదానికి దిగారా? అంటే అవుననే ఆపార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు, మంద కృష్ణ అరెస్టును నిరసిస్తూ టీ–పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సీఎల్పీనేత జానారెడ్డి, మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ, కేంద్రమాజీమంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యేలు డీకే అరుణ, సంపత్ కుమార్‌తోపాటు పలువురు ఆయన్ని కలిసి ఫిర్యాదు చేసేం దుకు శుక్రవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఇసుక మాఫి యాపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని గవర్నర్ వ్యాఖ్యా నించారని కాంగ్రెస్ నాయకుడొకరు తెలిపారు. అంతటితో ఆగకుండా, మందకృష్ణ మాదిగ చట్టాన్ని చేతుల్లోకి తీసుకు నేవిధంగా వ్యవహరించాల్సి ఉండింది కాదని ఆయన పేర్కొం దం పట్ల పార్టీ సీనియర్లు తీవ్రంగా స్పందిస్తూ , రాష్ట్రంలో ఏమి జరుగుతుందో మీకు తెలుస్తోందా? అని గవర్నర్‌ను ప్రశ్నించి నట్లు సమాచారం. గవర్నర్‌గా మీరు ఉన్నతంగా వ్యవహరిం చాలని అంతేకానీ ఒక పార్టీ కార్యకర్తగా మాదిరిగా వ్యవహరిం చొద్దంటూ కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు రోజుకింత పెరిగిపోతున్నాయని టీ–పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ధనార్జనే ధ్యేయంగా ఇసుక కాంట్రాక్టర్లు చేస్తున్న దౌర్జన్యాలతో పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉత్తమ్ నేతృత్వంలో కాంగ్రెస్‌నేతల బృందం గవర్నర్ నర్సింహన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ గవర్నర్‌ను కలిసి రెండు అంశాలపై ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇసుక మాఫియా ఆగడాలపై, మందకృష్ణ అక్రమ అరెస్టును గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని చెప్పారు. నెరేళ్ల ఘటన మరవకముందే కామారెడ్డి జిల్లా పొట్లం మండలం కారేగాంలో వీఆర్‌ఏ సాయిలును ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కించి అమానుషంగా చంపిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫీయా వల్ల రాష్ట్రానికి పర్యావరణానికి తీరని నష్టంమని ఉత్తమ్ పేర్కొన్నారు. పొట్లం మండల పరిధిలోని కారేగాం గ్రామ పరిధిలోని ఇసుక మాఫియా ఎవరినీ ఎందుకు రానీయడం లేదని ప్రశ్నించారు. అంతర్జాతీయ విషయాలపై ట్విట్టర్ స్పందించే మంత్రులు, అధికారపార్టీ నేతలు, ఇసుకాసురుల ఆగడాలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సొంత శాఖలో జరుగుతోన్న ఘోరాలపై అమాత్యులు స్పందించ కపోవడం వెనుక మతలబు ఏమిటనీ ఉత్తమ్ ప్రశ్నించారు. ఇసుక మాఫియా రెచ్చిపోయి నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా వ్యవహరిస్తున్న చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇసుక మాఫియా కింది స్థాయి అధికారులను బెదిరిస్తున్నారని, గతంలో రూ.15 వేల రూ.లు ఉన్న లారీ ఇసుక ఇప్పుడు రూ.60 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. నేరెళ్లలో ఇసుక మాఫియాకు అండగా ఉన్న ఎస్పీపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కూడా చేయలేదని ఉత్తమ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గాంధేయ మార్గంలో తన కార్యాలయంలో దీక్ష చేస్తుంటే ఆయన్ని అరెస్టు చేయడం ఏమిటనీ ఉత్తమ్ ప్రశ్నించారు. సాయిలు మృతికి కారణమైన ఇసుక కాంట్రాక్టర్‌పై హత్యకేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అలాగే సాయిలు కుటుంబానికి 25 లక్షల రూ.ల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. గతంలో నేరెళ్ల ఇసుక మాఫియా ఆగడాలను బలైన బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇసుక అక్రమాలకు సంబంధించి ఏసీబీ చేత సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. ఇసుక విధానంపై నిపుణులు, అఖిలపక్ష నేతలతో పునసమీక్ష జరిపి, సరైన విధానాన్ని రూపొందించాలన్నారు. గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతల బృందంలో సీఎల్పీనేత జానారెడ్డి, మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ, కేంద్రమాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మండలి ఉపనేత సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు నెరేళ్ల శారద తదితరులు ఉన్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·